



# నినాదం

నిఖార్సైన జర్నలిజం

సంపుటి : 22 సంచిక : 76 పేజీలు : 12, వెల రూ. 5రూ/ మంగళవారం - 03 - ఫిబ్రవరి - 2026

Published From Kurnool ; Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor., Kadapa, Anantapuram, Hyderabad


## రాష్ట్రంలో హింసను ప్రేరేపించాలని చూస్తోంది..

### రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తోందని... ఆ ట్రాప్ లో పడొద్దు

- వైసీపీపై చంద్రబాబు ఫైర్
- అధికారం కోల్పోయామనే అసహనంతో రెచ్చగొట్టేందుకు యత్నం
- ఆ పార్టీ ట్రాప్ లో పడొద్దంటూ పార్టీ నేతలకు సూచన
- మంత్రులు, టీడీపీ సీనియర్ నేతలతో సీఎం టెలీకాన్ఫరెన్స్



అమరావతి: ఆంధ్రప్రదేశ్ లో అలజడి సృష్టించాలని, హింసను ప్రేరేపించాలని వైసీపీ ప్రయత్నిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపించారు. ఇందులో భాగంగానే రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తోందని... ఆ ట్రాప్ లో పడొద్దని టీడీపీ నేతలకు ఆయన సూచించారు. ఈ మేరకు మంత్రులు, పార్టీ సీనియర్ నేతలతో ఆయన ఈ రోజు ఉదయం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారం కోల్పోయామనే అసహనంతోనే వైసీపీ రెచ్చగొట్టాలని చూస్తోందని చంద్రబాబు చెప్పారు. మిగతా.. 2లో

## నిడదవోలులో 3 ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపండి...

### కేంద్ర మంత్రికి పురందేశ్వరి విజ్ఞప్తి




కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరిన రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి

జన్మభూమి, కోకనాడ, లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్‌ల నిలుపుదలకు వినతి

ప్రయాణికుల ఇబ్బందులను తొలగించి, రైల్వే ఆదాయం పెంచాలని సూచన

అమరావతి: ప్రయాణికుల సౌకర్యార్థం తూర్పు గోదావరి జిల్లా మిగతా.. 2లో



## ఇదేనా మీ రూల్ ఆఫ్ లా?

### కూటమి ప్రభుత్వంపై రోజా ఫైర్

- చంద్రబాబు ప్రభుత్వంపై మాజీ మంత్రి రోజా తీవ్ర విమర్శలు
- అధికారంలోకి రాగానే వైసీపీ నేతలపై దాడులు చేస్తున్నారని ఆరోపణ
- పలువురు మాజీ మంత్రులు, నేతల ఇళ్లపై దాడులు జరిగాయన్న రోజా
- ఇదేనా చంద్రబాబు చెప్పిన 'రూల్ ఆఫ్ లా' అని సూటి ప్రశ్న
- సాక్షి, డెక్కన్ క్రానికల్ కార్యాలయాలపైనా దాడులని వెల్లడి

### 93 ఏళ్ల వయసులో 'మెట్రోమ్యాన్' కొత్త లక్ష్యం..

## కేరళ హైస్పీడ్ రైలుపై శ్రీధరన్ పట్టు



93 ఏళ్ల వయసులోనూ తగ్గని స్ఫూర్తితో 'మెట్రోమ్యాన్' శ్రీధరన్

కేరళ హైస్పీడ్ రైలు ప్రాజెక్టు కోసం కార్యాలయం ప్రారంభం

## చైనా యుద్ధ ట్యాంకులు భారత్ సరిహద్దులను దాటాయి

- రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై లోక్‌సభలో వాగ్వాదం
- రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ సభ్యుల నిరసన
- ఆర్మీ మాజీ చీఫ్ పుస్తకంలోని అంశాలను ప్రస్తావించిన రాహుల్ గాంధీ
- ప్రచురణ కాని పుస్తకంలోని అంశాల గురించి మాట్లాడవద్దన్న బీజేపీ



ఢిల్లీ: ఐదేళ్ల క్రితం నాటి డొక్లామ్ సరిహద్దు ఉద్రిక్తతల అంశాన్ని లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రస్తావించడంతో గందరగోళం ఏర్పడింది. చైనా యుద్ధ ట్యాంకులు భారత్ సరిహద్దులను దాటాయని రాహుల్ గాంధీ లోక్‌సభలో అన్నారు. ఆయన వ్యాఖ్యలపై బీజేపీ సభ్యులు నిరసన తెలిపారు. మిగతా.. 2లో

### పసిడి ప్రియులకు శుభవార్త.. బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయిలో పతనం!

తులం బంగారంపై ఒక్కరోజే రూ.9,050 పతనం




కిలో వెండిపై ఏకంగా రూ.50,000 తగ్గుదల

లాభాల స్వీకరణతోనే తగ్గుతున్నాయని అంచనా

### ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణపై

## కవిత కీలక వ్యాఖ్యలు

- సిట్ పిలిస్తే విచారణకు వెళతానన్న జాగృతి అధ్యక్షురాలు
- విచారణ సుదీర్ఘంగా కొనసాగడంపై విమర్శలు
- త్వరగా పూర్తిచేసి దోషులను శిక్షించాలని డిమాండ్



హైదరాబాద్: తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ట్యాపింగ్ వ్యవహారంలో విచారణను తొందరగా ముగించి దోషులకు శిక్ష పడేలా చేయాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సిట్ విచారిస్తున్న విషయం తెలిసిందే. ఈ కేసులో అధికారులకు మిగతా.. 2లో

### ఏపీ, తెలంగాణలకు హైస్పీడ్ రైళ్లు గేమ్ ఛేంజర్..

### బెంగళూరుకు 2 గంటల్లో చేరుకోవచ్చు: అశ్వినీ వైష్ణవ్



తెలంగాణ, ఏపీ, తమిళనాడు మధ్య ఆర్థిక, హెల్త్ టూరిజం అభివృద్ధి చెందుతుందన్న కేంద్రమంత్రి

బడ్జెట్‌లో తెలంగాణలో రైల్వే పనులకు రూ.5,454 కోట్లు కేటాయింపు

## కేంద్ర ప్రభుత్వానికి ఆలోచనలు కరవయ్యాయి

- బడ్జెట్‌పై ఖర్గే విమర్శలు.. దీటుగా బదులిచ్చిన బీజేపీ
- ప్రభుత్వానికి విధానపరమైన దార్శనికత లోపించిందన్న ఖర్గే
- ప్రధాని మోదీకి వికసిత్ భారత్ పై స్పష్టమైన విజన్ ఉందన్న కమలం
- ఆర్థిక క్రమశిక్షణ, జాతీయ భద్రతకు బడ్జెట్‌లో ప్రాధాన్యమన్న బీజేపీ



ఢిల్లీ: కేంద్ర బడ్జెట్ 2026-27పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన తీవ్ర విమర్శలకు బీజేపీ గట్టిగా బదులిచ్చింది. ప్రధాని మోదీ అభివృద్ధి అజెండాను, ప్రపంచ ఆర్థిక వాస్తవాలను కాంగ్రెస్ విస్మరిస్తోందని కమలం పార్టీ అధికార ప్రతినిధి ప్రతుల్ షా డియో మండిపడ్డారు. ఈ సందర్భంగా ప్రతుల్ షా మాట్లాడుతూ, మిగతా.. 2లో

### తెలంగాణకు అప్పుడే తాడిచెర్ల-

## 1 గనులు కేటాయించాం

2015 ఆగస్ట్ 31న తెలంగాణ విద్యుత్ సంస్థకు కేటాయించినట్లు వెల్లడి

రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో తాడిచెర్ల కోల్ బ్లాక్ గురించి స్పందించిన కేంద్రమంత్రి



బొగ్గు గనులను ప్రభుత్వరంగ సంస్థలకు కేటాయించడం లేదన్న తమిళనాడు ఎంపీ


ఢిల్లీ: తాడిచెర్ల-1 బొగ్గు గనుల విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. 2015 ఆగస్ట్ 31న తెలంగాణ విద్యుత్ సంస్థకు దీనిని కేటాయించినట్లు తెలిపింది. ఈ మేరకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాజ్యసభలో వెల్లడించారు. 2019 మార్చిలో ఉన్నత స్థాయి కమిటీ నివేదిక ఆమోదం అనంతరం, 2020 జూన్ నుంచి బొగ్గు గనుల కేటాయింపుల ప్రక్రియ మారినట్లు తెలిపారు. మిగతా.. 2లో

## 2026-27 కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మరోసారి మొండిచెయ్యే

### ఎప్పటిలాగే కేంద్ర బడ్జెట్ తెలంగాణకు తీవ్ర నిరాశ

- రాష్ట్రానికి నిర్మలమ్మ నిరాశే మిగిల్చారు
- పెండింగ్ బకాయిలు, ప్రభుత్వ ప్రతిపాదనలు, విభజన హామీలకు కలగని మోక్షం
- సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎంపీల విజ్ఞాపనలు బుట్టదాఖలు
- ట్రిపుల్ ఆర్, మెట్రో రైలు, రేడియల్ రోడ్ల తదితర మౌలిక వసతుల ప్రస్తావన లేదు

మినహా ఈసారి బడ్టెట్‌లో కూడా తెలంగాణ ప్రస్తావన కనిపించలేదు.



హైదరాబాద్: ఎప్పటిలాగే కేంద్ర బడ్జెట్ తెలంగాణకు తీవ్ర నిరాశను మిగిల్చింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 202627 వార్షిక బడ్జెట్‌లో రాష్ట్ర ఆర్థికాభివృద్ధి కోసం ఎలాంటి ప్రత్యేక కేటాయింపులు చూపెట్టలేదు. దేశ వ్యాప్తంగా ప్రకటించిన ఏడు రైల్వే కారిడార్లు ( మూడు హైదరాబాద్ మీదుగా) విజన్2047కు అనుగుణంగా రీజినల్ రింగురోడ్డు నుంచి ఫ్యూచర్ సిటీలో మౌలిక సదుపాయాల కల్పన వరకు రాష్ట్ర ప్రభుత్వం అడిగిన మిగతా.. 2లో



### ఇప్పుడు రేవంత్ రెడ్డికి సమాచారం ఎలా వస్తుందో, నాడు కేసీఆర్‌కు అలాగే వచ్చింది

- ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన అవసరం తమకు లేదన్న కేటీఆర్
- పరిస్థితి చూస్తుంటే మళ్లీ ఉద్యమం రోజులు గుర్తుకు వస్తున్నాయని వ్యాఖ్య
- ఫోన్ ట్యాపింగ్ కేసులో అబద్ధాలు ఒక్కటొక్కటి తేలిపోతున్నాయన్న కేటీఆర్

### ఇదేనా మీ రూల్ ఆఫ్ లా?
## కూటమి ప్రభుత్వంపై రోజా ఫైర్

అమరావతి: తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేత, మాజీ మంత్రి రోజా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైసీపీ నేతలు, వారి ఆస్తులు, పార్టీ కార్యాలయాలే లక్ష్యంగా దాడుల పరంపర కొనసాగుతోందని ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, ఈ పరిస్థితులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆమె డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్న 'రూల్ ఆఫ్ లా' (చట్టబద్ధమైన పాలన) ఇదేనా? అంటూ ఆమె సూటిగా ప్రశ్నించారు. ఈ సందర్భంగా, రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నేతలపై జరిగిన దాడుల జాబితాను ఆమె వివరించారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్, కొడాలి నాని, పేర్ని నాని, దాడిశెట్టి రాజా ఇళ్లతో పాటు, వల్లభనేని వంశీ, ముద్రగడ పద్మనాభం, భూమన కరుణాకర్ రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి వంటి సీనియర్ నేతల నివాసాలపై దాడులు జరిగాయని ఆమె పేర్కొన్నారు. హిందూపురం వైసీపీ కార్యాలయం, మార్గాని భరత్ కార్యాలయాలపై కూడా దాడి చేశారని తెలిపారు. అంతేకాకుండా, దేవినేని అవినాశ్, విడదల రజినిపై దాడికి ప్రయత్నించారని, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి జరిగిందని విమర్శించారు. తనపై కూడా ఓ వ్యక్తిని ప్రయోగించి బూతులతో దాడి చేయిస్తున్నారని రోజా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడులు కేవలం రాజకీయ నాయకులకే పరిమితం కాలేదని, పత్రికా కార్యాలయాలపైనా జరుగుతున్నాయని రోజా ఆరోపించారు. సాక్షి, డెక్కన్ క్రానికల్ మీడియా సంస్థల ఆఫీసులపై జరిగిన దాడులను ఆమె తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో ఇంత జరుగుతున్నా ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని ఆమె ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చాక ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకోవడం దారుణమని, చంద్రబాబు పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోందని రోజా విమర్శించారు. ఈ దాడులన్నింటికీ ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని ఆమె స్పష్టం చేశారు.

### పసిడి ప్రియులకు శుభవార్త.. బంగారం,
## వెండి ధరలు రికార్డు స్థాయిలో పతనం!

ఢిల్లీ: బంగారం, వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయికి చేరిన తర్వాత, గత నాలుగైదు రోజులుగా పసిడి, వెండి ధరలు నేలచూస్తున్నాయి. ఈ క్రమంలో ఇవాళ ఒక్కరోజే బంగారం ధర రికార్డు స్థాయిలో పడిపోయింది. ఈ పరిణామం పెట్టుబడిదారులకు షాక్ ఇవ్వగా, కొనుగోలుదారులకు ఊరటనిచ్చింది. (ఫిబ్రవరి 2) ఉదయం 9:30 గంటల సమయానికి హైదరాబాద్ మార్కెట్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ.9,050 తగ్గి రూ.1,51,530కి చేరింది. అలాగే, 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ.8,300 తగ్గి రూ.1,38,900 వద్ద ట్రేడ్ అవుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో కూడా దాదాపు ఇదే పరిస్థితి కొనసాగుతోంది. అక్కడ 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,51,680గా నమోదైంది.

### పసిడి బాటలోనే వెండి

బంగారం బాటలోనే వెండి కూడా పయనిస్తోంది. కిలో వెండి ధర నిన్నటితో పోలిస్తే ఏకంగా రూ.50,000 పతనమైంది. ప్రస్తుతం హైదరాబాద్, ఢిల్లీ మార్కెట్లలో కిలో వెండి ధర రూ.3 లక్షల వద్ద ఉంది. కొద్ది రోజుల క్రితం కిలో వెండి ధర రూ.4.25 లక్షల వరకు చేరడం గమనార్హం. ఇటీవల రికార్డు గరిష్ఠాలకు చేరడంతో పెట్టుబడిదారులు భారీ ఎత్తున లాభాల స్వీకరణకు (ప్రాఫిట్ బుకింగ్) మొగ్గు చూపడమే ఈ పతనానికి ప్రధాన కారణంగా బులియన్ మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ ధరల పతనం పెట్టుబడిదారులను ఆందోళనకు గురిచేస్తుండగా, కొనుగోలు చేయాలనుకునే వారికి ఊరటనిస్తోంది.

## ఏపీ, తెలంగాణలకు హైస్పీడ్ రైళ్లు గేమ్ ఛేంజర్..
## బెంగళూరుకు 2 గంటల్లో చేరుకోవచ్చు: అశ్వినీ వైష్ణవ్

హైదరాబాద్ : హైస్పీడ్ రైళ్లు గంటకు 350 కిలోమీటర్ల వేగంతో పరుగు పెడతాయని, హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల్లో వెళ్లవచ్చని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. హైస్పీడ్ కారిడార్‌తో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మధ్య ఆర్థిక, హెల్త్ టూరిజం అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. బడ్జెట్‌లో తెలంగాణలో రైల్వే పనులకు రూ.5,454 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఈ హైస్పీడ్ రైళ్లు ఉభయ తెలుగు రాష్ట్రాలకు (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) గేమ్ ఛేంజర్‌గా మారతాయని వెల్లడించారు. హైదరాబాద్ నుంచి చెన్నై, పుణే, బెంగళూరుకు 3 హైస్పీడ్ రైళ్లు రానున్నాయని, దీంతో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల్లో వెళ్లవచ్చని అన్నారు. పుణేకు గంట 55 నిమిషాలు, చెన్నైకి 2 గంటల 55 నిమిషాల్లో చేరుకోవచ్చని అన్నారు.

## ఇప్పుడు రేవంత్ రెడ్డికి సమాచారం
## ఎలా వస్తుందో, నాడు కేసీఆర్‌కు అలాగే వచ్చింది

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన అవసరం తమకు లేదని, ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమాచారం ఎలా వస్తుందో, నాడు కేసీఆర్ ప్రభుత్వానికి కూడా అలాగే వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ నిన్న రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, పట్టణాలలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కదిలారని అన్నారు. ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే మళ్లీ ఉద్యమ రోజులు గుర్తుకువస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో పాలనా వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని, మేడారం జాతర ఏర్పాట్లలో కూడా ప్రభుత్వం విఫలమైందని అన్నారు. దావోస్ ఒప్పందాల ద్వారా వచ్చిన పెట్టుబడులపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో వారు చెబుతున్న అబద్ధాలు ఒక్కటొక్కటి తేలిపోతున్నాయని అన్నారు. మొదట వ్యాపారవేత్తలు, ఆ తర్వాత సినిమా తారల ఫోన్లు ట్యాప్ చేశారని చెప్పారని, ఇప్పుడు ఏమీ లేదని అంటున్నారని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన ఖర్మ తమకు లేదని స్వయంగా కేసీఆర్ చెప్పారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఇకనైనా పాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సజ్జనార్ తీర్పు చెప్పడానికి ఆయన జడ్జి కాదని ఎద్దేవా చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో వచ్చిన అభియోగాలపై కోర్టులు తేల్చుతాయని అన్నారు. హైదరాబాద్ నగరంలో పట్టబగలు కాల్పులు, దోపిడీ ఘటనలు చోటు చేసుకుంటున్నాయని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సహజ వనరుల దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. సింగరేణి కుంభకోణం అంశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి స్పష్టమైన సమాధానం రాలేదన్నారు. బొగ్గు కుంభకోణంపై సిట్టింగ్ జడ్జి, సీబీఐ విచారణ కోరుతుంటే ఎందుకు వెనక్కి పోతున్నారని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో సృజన్ రెడ్డి కాల్ డేటా తీస్తే అన్ని విషయాలు బయటకు వస్తాయని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ నిలదీస్తోందని, అందుకే సిట్‌ల పేరిట విచారణలు చేస్తూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. పైశాచిక ఆనందం కోసం కేసీఆర్‌ను అంతసేపు విచారణ పేరుతో కూర్చోబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌పై కేటీఆర్ పెదవి విరిచారు. ఉపాధి హామీని కుదించారని, ఎరువులు, ఆహార రాయితీ, స్వచ్ఛ భారత్ నిధులు తగ్గించారని ఆరోపించారు. బయో ఫార్మా తయారీకి రూ.10 వేల కోట్లు కేటాయించిన కేంద్రం హైదరాబాద్‌కు రూ.10 కూడా కేటాయించలేదని విమర్శించారు. ఢిల్లీకి 60 సార్లు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాధించిందేమిటని ప్రశ్నించారు. రెండు పార్టీల నుంచి 8 మంది చొప్పున ఎంపీలు గెలిచినా రాష్ట్రానికి కలిగిన ప్రయోజనం ఏమీ లేదన్నారు.

### 93 ఏళ్ల వయసులో 'మెట్రోమ్యాన్' కొత్త లక్ష్యం..
## కేరళ హైస్పీడ్ రైలుపై శ్రీధరన్ పట్టు

ఢిల్లీ: భారత 'మెట్రోమ్యాన్'గా పేరుగాంచిన ఇ.శ్రీధరన్, 93 ఏళ్ల వయసులోనూ తనలోని కార్యదీక్ష, పట్టుదల ఏమాత్రం తగ్గలేదని నిరూపించారు. కేరళలో ప్రతిపాదిత హైస్పీడ్ రైలు ప్రాజెక్టును వాస్తవరూపంలోకి తెచ్చేందుకు ఆయన నడుం బిగించారు. ఇందులో భాగంగా ఇవాళ మలప్పురం జిల్లాలోని పొన్నానిలో తన నివాసానికి సమీపంలో ప్రాజెక్టు అధికారిక కార్యాలయాన్ని ప్రారంభించారు. నిరాడంబరంగా జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీధరన్ అర్ధాంగి జ్యోతి ప్రజ్వలన చేయడం విశేషం. ఈ సందర్భంగా శ్రీధరన్ మాట్లాడుతూ... ఒక ప్రొఫెషనల్ మాస్టర్ బిల్డర్‌గా తన పనిని కొనసాగిస్తానని స్పష్టం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టు గురించి ప్రస్తావన లేకపోవడం తన సంకల్పాన్ని ఏమాత్రం నీరుగార్చలేదని అన్నారు. రైల్వే మంత్రిత్వ శాఖ నుంచి అనుమతి లభిస్తుందన్న గట్టి నమ్మకం తనకు ఉందని, ఇలాంటి భారీ ప్రాజెక్టులకు పట్టుదల, స్పష్టమైన లక్ష్యం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రారంభ దశలో ఈ కార్యాలయం ప్రజలకు ప్రాజెక్టుపై ఉన్న సందేహాలను నివృత్తి చేసే కేంద్రంగా పనిచేస్తుంది. ఈ నెల 15 నుంచి ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, ఆర్థిక, సామాజిక అంశాలను ప్రజలకు వివరించేందుకు సమావేశాలు నిర్వహించనున్నారు. తొలిదశ సమావేశాలు మలప్పురంలో ప్రారంభించి, ఆ తర్వాత ప్రాజెక్టు మార్గం వెళ్లే ఇతర జిల్లాల్లోనూ కొనసాగిస్తారు. కేంద్ర రైల్వే మంత్రితో జనవరి 16న జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయని శ్రీధరన్ తెలిపారు. డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారని, ఈ బాధ్యతను ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ కు అప్పగిస్తూ అధికారిక ఉత్తర్వులు మరో 3-4 రోజుల్లో వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తనకు వయసు అడ్డంకి కాదని, దేశానికి సేవ చేయడమే ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు.

## నిడదవోలులో 3 ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపండి...

అమరావతి: ప్రయాణికుల సౌకర్యార్థం తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు రైల్వే స్టేషన్‌లో మూడు ముఖ్యమైన ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నిలుపుదల (హాల్ట్) కల్పించాలని రాజమండ్రి ఎంపీ, బీజేపీ నేత దగ్గుబాటి పురందేశ్వరి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి ఆమె ఒక వినతిపత్రం అందజేశారు. విజయవాడవిశాఖపట్నం, విజయవాడనర్సాపురం ప్రధాన మార్గాలను అనుసంధానించే కీలకమైన జంక్షన్‌గా నిడదవోలు ఉందని పురందేశ్వరి తన వినతిలో పేర్కొన్నారు. లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ (18519/18520), జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12805/12806), కోకనాడ ఎక్స్‌ప్రెస్ (12775/12776) రైళ్లకు ఇక్కడ హాల్ట్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ముంబై వెళ్లే చిన్న వ్యాపారులు, రోజువారీ కూలీలు, ఉద్యోగులతో పాటు ద్వారకా తిరుమల, విజయవాడ, మంగళగిరి వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లే యాత్రికులు ఈ రైళ్ల కోసం ఇతర స్టేషన్లకు వెళ్లాల్సి వస్తోందని ఆమె తెలిపారు. సాధ్యత నివేదిక (ఫీజిబిలిటీ రిపోర్ట్) ప్రకారం, ఈ రైళ్లను నిడదవోలులో ఆపడానికి కేవలం 4 నుంచి 5 నిమిషాల అదనపు సమయం మాత్రమే పడుతుందని, దీనివల్ల ఇతర రైళ్ల రాకపోకలకు ఎలాంటి ఆటంకం ఉండదని స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో రైల్వేకు అదనపు ఆదాయం కూడా సమకూరుతుందని పురందేశ్వరి పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే ఈ రైళ్లకు నిడదవోలులో హాల్ట్ మంజూరు చేయాలని ఆమె కేంద్రాన్ని కోరారు.

# చైనా యుద్ధ ట్యాంకులు
# భారత్ సరిహద్దులను దాటాయి

మొదటి పేజి తరువాయి

బీజేపీ సభ్యులు నిరసన తెలిపారు. చైనా సైన్యం భారత సరిహద్దులోకి చొరబడుతోందని ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవణే తన పుస్తకంలో రాసిన కొన్ని అంశాలను ఒక మ్యాగజైన్ ప్రచురించింది. ఆ వివరాలను రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రస్తావించారు. లఢక్, డొక్లామ్ ప్రతిష్ఠంభనకు సంబంధించి దేశ సైనికులకు వాస్తవాలు తెలుసని రాహుల్ గాంధీ అన్నారు. దేశ ప్రజలకు వాస్తవాలు దాచిపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఆయన వ్యాఖ్యలను మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ ఖండించారు. సభను అవమానించేలా రాహుల్ గాంధీ మాట్లాడుతున్నారని అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ చెబుతున్న పుస్తకం ఇంకా ప్రచురణ కాలేదని, ప్రచురితం కాని పుస్తకంలోని అంశాల గురించి ఎలా మాట్లాడతారని రాజ్‌నాథ్ సింగ్ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ నిబంధనల ప్రకారం మాట్లాడాలని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు సూచించారు. వార్తాపత్రికల క్లిప్పింగ్‌లు, ప్రచురణ కాని పుస్తకాలకు సంబంధించిన విషయాలను లోక్‌సభలో ప్రస్తావించకూడదని స్పీకర్ ఓం బిర్లా రూల్ బుక్ నియమాలను చదివి వినిపించారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు చెప్పే తీర్మానంపై మాట్లాడాలని రాహుల్ గాంధీకి సూచించారు.

# కేంద్ర ప్రభుత్వానికి
# ఆలోచనలు కరవయ్యాయి

మొదటి పేజి తరువాయి

"వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రధాని మోదీకి స్పష్టమైన దార్శనికత ఉంది. కాంగ్రెస్ హయాంలో ఆర్థిక క్రమశిక్షణ గాడితప్పింది. ద్రవ్య లోటు ఎప్పుడూ అదుపులో ఉండేది కాదు. ఈసారి ద్రవ్య లోటు కేవలం 4.3 శాతంగా ఉంది" అని గుర్తుచేశారు. ప్రభుత్వానికి విధానపరమైన దృష్టి లేదన్న ఖర్గే ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు మాంద్యంలో ఉన్నప్పటికీ, భారత్ ఒక ప్రకాశవంతమైన శక్తిగా నిలుస్తోందని, బడ్జెట్ అన్ని కీలక రంగాలకు ప్రాధాన్యత ఇచ్చిందని వివరించారు. అంతకుముందు ఆదివారం, కేంద్ర ప్రభుత్వానికి ఆలోచనలు కరవయ్యాయని ఖర్గే విమర్శించారు. ఉద్యోగాలు, తయారీ రంగం, ద్రవ్యోల్బణం, రైతుల సమస్యలకు బడ్జెట్‌లో ఎలాంటి పరిష్కారాలు చూపలేదని ఆయన 'ఎక్స్' వేదికగా ఆరోపించారు. ఎగుమతుల క్షీణత, వాణిజ్య లోటు వంటి అంశాలను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రస్తావించలేదని అన్నారు. ఖర్గే ఆరోపణలను తిప్పికొడుతూ, దేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేయడం అత్యవసరమని ప్రతుల్ షా అన్నారు. "ఆపరేషన్ సిందూర్ సమయంలో మన సాయుధ బలగాలు పాకిస్థాన్‌లోకి వెళ్లి తమ పరాక్రమాన్ని చూపాయి. సరిహద్దుల్లో శత్రుదేశాల నుంచి ముప్పు ఉన్నందున మనం సన్నద్ధంగా ఉండాలి" అని తెలిపారు. ఆర్థిక వివేకం, వృద్ధి, జాతీయ భద్రతకు సమ ప్రాధాన్యత ఇస్తూ బడ్జెట్ రూపొందించామని, కాంగ్రెస్ కేవలం రాజకీయ కారణాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని బీజేపీ ఆరోపించింది.

### ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణపై
# కవిత కీలక వ్యాఖ్యలు

మొదటి పేజి తరువాయి

ఈ కేసులో అధికారులకు సహకరించేందుకు తాను సిద్ధమని చెప్పారు. అధికారులు పిలిస్తే తాను విచారణకు హాజరవుతానని కవిత తెలిపారు. ఈ మేరకు ఈ హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ మొదలై రెండు సంవత్సరాలు గడించిందని గుర్తుచేశారు. విచారణ సుదీర్ఘంగా కొనసాగడంపై విమర్శలు గుప్పించారు. విచారణ ఇంకెప్పుడు ముగుస్తుందని, దోషులను ఎప్పుడు శిక్షిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సిట్ విచారణలో ఏం జరిగిందనే వివరాలను కేసీఆర్ బయటపెడతారని భావిస్తున్నట్లు ఆమె చెప్పారు. కేసు విచారణనే తప్పుబడుతున్నట్లు కేటీఆర్ మాట్లాడటం సరికాదని కవిత అభిప్రాయపడ్డారు. చట్టాలను గౌరవించాల్సిన బాధ్యత, అధికారులకు సహకరించాల్సిన విధి ప్రతీ పౌరుడిపైనా ఉందని వ్యాఖ్యానించారు. గుంట నక్కలతో కలిసి డ్రామాలాడుతోందంటూ కాంగ్రెస్ పార్టీపై ఆమె మండిపడ్డారు. తన ఫోన్ ను, తన భర్త ఫోన్ ను ట్యాప్ చేశారనే అనుమానిస్తున్నట్లు చెప్పిన కవిత.. సిట్ విచారణకు అధికారులు పిలిస్తే వెళతానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# 2026-27 కేంద్ర బడ్జెట్‌లో
# తెలంగాణకు మరోసారి మొండిచెయ్యే

మొదటి పేజి తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం అడిగిన ఏ కార్యక్రమానికీ నిధులు కేటాయించలేదు. సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా, జాతీయ స్థాయి విద్యా సంస్థలు, పరిశ్రమల ఏర్పాటు విషయంలోనూ తెలంగాణకు ఎలాంటి ఊరట దక్కలేదు. కేంద్ర బడ్జెట్‌ను పరిశీలిస్తే దేశవ్యాప్తంగా అమలు చేసే పథకాల్లో భాగంగానే రాష్ట్రానికి ప్రయోజనం చేకూరాలి తప్ప ఎలాంటి ప్రత్యేక ప్రయోజనం లేదని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### సాయం అడిగినా చేయలేదు

ఈసారి కేంద్ర బడ్జెట్‌పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గంపెడాశలు పెట్టుకుంది. రాష్ట్రంలో ప్రస్తుతమున్న ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో మూడు అంశాల్లో కేంద్ర సహకారాన్ని ఆశించింది. ముఖ్యంగా 2047 నాటికి త్రీ ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా నిధులు వస్తాయని, 2014 సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిలకు మోక్షం కలుగుతుందని, విభజన హామీల్లో కొన్నింటికైనా ఈసారి కేటాయింపులు ఉంటాయని రాష్ట్రం భావించింది. అయితే తెలంగాణకు సంబంధించి ఎలాంటి ప్రత్యేక కేటాయింపులు లేకుండానే బడ్జెట్ ప్రతిపాదనలు జరిగాయి. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు ప్రతిష్ఠాత్మక పథకాలకు రూ.1.65 లక్షల కోట్లు అవసరమవుతాయని రాష్ట్ర ప్రభుత్వం లెక్కలు కట్టింది. ఇందుకోసం పలుమార్లు కేంద్రాన్ని రాష్ట్ర పెద్దలు కలిశారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు తోడు రాష్ట్ర ఎంపీలు, తమ శాఖలకు నిధుల కేటాయింపు కోసం రాష్ట్ర మంత్రులు ఇప్పటికే కేంద్ర మంత్రులు, ఆర్థికమంత్రి, ప్రధాన మంత్రిని కూడా కలిసి విజ్ఞప్తి చేశారు. కానీ ఈ విజ్ఞప్తులేవీ కేంద్రం పట్టించుకోలేదు.

రీజినల్ రింగు రోడ్డు, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు, మెట్రో ప్రాజెక్టు విస్తరణ, హైదరాబాద్‌లో సీవరేజి మాస్టర్ ప్లాన్, వరంగల్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రేడియల్ రోడ్లు, గ్రీన్‌ఫీల్డ్ హైవే, ఇండ్రస్టియల్ హబ్‌లు, లాజిస్టిక్, రీక్రియేషన్ పార్కులు, ఫ్యూచర్ సిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు, పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటు, కరీంనగర్, జనగామ జిల్లాల్లో లెదర్ పార్కులు, తెలంగాణలోని గోదావరి వ్యాలీ బొగ్గు బ్లాక్‌లను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌కు కేటాయింపు, సెమీకండక్టర్ మిషన్ కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి, కేంద్రీయ విద్యాలయాలు, జిల్లాకో నవోదయ పాఠశాల, పాలమూరురంగారెడ్డికి జాతీయ హోదాలకు తోడు రాష్ట్రంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదలన్నింటినీ కేంద్ర బడ్జెట్ బుట్టదాఖలు చేసింది.

రాష్ట్రంలో కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి సహకారం ఉంటుందని ఆశించినా, అది కూడా దక్కలేదు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల్లాంటి సోషల్ ఇంజనీరింగ్ కార్యక్రమాలకు కూడా ఎలాంటి ఆర్థిక సాయం ప్రకటించలేదు. మిర్చిబోర్డు, స్కిల్ వర్సిటీ లాంటి ఊసు కూడా లేకుండానే పార్లమెంటు ముందుకొచ్చిన కేంద్ర వార్షిక బడ్జెట్ రాష్ట్రాన్ని నిరాశలో ముంచెత్తింది. ఈ బడ్జెట్ ప్రభావం రాష్ట్ర ప్రభుత్వం వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టనున్న వార్షిక బడ్జెట్‌పై కూడా ప్రభావం చూపుతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన కొన్ని పథకాలు, కార్యక్రమాల విషయంలో తెలంగాణ చొరవ తీసుకుంటే... కేంద్ర ప్రభుత్వం సహకరిస్తే మాత్రం కొంతమేర ప్రయోజనం కలుగుతుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా హైస్పీడ్ రైల్ కారిడార్లకు అనుసంధానంగా రోడ్డు కనెక్టివిటీని పెంచుకోవడం ద్వారా అభివృద్ధికి బాటలు వేయవచ్చని అంటున్నారు. డాటా సెంటర్లకు ట్యాక్స్ హాలిడే, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సహకారం, ఇతర దేశాల నుంచి పెట్టుబడుల సమీకరణ, వాణిజ్య పంటలకు ప్రోత్సాహం తదితర అంశాల్లోనూ రాష్ట్ర ప్రభుత్వం అనుసరించే విధానాలు, కేంద్రం అందించే సాయం బట్టి కొంత ఉపయోగం ఉంటుందని చెబుతున్నారు. ఇక, ఆదాయ పన్ను విషయంలో ఎలాంటి మార్పు లేకపోవడం, ఎంఎస్‌ఎంఈలు, స్టార్టప్‌ల విషయంలోనూ విధానాల్లో ఎలాంటి మార్పు ప్రకటించకపోవడంతో వేతన జీవులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కూడా ఈ బడ్జెట్ ద్వారా ఆశించిన ప్రయోజనాలు కనిపించడం లేదని ఆర్థిక నిపుణులు చెబుతుండడం గమనార్హం. కేంద్ర పన్నుల్లో వాటా ఈసారి బడ్జెట్‌లో స్వల్పంగా పెరిగింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు కలిపి గతంలో ఉన్న 41 శాతం పన్నుల్లో వాటాను ఈసారి 16వ ఆర్థిక సంఘం సిఫారసులకు అనుగుణంగా 42.5 శాతానికి పెంచారు. ఇందుకు అనుగుణంగా రాష్ట్రానికి వచ్చే పన్నుల్లో వాటా కూడా గత ఏడాది కంటే కొంచెం పెరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో 2.102 శాతంగా ఉన్న పన్నుల్లో వాటా ఈసారి 2.174 శాతానికి పెరగడం గమనార్హం. ఈ మేరకు రానున్న ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి కేంద్ర పన్నుల్లో వాటా కింది రూ. 33,181 కోట్లు వస్తాయని అంచనాలు చెబుతున్నాయి. ప్రతి నెలా సగటున రూ.2,370 కోట్ల చొప్పున మొత్తం 14 విడతల్లో ఈ మొత్తం వస్తుందని రాష్ట్ర ఆర్థిక శాఖ అంచనా వేస్తోంది. అయితే, పన్నుల్లో వాటి ఈసారి రూ.4వేల కోట్ల వరకు పెరిగింది. గత బడ్జెట్‌లో రూ.29,280 కోట్లు రాగా, ఈసారి అది రూ.33వేల కోట్లకు పెరగడం ఒక్కటే తెలంగాణకు ఈసారి కేంద్ర బడ్జెట్‌లో దక్కిన ఊరట అని చెప్పుకోవచ్చు.

# రాష్ట్రంలో హింసను
# ప్రేరేపించాలని చూస్తోంది..

మొదటి పేజి తరువాయి

వైసీపీ రెచ్చగొట్టాలని చూస్తోందని చంద్రబాబు చెప్పారు. అందుకే ఆ పార్టీ నేతలు బూతులు మాట్లాడుతున్నారని, సంయమనం పాటించాలని చెప్పారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. వైసీపీ రెచ్చగొట్టే చర్యలకు దిగుతోందన్న చంద్రబాబు.. ఆ పార్టీ ఉచ్చులో పడి టీడీపీ శ్రేణులు సంయమనం కోల్పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత సీనియర్ నేతలదేనని చెప్పారు. హింస, విధ్వంసం, అవినీతి పునాదులపై వైసీపీ పుట్టిందని, ఆ పార్టీ ట్రాప్‌లో పడితే వారికీ మనకూ తేడా ఉండదని అన్నారు. ఈ సందర్భంగా తప్పుచేసిన ప్రతి ఒక్కరినీ చట్టపరంగా శిక్షించి తీరుతామని చంద్రబాబు స్పష్టం చేశారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో అడ్డంగా దొరికిపోయిన వైసీపీని రాష్ట్ర ప్రజలు చీదరించుకుంటున్నారని అన్నారు. ఈ క్రమంలో తాము చేసిన పాపాల నుంచి ప్రజల దృష్టి మళ్లించాలని ఆ పార్టీ నేతలు కుట్రలు పన్నుతున్నారని చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్న టీడీపీ అజెండా సహజంగానే వైసీపీ నేతలకు నచ్చదని చంద్రబాబు గుర్తుచేశారు. అందుకే అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారని తెలిపారు.

### తెలంగాణకు అప్పుడే తాడిచెర్ల-
# 1 గనులు కేటాయించాం

మొదటి పేజి తరువాయి

రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో తాడిచెర్ల కోల్ బ్లాక్ గురించి కేంద్రమంత్రి స్పందించారు. రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ కేంద్ర బడ్జెట్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేటాయింపులు లేవని, ఇది తెలంగాణ ప్రజలను నిరాశపరిచిందని అన్నారు. 2020 జూన్ నుంచి బొగ్గు వేలం ప్రక్రియలో ప్రభుత్వరంగ సంస్థలకు బొగ్గు బ్లాక్‌లు కేటాయించలేదని తమిళనాడుకు చెందిన ఎంపీ డాక్టర్ తంబిదురై అన్నారు. వేలం ప్రక్రియలో రాష్ట్రాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా, ప్రైవేటు రంగ కొనుగోలుదారులకు కట్టపెడుతున్నారని ఆరోపించారు. దీంతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందిస్తూ, తెలంగాణ విద్యుత్ సంస్థకు తాడిచెర్ల-1 బొగ్గు గనులను కేటాయించినట్లు తెలిపారు.

# కవిత వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందన

హైదరాబాద్: కేటీఆర్ మాట్లాడుతున్న మాటలు రాచరికపు పోకడలకు, నియంతృత్వానికి నిదర్శనంగా ఉన్నాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఎవరు నిలబడ్డా... కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కేటీఆర్ అంటున్నారని... మున్సిపల్ ఎన్నికల్లో గుణం చూసి ఓటు వేయాలని చెప్పారు. పని చేసే వాళ్లకు, మంచి అభ్యర్థులకు మాత్రమే ఓటు వేయాలని అన్నారు. చెడ్డ వాళ్లకు ఓటు వేయాలని కేటీఆర్ చెబుతున్నారా? అని ప్రశ్నించారు. జాగృతి అభ్యర్థులు ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై పోటీ చేస్తారని తెలిపారు. కవిత వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందిస్తూ... కవితపై బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే చర్యలు తీసుకుందని అన్నారు. ఆమె గురించి తాను ప్రత్యేకంగా స్పందించాల్సిన అవసరం లేదని చెప్పారు. రాజకీయాల్లో రోజూ ఎంతో మంది మాట్లాడుతుంటారని... ప్రతి వ్యక్తికి, ప్రతి వ్యాఖ్యకు కౌంటర్ ఇవ్వాల్సిన అవసరం లేదని అన్నారు.

## దలైలామాకు గ్రామీ అవార్డు.. తీవ్రంగా స్పందించిన చైనా

డిల్లీ: టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా ప్రతిష్ఠాత్మక గ్రామీ అవార్డు గెలుచుకున్నారు. బెస్ట్ ఆడియో బుక్, నెరేషన్ అండ్ స్టోరీ టెల్లింగ్ రికార్డింగ్ జాబితాలో ఆయన ఈ అవార్డును సొంతం చేసుకున్నారు. 90 ఏళ్ల వయస్సులో 'మెడిటేషన్' అనే ఆల్బమ్‌కు గాను దలైలామాను ఈ అవార్డు వరించింది. దలైలామాకు గ్రామీ అవార్డు ఇవ్వడాన్ని చైనా తీవ్రంగా ఖండించింది. దీనిని ఉపయోగించుకుని చైనా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటాన్ని వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొంది. దలైలామా పూర్తిగా ఆధ్యాత్మికపరమైన వ్యక్తి కాదని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ ఓ మీడియా సమావేశంలో అన్నారు. మతం ముసుగులో చైనా వ్యతిరేక వేర్పాటువాద కార్యకలాపాలకు పాల్పడుతున్న రాజకీయ ప్రవాసి అని ఆయనపై ఆరోపణలు గుప్పించారు. ఈ అవార్డును బీజింగ్ వ్యతిరేక కార్యకలాపాలకు ఒక సాధనంగా ఉపయోగించుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. దలైలామా మతం ముసుగులో చైనా వ్యతిరేక వేర్పాటువాద కార్యకలాపాలను ప్రోత్సహించే వ్యక్తి అన్నారు. తనకు గ్రామీ అవార్డు రావడంపై దలైలామా స్పందించారు. ఇది తన వ్యక్తిగత విజయంగా చూడటం లేదని అన్నారు. శాంతి, కరుణ, పర్యావరణంపై శ్రద్ధ, మానవత్వం అనేవి మానవాళి శ్రేయస్సుకు అవసరమని పేర్కొన్నారు. గ్రామీ గుర్తింపు ఈ సందేశాలను మరింత విస్తృతంగా వ్యాప్తి చేయడంలో సహాయపడుతుందని విశ్వసిస్తున్నానని పేర్కొన్నారు.

## కోర్టు తేల్చకముందే అక్రమమని ఎలా అంటారు?
## సజ్జనార్ పై హరీశ్ రావు ఫైర్

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు చేస్తున్న సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) చీఫ్ వీసీ సజ్జనార్ తీరుపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. న్యాయస్థానం తుది తీర్పు ఇవ్వకముందే ఫోన్ ట్యాపింగ్‌ను "అక్రమం" అని అధికారికంగా ఎలా ప్రకటిస్తారని ఆయన ప్రశ్నించారు. సిట్ చీఫ్ హోదాలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం చట్టబద్ధంగా నిలవదని, ఇది తీవ్ర ఆందోళన కలిగించే విషయమని అన్నారు. ఈ అంశంపై హరీశ్ రావు మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో, ఒక ఆరోపణ నేరమని తేల్చాల్సింది న్యాయస్థానం మాత్రమేనని స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం, నిందితుడు నిరపరాధి అనే భావన ప్రాథమిక సూత్రమని, దీనిని విస్మరించరాదని అన్నారు. దర్యాప్తు చేయడం మాత్రమే పోలీసుల విధి అని, విచారణ దశలోనే ఒక చర్యను చట్టవిరుద్ధమని ప్రకటించడానికి వారేమీ న్యాయమూర్తులు కాదని హరీశ్ రావు అభిప్రాయపడ్డారు. ఒక ఫోన్ సంభాషణను రహస్యంగా వినడం చట్టబద్ధమా, కాదా అనేది ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్ సెక్షన్ 5(2), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని నిబంధనలకు లోబడి ఉంటుందని వివరించారు. అలాగే, పీయూసీఎల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా జరిగిందా లేదా అన్నది న్యాయ సమీక్ష ద్వారానే తేలుతుందని, పోలీసుల అధికారిక సందేశాల ద్వారా కాదని అన్నారు. "అక్రమ ఫోన్ ట్యాపింగ్" అనే పదాన్ని అధికారికంగా ఉపయోగించడం ద్వారా, సిట్ చీఫ్ దర్యాప్తు ఫలితంపై ముందుగానే ఒక నిర్ణయానికి వచ్చినట్లు స్పష్టమవుతోందని హరీశ్ రావు ఆరోపించారు. ఆయన ప్రవర్తన తను నిర్వహిస్తున్న పదవికి తగనిదని, సీనియర్ అధికారులు పాటించాల్సిన నిష్పాక్షికత, సమగ్రతకు సంబంధించిన అఖిల భారత సర్వీసుల (ప్రవర్తనా) నిబంధనలు, 1968కు ఇది పూర్తిగా విరుద్ధమని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రతిపక్ష నేతకు సంబంధించిన అత్యంత రాజకీయ ప్రాధాన్యమున్న కేసులో ఇలాంటి తొందరపాటు నిర్ధారణలు చేయడం వల్ల దర్యాప్తు రాజకీయ ప్రేరేపితంగా, పక్షపాతంతో సాగుతోందనే అనుమానాలకు తావిస్తోందని అన్నారు. దర్యాప్తు నిష్పక్షపాతంగా జరగడమే కాదు, అలా జరిగినట్లు ప్రజలకు కనిపించాలని సుప్రీంకోర్టు పలుమార్లు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయడానికి లేదా రాజకీయ కథనాలను ముందుకు తీసుకెళ్లడానికి పోలీసుల అధికారిక ప్రకటనలను వాడుకోరాదని హరీశ్ రావు హితవు పలికారు. దర్యాప్తు సంస్థలు చట్టపరిధిలో స్వతంత్రంగా పనిచేయాలని డిమాండ్ చేశారు. తీర్పులు ఇవ్వాల్సింది కోర్టులే తప్ప పోలీసుల సందేశాలు కాదని, రాజ్యాంగ పరిమితులను సంస్థలు అతిక్రమిస్తే ప్రజాస్వామ్యం మనలేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా, "కేసీఆర్ గారిని గౌరవ ప్రతిపక్ష నేతగా సిట్ చీఫ్ ఎందుకు గుర్తించడం లేదో తెలంగాణ ప్రజలు తెలుసుకోవాలనుకుంటున్నారు" అని హరీశ్ రావు సూటిగా ప్రశ్నించారు. నిన్న కేసీఆర్ విచారణ అనంతరం సిట్ చీఫ్ సజ్జనార్ చేసిన ట్వీట్ కు ప్రతిస్పందనగా హరీశ్ రావు ఈ మేరకు ట్వీట్ చేశారు.

## రాజకీయాల్ని నేరమయం చేయటమే వైకాపా సంస్కృతి

అమరావతి: వైకాపా పాలనలో వారు విధ్వంసం చేసిన వ్యవస్థలను పునర్నిర్మిస్తుంటే.. అది చూసి ఓర్వలేక ఆ పార్టీ నాయకులు రగిలిపోతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. రాజకీయాల్ని నేరమయం చేయడం (క్రిమినలైజేషన్ ఆఫ్ పాలిటిక్స్) వైకాపా ప్రధాన సంస్కృతి అని, చట్టరహిత పరిపాలనకు వారి హయాం హాల్‌మార్క్ వంటిదని విమర్శించారు. '2024లో మేం అధికారం చేపట్టాక రాష్ట్రంలో చట్టబద్ధ పాలన పునరుద్ధరించాం. ప్రజలకు సేవ చేయడం, వారికి సాధికారత కల్పించడం మా సంస్కృతి. వైకాపా నిజస్వరూపం రోజురోజుకు బయట పడుతుండటంతో ఆ పార్టీ నాయకులు ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ నిరాశ, నిస్పృహలకు లోనై అసభ్య దూషణలకు తెగబడుతున్నారు. ఏదీ ఏమైనా శాంతిభద్రతలను కాపాడతాం. చట్టమే మాకు సుప్రీం. చట్టబద్ధ పాలనను (రూల్ ఆఫ్ లా) ఉల్లంఘించడానికి ఎవర్నీ అనుమతించం' అని హెచ్చరించారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఎక్స్‌లో ఆదివారం రాత్రి ఆయన ఈ ట్వీట్ చేశారు.

## ఏపీ అభివృద్ధికి ఈ బడ్జెట్ ఊతం ఇస్తుంది

అమరావతి: 'వికసిత్ భారత్ లక్ష్యాలు సాధించేలా కేంద్ర బడ్జెట్ ఉంది. యువశక్తిని మేల్కొల్పి, ప్రతి అవకాశాన్నీ అందిపుచ్చుకుని మౌలిక ప్రగతికి బాటలు వేస్తూ 2047 నాటికి భారత్‌ను ప్రబల ఆర్థికశక్తిగా నిలపాలన్న ప్రధాని మోదీ సంకల్పం ఈ బడ్జెట్‌లో కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఇది ఊతం ఇచ్చేలా ఉంది' అని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 'సంస్కరణలు, సంక్షోభ నివారణ, మౌలిక ప్రగతి, దేశ భద్రత, రైతు సంక్షేమం, వికసిత గ్రామీణ భారతం, ఆర్థిక స్వావలంబన తదితర అంశాలకు ఈ బడ్జెట్ పెద్దపీట వేసింది' అని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 'పర్యాటక రంగంలో ఇస్తున్న ప్రోత్సాహకాలు అరకు వంటి పర్యాటక ప్రాంతాలకు ఊతం ఇస్తాయి. ఏడు హైస్పీడ్ కారిడార్లలో మూడు ఆంధ్రప్రదేశ్ మీదుగానే వెళతాయి. కేంద్రం ఎంపిక చేసిన రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్లలో ఆంధ్రప్రదేశ్ కూడా ఉండటం వల్ల విలువైన ఖనిజాల వెలికితీత, తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తుంది. ఉప్పాడ 100 రోజుల ప్రణాళికకు ఈ బడ్జెట్ ఊతం ఇస్తుంది. కొబ్బరి, జీడిపప్పు, కోకో రైతుల కోసం ప్రవేశపెట్టిన పథకాలు కోనసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల రైతులకు ఊరటనిస్తాయి' అని ఆయన అభిప్రాయపడ్డారు.

# అంగన్వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ



నారాయణపేట ఫిబ్రవరి 2:)నారాయణపేట మండలం బోయినపల్లి గ్రామంలో సోమవారం అంగన్వాడీ నూతన భవన నిర్మాణం కోసంమార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్ సదా శివారెడ్డి భూమి పూజ చేశారు. ఈ భవనాన్ని 12లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్నట్లు శివారెడ్డి చెప్పారు. అదేవి ధంగా ఇందిరమ్మ ఇళ్లకు మంజూరు పత్రాలను లబ్ధిదారులకుఅందజేశారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్, మార్కెట్ డైరెక్టర్ లు శరణప్ప, వెంకటయ్య, రామచంద ర్,రాములు, మల్లేశ్,గ్రామ ప్రజలు,ఎంపీడీఓ, ఏ ఈ , పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# సకాలంలో ఓ పాజిటివ్ రక్త కణాలు అందజేసిన ఓరుగంటి మల్లేష్ గుప్త

### ఆపదలో ఉన్న మహిళ ప్రాణాలను కాపాడడం అభినందనీయం



తెలంగాణా కామారెడ్డి ప్రతినిధికామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన మంజీర(45) కు అత్యవసరంగా ఓ పాజిటివ్ తెల్ల రక్త కణాలు అవసరమని యశోద వైద్యశాల వైద్యులు సూచించడంతో వారి కుటుంబ సభ్యులు ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు కు తెలియజేయడంతో వెంటనే స్పందించి ఐవిఎఫ్ నాయకులు ఓరుగంటి మల్లేష్ సహకారంతో తెల్ల రక్త కణాలను సకాలంలో అందజేయడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ రక్తదాత ఓరుగంటి మల్లేష్ ఇప్పటివరకు 26 సార్లు రక్తదానం చేయడం జరిగిందని, ఆపదలో ఉన్నవారికి సకాలంలో రక్తాన్ని అందజేయడం కోసం ఎంత దూరమైనా వెళ్తూ సొంత ఖర్చులతో సకాలంలో రక్తాన్ని అందజేస్తూ నేటి సమాజానికి ఆదర్శంగా నిలుస్తూ ప్రాణాలను కాపాడడం అభినందనీయమని, మానవత్వానికి మించిన మతం లేదనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తురగాలన్నారు.ఆపదలో ఉన్నవారికి సహాయంగా నిలువ వలసిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉన్నదని అన్నారు.రక్తదాత మల్లేష్ కి అభినందనలు తెలియజేశారు.

# ప్రజావాణి కి 81 దరఖాస్తులు

తెలంగాణా కామారెడ్డి ప్రతినిధి ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ లోని 25 వ నెంబర్ లో అర్జీదారుల నుండి కలెక్టరేట్ సయీద్ అహ్మద్ మస్రూర్, ఏఓ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా శాఖలకు సంబంధించిన వివిధ సమస్యల పై 81 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ గ్రీవెన్స్ లో జిల్లా అధికారులు, ఆర్. స్వప్న, సూపరింటెండెంట్ (సి-సెక్షన్), వి. అనిల్, సూపరింటెండెంట్ (ఎఫ్-సెక్షన్)తదితరులు పాల్గొన్నారు.

# అంతరిక్ష సాగు ప్రాజెక్టుకు ఎంపికైన జమ్మిబండ నారాయణ స్కూల్ విద్యార్థి పులి శశాంక్



ఖమ్మం::ఖమ్మం జమ్మిబండ నారాయణ స్కూల్ లో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థి పులి శశాంక్ ప్రతిష్టాత్మకమైన ఎన్ ఎస్ ఎస్ ప్రాజెక్ట్ ( కాస్మోస్ కల్టివష్న్ ప్రాజెక్ట్ ) కు ఎంపికై పాఠశాలకు మరియు మన ప్రాంతానికి గర్వకారణంగా నిలిచారు . అంతరిక్షంలో మొక్కల పెంపకం మరియు భవిష్యత్తు వ్యవసాయ విధానాలపై పరిశోధన చేసే ఈ అరుదైన అవకాశం శశాంక్‌కు దక్కడం విశేషం అని అన్నారు . ఈ సందర్భంగా నారాయణ ఖమ్మం పాఠశాలల ఏజీఎం రామ్ కీ శశాంక్‌ను ప్రత్యేకంగా అభినందించారు . యన మాట్లాడుతూ శశాంక్ సాధించిన ఈ విజయం మన పాఠశాల యొక్క విద్యా ప్రమాణాలకు మరియు విద్యార్థుల ప్రతిభకు నిదర్శనం . కాస్మోస్ కల్టివేషన్ వంటి వినూత్న ప్రాజెక్టులు విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుతాయి . శశాంక్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటున్నాను అని కొనియాడారు . ఈ విజయం పట్ల నారాయణ ఖమ్మం పాఠశాల ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయ బృందం తల్లిదండ్రులు మరియు తోటి విద్యార్థులు శశాంక్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు .

# రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియ సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్ ఆద్వర్యం లో పూర్తి



తెలంగాణా కామారెడ్డి ప్రతినిధి2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా సోమవారం కామారెడ్డి జిల్లాలో పోలింగ్ సిబ్బంది రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ కార్యక్రమం సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్, అదనపు కలెక్టర్/అదనపు ఎన్నికల అధికారి



మధుమోహన్, అదనపు కలెక్టర్ విక్టర్ల పర్యవేక్షణలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్నికల నిబంధనలను అనుసరిస్తూ నిర్వహించడం జరిగింది. కామారెడ్డి జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో గల పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు ప్రిసైడింగ్ అధికారులు,సహాయ ప్రిసైడింగ్ అధికారులు ఇతర పోలింగ్ అధికారులు (ఓపీఓలు)లను ర్యాండమైజేషన్ విధానం ద్వారా కేటాయించారు. పోలింగ్ సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై మాస్టర్ ట్రైనర్స్ ద్వారా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సాధారణ పరిశీలకులు తెలిపారు. ఈ శిక్షణ తరగతులు ఈ నెల 4వ తేదీన నాలుగు మున్సిపాలిటీలలో నిర్వహించబడతాయని, అలాగే పోలింగ్ సామగ్రి పంపిణీ (డిస్ట్రిబ్యూషన్) ప్రక్రియ 10వ తేదీన ఉదయం 7.00 గంటల నుండి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

### శిక్షణ & డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు

బాన్సువాడ : మున్సిపల్ కార్యాలయం శిక్షణడిస్ట్రిబ్యూషన్ కేంద్రం ూ=చీఖ డిగ్రీ కళాశాల దేశాయిపేట. కామారెడ్డి : ప్రభుత్వ డిగ్రీ కళాశాల శిక్షణడిస్ట్రిబ్యూషన్ కేంద్రం గోడౌన్ (ఎస్పీ కార్యాలయం సమీపంలో) బిచ్కుంద : ప్రభుత్వ డిగ్రీ కళాశాల శిక్షణడిస్ట్రిబ్యూషన్ కేంద్రం వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఎల్లారెడ్డి : ఎంపిడిఓ కార్యాలయం శిక్షణడిస్ట్రిబ్యూషన్ కేంద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాలఈ ఎన్నికల నిర్వహణకు 239 239 645మొత్తం 1195 మంది పోలింగ్ సిబ్బంది, అదనంగా 1398 మంది రిజర్వ్ సిబ్బంది లను నియమించినట్లు సాధారణ పరిశీలకులు తెలిపారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో రఘునందన్ శివకుమార్ కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# గంగాపుత్ర సంఘం ఆధ్వర్యంలో బోనాలతో తెప్ప కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.



తెలంగాణా కామారెడ్డి ప్రతినిధికామారెడ్డి జిల్లా కేంద్రంలోని పట్టణంలో గంగమ్మ పంచముఖి హనుమాన్ మందిరంలోని ఒడిలోకి చేరిన తిప్ప కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో గంగపుత్ర సంఘం ప్రదేశ్ సంఘ నాయకులు పాల్గొని విజయవంతం చేశారు ఈ కార్యక్రమంలో లింగమూర్తి ప్రధాన కార్యదర్శి కొనింటి అంజయ్య చింతకింది వెంకటేష్ కోశాధికారి కార్యదర్శి పందిరి కిరణ్ మాజీ అధ్యక్షులు పెద్ద బోయిన రాజు గౌరవ అధ్యక్షులు మారవేణి రాజన్న తదితరులు సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలి

## జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్




నారాయణపేట ఫిబ్రవరి 2:ల్లాలో మున్సిపాలిటీ ఎన్నికలు ప్రశాంతంగా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశించారు.సోమవారం రోజు నారాయ ణపేట జిల్లా పోలీస్ అధి కారులతో జిల్లా పోలీస్ కార్యా లయంలోనీ కాన్ఫరెన్స్ హాల్లో నెలవారి నేర సమీక్ష సమావేశాన్ని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఉన్న పెండింగ్ కేసులు, దర్యాప్తులో నాణ్యత, నేరాల నియంత్రణ అంశాల పై ఎస్పీ సమీక్షిం చారు. అలాగే ప్రజలకు మెరు గైన పోలీసు సేవలు అందించ డమే లక్ష్యంగా పని చేయాల ని, రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, ఆన్లైన్ మోసాల పై ప్రజలకు అవగాహన కల్పిం చాలని సూచించారు. మున్సి పల్ ఎన్నికలు పూర్తిగా పారద ర్శకంగా, శాంతియుత వాతా వరణంలో నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకో వాలని ఆదేశించారు.ప్రతి కేసులో క్యాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండేలా దర్యాప్తు చేపట్టి నేరస్తులకు శిక్ష పడేటట్లు చర్యలు తీసుకోవాలని, బాధి తులకు న్యాయం అదెలా చూడాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని, నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తే సహించే ది లేదని హెచ్చరించారు. జనసామర్థ్యం గల ప్రదేశా లలో విజబుల్ పోలీసింగ్ విధులు నిర్వహించాలని తెలిపారు. జిల్లా లో అక్రమ గంజాయి రవాణా, మట్కా , జూదం వంటి అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, పబ్లిక్ ప్రదే శాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదే శించారు. దొంగతనాల కేసు ల్లో ఆధునిక సాంకేతికతను వినియోగించి లాంగ్ పెండింగ్ కేసులను త్వరితగతిన పరి ష్కరించి దొంగిలించిన సొత్తు ను బాధితులకు అందించా లన్నారు. మున్సిపల్ ఎన్నిక లలో తీసుకోవలసిన భద్రతా చర్యలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సమస్యాత్మక పోలిం గ్ కేంద్రాలు, సున్నితమైన గ్రామాలను ముందుగానే గుర్తించి అక్కడ ప్రత్యేక బందో బస్తు ఏర్పాటు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సూచించారు.పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్స్ ను వెంటనే అమలు చేయాలని, రౌడీ షీటర్స్, పాత నేరస్తులు, అసాంఘిక శక్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని ఎస్పీ ఆదేశించారు. ఎన్నికల సమయంలో గొడవలు, ఘర్షణలకు ఆస్కారం లేకుండా ముందస్తుగా బైండోవర్ కేసులు నమోదు చేసి, వెపన్స్ డిపాజిట్ ప్రక్రియను కచ్చితంగా అమలు చేయాలన్నారు.పోలింగ్ కేంద్రాల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు ఉండాలని, మహిళలు, వృద్ధులు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉంటూ నిరంతరం తనిఖీలు నిర్వ హించి నగదు, మద్యం, ఇతర ప్రలోభకర వస్తువుల అక్రమ రవాణాను అడ్డుకోవాలని తెలిపారు.ఎన్నికల కోడ్‌ను కచ్చితంగా అమలు చేయాల ని, కోడ్ ఉల్లంఘనలకు పాల్ప డిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు అన్ని పోలీస్ విభాగాలు సమన్వయంతో పనిచేసి జిల్లాలో శాంతి భద్రతలు కాపాడాలని జిల్లా ఎస్పీ గారు స్పష్టం చేశారు.జిల్లా మున్సి పాలిటీల పరిధిలో, మరికల్ కేంద్రంలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ముందస్తు గత మూడు సంవత్సరాల నుండి ఎక్కువగా జరిగిన రోడ్డు ప్రమాదాల ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్ యాక్సిడెంట్ ప్రోన్ ఏరియాస్ ను గుర్తించి అక్కడ రోడ్డు ప్రమాదాల నివా రణకు తీసుకోవలసిన చర్యల ను రోడ్డు భద్రతా మీటింగులో చర్చించి సంబంధిత అధికా రులతో కలిసి రోడ్డు ప్రమా దాల నివారకు సూచికలను ఏర్పాటు చేయాలని అధికా రులకు తెలిపారు.ఈ సమా వేశంలో అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హూల్ హక్, డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐలు శివ శంకర్, రామ్ లాల్, సైదులు, భగవత్ రెడ్డి ఎస్సైలు వెంకటేశ్వర్లు, నరేష్, సునీత, రాజు, రాముడు, బాలరాజు, రాజశేఖర్, రాములు, భాగ్యలక్ష్మి రెడ్డి,నవీద్, అశోక్ బాబు, పురుషోత్తం, గాయత్రి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ఫోటో ఓటర్ స్లిప్పుల పంపిణీకి సంబంధించి. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశము.

### బి ఎల్ వో ద్వారా ఓటర్ స్లిప్పుల పంపిణీ

### ఎన్నికల అధికారి మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాస్





మిర్యాలగూడ ఫిబ్రవరి 2 రెండవ సాధారణ ఎన్నికలు -2026 కు సంబంధించి సోమవారం మిర్యాలగూడ మున్సిపాలిటీ సమావేశం మందిరంలో ఫోటో ఓటర్ స్లిప్పుల పంపిణీకి సంబంధించి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశము ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సహాయ ఎన్నికల అధికారి మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ బి ఎల్ ఓ ద్వారా ఓటర్ స్లిప్పు లను పంపిణీ చేస్తున్నామని తెలియజేశారు ఓటర్ స్లిప్పు లను రాజకీయ నాయకులు కూడా బలుకుగా పంపిణీ చేస్తున్న అది నేరంగా పరిగణింప పడుతుందని తెలియజేసినారు. ఓటర్ స్లిప్పులను జిరాక్స్ కాపీల కింద తీసి పంపిణీ చేయడం కూడా నేరమే అన్నారు. కావాలనుకుంటే టిఎస్సి ద్వారా ఫోటో లేని ఓటర్స్ దిక్కులను డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలియజేశారు డి ఆర్ సి సెంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మిర్యాలగూడ యందు ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. అదేవిధంగా కౌంటింగ్ కేంద్రాన్ని అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ అవంతిపురం యందు ఏర్పాటు చేయనిందని తెలిపారు. పంపిణీకి పోలింగ్ మూడు రోజుల ముందే పూర్తి కావాలని కమిషనర్ అన్నారు .ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ బాలు, కోటయ్య రాజకీయం పార్టీల నాయకులు నూకల వేణుగోపాల్ రెడ్డి,డబ్బికార్ మల్లేష్, ఇలియాస్, ప్రవీణ్ కుమార్ నోడల్ ఆఫీసర్ బక్కయ్య,మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్చార్జ్మాండ్ర .శివానందరెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరిన

### తూడిచెర్ల గ్రామ వైసిపి నాయకులు, కార్యకర్తలు



దేశ పోరాటం న్యూస్ నందికొట్కూరు:- నందికొట్కూరు నియోజకవర్గం, జూపాడుబంగ్లా మండలంలోని, తూడిచెర్ల గ్రామానికి చెందిన వైసీపీ పార్టీ కార్యకర్తలు, నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇంచార్జ్ మాండ్ర.శివానందరెడ్డి సమక్షంలో గ్రామ నాయకులు బాలమద్దిలేటి,నల్లబోతుల రాముడు ల ఆధ్వర్యంలో దొడ్డ సుధాకర్ మరియు దాదాపు



150పైగా కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగింది. పార్టీలో చేరిన తూడిచెర్ల గ్రామ ఎన్.వెంకట నాయుడు, మాజీ సొసైటీ చైర్మన్ నరసింహుడు, వార్డు మెంబర్ వెంకటయ్య, చిన్న వెంకటస్వామి, కామనూరు మధు, నాగేశ్వరరావు, శివ ఆచారి, హరినాథ్ రెడ్డి, సూరి, పాలమద్రి నారాయణ, ఎల్లాల హనుమంతు, పల్లె కృష్ణ,బోయ శివన్న,బోయ ధర్మానాయుడు, కార్పెంటర్ హుస్సేన్ సాబ్, కల్లం రాజు, శాంత రాజు, ఎం.వెంకటేశ్వర్లు, బోరెల్లి మహేష్, రవికుమార్, శివ నారాయణ, కే.వెంకటేశ్వర్లు, కే.చిన్న వెంకటేశ్వర్లు, గోగుల నాగశివుడు, చిమ్మే సురేష్,ఆంజనేయులు, పెరిమి శేఖర్, అంబారావు శ్రీనివాసులు గౌడ్, బోకూరు, పాపారాయుడు, బోయ నాగన్న, బోయ చంద్రబాబు, సత్యనారాయణ, దొంతుల రాజులు, పుల్లయ్య, బండి హరికృష్ణ, మురహరి ప్రసాద్, రమణయ్య, భాస్కర్, బాలస్వామి,పోతుల శేషి రెడ్డి, లక్ష్మీనారాయణ గౌడ్ , రాజమురి నాగేశ్వరరావు, భజన రాజశేఖర్, తదితరులు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగింది. కొత్తగా పార్టీలో చేరిన వారికి మాండ్ర శివానందరెడ్డి తెలుగుదేశం పార్టీ కండువా మెడలో వేసి, పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కన్వీనర్ జి. మోహన్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ గిరిశ్వర్ రెడ్డి, రవికాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, వెంకటరమణారెడ్డి, సొసైటీ చైర్మన్ పీక్కిలి శ్రీనివాసులు, యూనిట్ ఇంచార్జ్ రమణారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, సత్యనారాయణ శెట్టి పాల్గొనడం జరిగింది.

# పి ఎస్ కే కంపెనీ వారి భారీ వాహనాలు తిరగడం వల్ల పాడైపోయిన గ్రామీణ రోడ్లను వెంటనే కొత్త రోడ్లు వేయాలి

## జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు డిమాండ్



దేశ పోరాటం న్యూస్ పాములపాడు :-పి ఎస్ కే కంపెనీ వారి భారీ వాహనాలు తిరగడం వలన పాడైపోయిన గ్రామీణ ప్రాంతాల రోడ్లను వెంటనే వెయ్యాలని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు డిమాండ్ చేశారు. నంద్యాల జిల్లా, పాములపాడు మండలంలోని, చెలిమిల్ల రస్తాను



పరిశీలిస్తూ డివిఎంసి మెంబర్ లింగాల నాగరాజు మాట్లాడుతూ దాదాపుగా రెండు సంవత్సరాల క్రితం నేషనల్ హైవే రోడ్డుకు మట్టి, బిలుకు తోలడానికి ఆర్టీవో అధికారులు నిబంధనలకు విరుద్ధంగా పి ఎస్ కే కంపెనీ వారి భారీ వాహనాలకు అనుమతులు ఇచ్చినందుకు పాములపాడు నుండి చెలిమిళ్ళ వరకు, అలాగే కృష్ణరావుపేట నుండి ఆనందపురం వరకు రోడ్డు చింద్రభద్రమైందని నేషనల్ హైవేకు హైవేకు మట్టి, బిలుకు తోలుకున్న పిఎస్కే కంపెనీ వారు కూడా రోడ్డు వెయ్యాలనే ఆలోచన కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చెలిమీల్ల, పాములపాడు, కృష్ణరావుపేట, ఆనందపురం, సిద్దేశ్వరం గ్రామాల ప్రజలు, మరియు కొత్తపల్లి మండలంలోని గ్రామాల వాళ్లు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని వారు అన్నారు. రోడ్లు పాడైపోవడానికి భారీ వాహనాలకు అనుమతులు ఇచ్చిన ఆర్టీవో అధికారుల లేదా మట్టి, బిలుకు తోలుకొని నేషనల్ హైవే రోడ్డు వేసిన పి ఎస్ కే కంపెనీ వారు వేస్తారో వాళ్ళే తెలుసుకోవాలని ఆయన హెచ్చరించారు. భారీ వాహనాలకు అనుమతులు ఇచ్చిన ఆర్టీవో అధికారులపై నేషనల్ హైవే రోడ్డు పూర్తిచేసుకుని, గ్రామీణ రోడ్లను పాడుచేసిన పి ఎస్ కే కంపెనీపై లోకయుక్త మానవ హక్కుల కమిషన్కు తీసుకెళ్తారని ఆయన హెచ్చరించారు.

# పాములపాడు మండల సీనియర్ ఫోటోగ్రాఫర్ షేక్.అల్లిసా మరణం ఫోటోగ్రఫీ రంగానికి తీరనిలోటు:-ఫోటో జర్నలిస్టులు, విలేకరులు



దేశ పోరాటం న్యూస్ పాములపాడు:- పాములపాడు గ్రామానికి చెందిన సీనియర్ ఫోటోగ్రాఫర్ షేక్.అల్లిసా సోమవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. ఫోటోగ్రఫీ రంగంలో అనేక సంవత్సరాలుగా సేవలందించిన ఆయన మండలంలో విశేష గుర్తింపు పొందారు.ఆయన మరణవార్తతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ఫోటో జర్నలిస్టులు,



విలేకరులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం ఫోటోగ్రఫీ రంగానికి తీరని లోటు అని అన్నారు పాములపాడు మండలంలోని, అన్ని గ్రామాలలో జరిగిన అనేక కార్యక్రమాలు, శుభకార్యాలకు తన ఫోటోగ్రఫీ సేవలతో ప్రత్యేక ముద్ర వేసిన వ్యక్తిగా, అందరికీ సుపరిచితుడుగా, ఆయనకు మంచి పేరు ప్రఖ్యాతలు ఉన్నాయి. అంత్యక్రియలు మంగళవారం ఉదయం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. షేక్.అల్లిసా మృతికి నివాళులు అర్పించిన, ప్రగాఢ సానుభూతిని ఫోటో జర్నలిస్టులు, ప్రింట్ అండ్ ఎల్రక్టానిక్ మీడియా విలేకరులు, గ్రామ పెద్దలు, స్నేహితులు, బంధుమిత్రులు స్థానికులు తెలియజేశారు.

## మాజీ ప్రధాని షేక్ హసీనాకు పదేళ్ల జైలు శిక్ష



ఢాకా : రెండు అవినీతి కేసుల్లో బంగ్లాదేశ్ కోర్టు సోమవారం బహిష్కృత ప్రధాని షేక్ హసీనాకు పదేళ్ల జైలు శిక్ష విధించింది. రెండు కేసుల్లో ఐదేళ్ల చొప్పున మొత్తం పదేళ్లు శిక్ష విధిస్తున్నట్లు ఢాకా ప్రత్యేక జడ్జీల కోర్టు -4 జడ్జి రబియుల్‌ఆలం ఈ ఉత్తర్వులను జారీ చేసినట్లు ప్రభుత్వ మీడియా తెలిపింది. పూర్బాచల్‌లోని రజక్ న్యూటౌన్ ప్రాజెక్టుకి సంబంధించి ప్లాట్ల కేటాయింపుల్లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై హసీనా, ఆమె మేనల్లుడు రద్వాన్ ముజిబ్ సిద్ధిక్, ఆమె మేనకోడళ్లు తులిప్ రిజ్వానా సిద్ధిక్, అజ్మినా సిద్ధిక్ మరియు ఇతరులకు కోర్టు శిక్ష విధించింది. తీర్పు మధ్యాహ్నం 12.30గంటలకు వెలువడింది. తులిప్ సిద్ధిక్‌కి రెండు కేసుల్లోనూ చెరో రెండేళ్లు కలిపి నాలుగేళ్లు, రద్వాన్ ముజిబ్ సిద్ధిక్, అజ్మిన్ సిద్ధిక్‌లకు రెండు కేసుల్లోనూ చెరో ఏడేళ్లు శిక్ష విధించింది. ఈ కేసులో కోర్టు ఎదుట లంగిపోయిన నిందితుడు, రజక్ సభ్యుడు మొహమ్మద్ కుర్షీద్ అలంకి రెండు కేసుల్లోనూ ఏడాది పాటు మొత్తంగా రెండేళ్లు శిక్ష విధిస్తున్నట్లు తెలిపింది. అలాగే దోషులందరికీ ఒక్కొక్కరికీ రూ.లక్ష జరిమానా విధించింది. జరిమానా చెల్లించని వారికి అదనంగా ఆరునెలల జైలుశిక్ష విధించాలని ఆదేశించింది. పెద్ద ఎత్తున ఆందోళనలు చెలరేగడంతో గతేడాది ఆగస్ట్5న బంగ్లాదేశ్ నుండి పారిపోయిన షేక్ హసీనా ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. ఆమెను పరారైన వ్యక్తిగా కోర్టు గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. హసీనా రూ.10లక్షలవిలువైన రెండుప్లాట్ల కేటాయింపుల్లో ఆమె అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు అవినీతి నిరోధక శాఖ (ఎసిసి) కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే.

## చీరపైనే ఫోకస్.. ఇలాంటి ప్రశ్నలు వారిని అడుగుతారా

- మంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ : దేశ ఆర్థిక ముఖ చిత్రాన్ని ఆవిష్కరించే కేంద్ర బడ్జెట్ ప్రసంగం కంటే, తన వస్త్రధారణపై సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు. ఆదివారం లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అనంతరం ఈ విషయమై ఆమె ఘాటుగా స్పందించారు. ప్రతి సంవత్సరం బడ్జెట్ రోజు తాను ఏ చీర ధరించబోతున్నాననే ప్రశ్నలు తనకు ఒత్తిడిగా మారుతున్నాయని మంత్రి నిర్మలా ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు 'ఎందుకు ఇలా ప్రశ్నలతో వేధిస్తున్నారు ? అని అడిగారు. " ప్రతి ఏటా బడ్జెట్ సమయంలో నేను ఎలాంటి చీర ధరించాను అనే అంశంపైనే ఎక్కువ ఫోకస్ పెడుతున్నారు. అదే ఒక పురుష మంత్రి బడ్జెట్ ను ప్రవేశపెడితే.. ఆయన వేసుకున్న సూట్ గురించో, బట్టల గురించో చర్చ జరుగుతుందా ? ఇలాంటి ప్రశ్నలు వారిని అడుగుతారా ? " అంటూ ఆమె సూటిగా ప్రశ్నించారు. దేశాభివృద్ధికి సంబంధించిన ఆర్థిక విధానాలు, పన్ను సంస్కరణలు, కేటాయింపులపై లోతైన చర్చ జరగాల్సిన సమయంలో.. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న మహిళా మంత్రి ధరించే దుస్తులపై దృష్టి సారించడం సరికాదని ఆమె అభిప్రాయపడ్డారు.

## 2027 జనగణనలో కుల నమోదుపై పిల్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు




న్యూఢిల్లీ : 2027 జనగణనలో పౌరుల కులాన్ని నమోదు చేసేందుకు అనుసరించే ప్రక్రియను ప్రశ్నిస్తూ దాఖలైన ప్రజాప్రయోజనవ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు సోమవారం కొట్టివేసింది. పిటిషన్‌దారు, విద్యావేత్త ఆకాష్ గోయల్ పిల్‌లో చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని కేంద్రాన్ని, భారత రిజిస్ట్రార్ జనరల్ మరియు సెన్సస్ కమిషనర్ కార్యాలయాన్ని ఆదేశించింది. కుల సమాచారాన్ని గుర్తించడానికి "ముందుగా నిర్ణయించిన డేటా" లేదని ధర్మాసనం తెలిపింది. "ఈ ప్రక్రియ జనాభా గణన చట్టం 1958, మరియు 1990 రూపొందించిన నిబంధనల ప్రకారం నియంత్రించబడుతుంది. జనగణన కార్యకలాపాల విధానాలు, పద్ధతులను నిర్ణయించడానికి సంబంధిత అధికారులకు అధికారం ఇస్తుంది" అని ధర్మాసనం పేర్కొంది. లీగల్ నోటీసు మరియు పిటిషన్‌లో లేవనెత్తిన సూచనలను అధికారులు పరిగణనలోకి తీసుకోవచ్చని మరియు పిల్‌ను కొట్టివేయవచ్చని ధర్మాసనం పేర్కొంది. పౌరుల కుల సమాచారాన్ని నమోదు చేయడానికి, వర్గీకరించడానికి మరియు ధృవీకరించడానికి వినియోగించే పారదర్శక ప్రశ్నాపత్రాన్ని పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది ముక్తా గుప్తా కోరారు. కులగణన ఎస్‌సి,ఎస్‌టి వర్గాలను దాటి ఉందని అంగీకరించినప్పటికీ, పౌరుల కుల గుర్తింపును నమోదు చేసే ప్రామాణిక విధానాన్ని జనగణన కార్యాలయం వెల్లడించలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. 2027 జనగణన అధికారికంగా 16వ జాతీయ జనగణన. 1931 తర్వాత సమగ్ర కుల గణనను చేర్చిన మొదటి జనగణన, దేశంలో మొట్టమొదటి పూర్తి డిజిటల్ జనగణన కానుంది.

## హింసను ప్రేరేపించటానికి వైసిపి కుట్రలు పన్నుతోంది




అమరావతి : రాష్ట్రంలో హింసను ప్రేరేపించటానికి వైసిపి కుట్రలు పన్నుతోందని టిడిపి అధినేత, సిఎం చంద్రబాబు ఆరోపించారు. అధికారం కోల్పోయామనే అసహనంతోనే రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోందని, అలజడి సృష్టించేందుకే ఆ పార్టీ నేతలు బూతులు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం రాష్ట్ర మంత్రులు, పార్టీ సీనియర్ నేతలతో ముఖ్యమంత్రి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో వైసిపి అడ్డంగా దొరికిపోయిందని, రాష్ట్ర ప్రజలంతా ఆ పార్టీని చీదరించుకుంటున్నారని అన్నారు. చేసిన పాపాలను దారిమళ్లించాలనేది వైసిపి కుట్ర అని నిప్పులుచెరిగారు. పెట్టుబడులు సాధించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నదే మన ప్రధాన అజెండా అని అన్నారు. అది వైసిపి నేతలకు నచ్చడం లేదని, అందుకే అడ్డుకునేందుకు కుట్రలకు పాల్పడుతున్నారని అన్నారు. తప్పు చేసిన ప్రతి ఒక్కరినీ చట్టపరంగా శిక్షించి తీరుతామన్నారు. టిడిపి కార్యకర్తలు సంయమనం పాటించేలా మంత్రులు, నేతలు బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యకర్తలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని వైసిపి ట్రాప్‌లో పడొద్దు అని సూచించారు. అలా జరగకుండా పార్టీ నేతలు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. హింస, విధ్వంసం, అవినీతి పునాదులపై వైసిపి పుట్టిందనీ, ఆ పార్టీ ట్రాప్‌లో పడితే వారికీ.. మనకీ తేడా ఉండదు అని చంద్రబాబు అన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జాతరలు.. సాంస్కృతిక వైభవానికి ప్రతిరూపం!

సమస్త గిరిజనుల సమారాధ్య దేవతలు, కష్టాలు కడతేర్చే కలియుగ దైవాలుగా, ఆపదలో ఉన్నవారిని ఆదుకునే ఆపద్భాందవులుగా, కేవలం తెలంగాణలోనే గాక అఖిల భారతదేశంలోనే వనదేవతలుగా పూజలందుకుంటున్నారు సమ్మక్క-సారక్క. 'దేశంలోనే అతి పెద్ద గిరిజన జాతర'గా గణతికెక్కిన మేడారం జాతర గిరిజన సంప్రదాయ రీతుల్లో జరుగుతుంది. మన రాష్ట్రం నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్, ఒడిషా, చత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల నుండి కూడా లక్షల కొద్దీ భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు..

### అతిపెద్ద గిరిజన జాతర..

తెలంగాణ పల్లె పల్లెలో జాతరలు జరుగుతున్నాయి. వాటిలో కొన్ని మాత్రమే ప్రముఖంగా కనిపిస్తాయి. సమ్మక్క సారలమ్మ జాతర అనేది ములుగు జిల్లా, తాడ్వాయి మండలానికి చెందిన మేడారం గ్రామంలో జరిగే ఒక గిరిజన జాతర. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన పండుగ. ఈ జాతర తెలంగాణ రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందింది. భారతదేశంలో కుంభమేళా తర్వాత అత్యధికులు హాజరయ్యే పండుగ ఇదే. వివిధ రాష్ట్రాల నుంచి పది కోట్ల మందికి పైగా హాజరు అవుతారని అంచనా. ములుగు జిల్లా కేంద్రం నుండి 44 కిలోమీటర్ల దూరంలో తాడ్వాయి మండలంలో ఉన్న మారుమూల అటవీ ప్రాంతమైన మేడారంలో దట్టమైన అడవులు, కొండ కోనల మధ్య ఈ చారిత్రాత్మకమైన జాతర జరుగుతుంది.

### అత్యధికులు హాజరయ్యే పండుగ..

సమస్త గిరిజనుల సమారాధ్య దేవతలు, కష్టాలు కడతేర్చే కలియుగ దైవాలుగా, ఆపదలో ఉన్నవారిని ఆదుకునే ఆపద్భాందవులుగా, కేవలం తెలంగాణలోనే గాక అఖిల భారతదేశంలోనే వనదేవతలుగా పూజలందుకుంటున్నారీ సమ్మక్క-సారక్క. దేశంలోనే అతి పెద్ద గిరిజన జాతరగా గణతికెక్కిన మేడారం జాతర గిరిజన సంప్రదాయ రీతుల్లో జరుగుతుంది. మన రాష్ట్రం నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిషా, చత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల నుండి కూడా లక్షల కొద్దీ భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.



### నాగోబా జాతర..

యేటా పుష్యమాసము అమావాస్య రోజున జాతర ప్రారంభమవుతుంది. సర్పజాతిని పూజించడమే ఈ జాతర ప్రత్యేకత. పుష్య మాసం అమావాస్య రోజున తమ ఆరాధ్య దైవమైన నాగోబా (శేష నారాయణమూర్తి) పురివిప్పి నాట్యమాడుతాడని గిరిజనుల నమ్మకం. అమావాస్య నాడు సరిగ్గా సాయంత్రం ఏడు గంటల నుంచి రాత్రి పన్నెండు గంటల మధ్య కాలంలో గిరిజన పూజారులకు తమ ఆరాధ్య దైవం ఆదిశేషువు కనిపిస్తాడని,వారందించే పాలు తాగి ఆశీర్వదించి అదృశ్యమవుతాడని గిరిజనులు విశ్వసిస్తారు.ఆదిమ గిరిజనుల్లో మేస్రం వంశీయుల ఆరాధ్యదైవం నాగోబా గోండుల దేవుడు. నాగోబా దేవాలయం ఆదిలాబాద్‌కు 40 కిలోమీటర్ల దూరంలో ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ దగ్గర కెస్లాపూర్ గ్రామంలో ఉంది. కెస్లాపూర్‌లో జరిగే ఈజాతరను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించింది. కెస్లాపూర్ జనాభా 400కు మించదు. కానీ పండగనాడు లక్షలాది మందితో అది జనారణ్యంగా మారుతుంది. నాగోబాను కొలిస్తే పంటలు బాగా పండుతాయని, శాంతి విరాజిల్లుతుందని, రోగాలు మటు మాయమవుతాయని గిరిజనుల నమ్మకం.

### నాగోబా చరిత్ర నేపథ్యం..

నాగోబా చరిత్రను గోండు గిరిజనులు రకరకాలుగా చెప్పుకుంటారు. పూర్వం మేస్రం కుటుంబానికి చెందిన నాగాయిమోతి రాణికి నాగేంద్రుడు కలలో కనిపించి సర్పం రూపంలో ఆమె గర్భాన జన్మిస్తానని చెప్పాడని, ఆ కల నిజమైందని గోండుల నమ్మకం. సర్పరూపంలోని నాగేంద్రునికి తల్లి అంటే రాణి తన తమ్ముడి కూతురు గౌరీతో వివాహం జరిపించింది. అత్త ఆజ్ఞ మేరకు గౌరీ భర్తను బుట్టలో పెట్టుకుని గోదావరి ప్రయాణం కాగా, ఒకచోట పాము ఉడుం రూపంలో కనిపించగా ఆ ఊరు ఉడుంపూరైంది. ఆ తర్వాత గౌరి ధర్మపురి వద్ద గోదావరిలో స్నానం చేయడానికి వెళ్లగా ఆమెను చూసి నాగేంద్రుడు మనిషి రూపంలోకి మారాడని, అయితే పేరు ప్రతిష్టలు కావాలో, సంప్రదాయం కావాలో తేల్చుకో అనగా గౌరి సంప్రదాయాలను లెక్కచేయక పోవడంతో తిరిగి పాముగా మారాడని కథ.

### నాగేంద్రుడి గుట్టవద్ద దేవాలయం..

ఆ తర్వాత ఉడుంపూర్ నుంచి గరిమెల వరకు అతని కోసం వెతికిన గౌరి గోదావరిలో సత్యవసి గుండంలో కలిసిపోయిందని, నాగేంద్రుడు ఆమె వెంట ఉంచిన ఎద్దు రాయిగా మారిందని భక్తుల విశ్వాసం. ఆ తర్వాత పెళ్లి అయిన ప్రతి జంటకు నాగేంద్రుడి సన్నిధిలో పరిచయం చేయాలని (భేటి కోరియాక్) చెప్పి నాగేంద్రుడు కెస్లాపూర్ గుట్టల్లోకి వెళ్లిపోయాడని చెప్తుంటారు. అదే కెస్లాపూర్ గ్రామంగా మారి పోయింది. నాగేంద్రుడు వెళ్లిన గుట్ట వద్ద నాగోబా దేవాలయాన్ని నిర్మించారు. మేస్రం వంశం కింద 22 తెగలు వస్తాయి. ఏడుగురు దేవతలను కొలిచే వారంతా మేస్రం వంశీయుల కిందికి వస్తారు. మడావి, మర్సకోల, పుర్క, మేస్రం, వెడ్మ, పంద్రా, పుర్వెత ఇంటి పేర్లు గలవారంతా మేస్రం వంశంలో వస్తారు.

### తెలంగాణ సంస్కృతి సంకేతం..

నాగోబా జాతర ప్రపంచంలోని అతిపెద్ద గిరిజన జాతరల్లో కోడి పందేలు, జూదం, పేకాట, అస్లీల నృత్యాలు హోరెత్తించే పందెం రాయుళ్లకు, బెట్టింగ్ బంగారాజులకు, అల్ట్రా కల్చర్ కు భిన్నంగా తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటి చెప్పే విధంగా జాతరలు జరుగుతున్నాయి.

# గ్రామ స్వరాజ్యానికి ఆర్థిక స్వావలంబనే పునాది

భారత ప్రజాస్వామ్యానికి బలమైన పునాది గ్రామస్థాయి పరిపాలనే. దేశ రాజ్యాంగంలోని 73వ సవరణ ద్వారా గ్రామ పంచాయతీలకు రాజ్యాంగ హోదా కల్పించిన ప్రధాన ఉద్దేశం.. అధికారాలు, బాధ్యతలు, ఆర్థిక వనరులు ప్రజలకు దగ్గరగా ఉండాలన్నదే. ఈ దృష్టికోణాన్ని రాష్ట్ర స్థాయిలో అమలు చేయడానికి రూపొందించిందే ఆంధ్ర ప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం- 1994. గ్రామాభివృద్ధి మాటల్లో కాదు, గ్రామ పంచాయతీల ఆర్థిక స్వావలంబనలోనే ప్రతిఫలిస్తుంది. ఆ స్వావలంబనకు పునాది పన్నుల వసూలు వ్యవస్థ...

### గ్రామ ఆదాయమే ఆధారం..

రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 + ప్రకారం పంచా యతీలు స్థానిక ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయానికి సంబంధించిన ప్రణాళికలు రూపొందించి అమలు చేయాల్సిన బాధ్యత కలిగి ఉంటాయి. పదకొండో షెడ్యూల్‌లో పేర్కొన్న అంశాలపై పథకాలను అమలు చేసే అధికారాన్ని కూడా రాజ్యాంగం కల్పించింది. ఈ క్రమంలోనే ఏపీ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్-62 గ్రామ పంచాయతీలకు ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, వృత్తి పన్ను, గ్రామ ఉత్పత్తులపై పన్ను, మార్కెట్ ఫీజులు, సేవా రుసుములు వసూలు చేసే అధికారం ఇస్తుంది. గ్రామ అవసరాలకు గ్రామ ఆదాయమే ఆధారం కావా లన్నదే ఈ నిబంధనల సారాంశం.

### పరిమితమైన అధికారాలు..

అయితే, గ్రామ పంచాయతీలకు చెందిన స్థలాల లీజులపై కనీస ధర నిర్ణయం, ప్రకటనలపై పన్నుల విధింపు వంటి కీలక అధికారాలు జిల్లా పరిషత్‌లకు పరిమితం చేయడం వల్ల గ్రామ పంచాయతీలకు ఆర్థిక నష్టం జరుగుతోంది. దీనివల్ల పంచాయతీ భూములు అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం కూడా ఏర్పడుతోంది. గతంలో గ్రామ పంచాయతీల పన్నుల వసూలు విధానం సరళంగా ఉండేది. గ్రామ సభల్లో పన్నులపై చర్చలు జరిగేవి.. ప్రజాప్రతినిధుల పాత్ర స్పష్టంగా ఉండేది. ప్రజలు చెల్లించిన పన్నులు గ్రామంలోనే వినియోగం అవుతున్నాయన్న విశ్వాసం ఉండేది.. ప్రస్తుతం డిజిటలైజేషన్, ఆన్‌లైన్ చెల్లింపులు, ఈ-రసీదుల వల్ల పారదర్శకత పెరిగి నప్పటికీ, గ్రామ పంచాయతీల నిర్ణయాధికారాలు పరిమిత మయ్యాయన్న భావన పెరుగుతోంది.



### గ్రామ పాలనపై కొత్త ఆశలు..

ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన సమస్య చట్టం, అమలు మధ్య ఉన్న అంతరం. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పవన్ కళ్యాణ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామ పాలనపై కొత్త ఆశలు ఏర్పడ్డాయి. గ్రామాలు కేంద్రంగా అభివృద్ధి జరగాలన్న ఆయన దృష్టి గ్రామ స్వరాజ్య భావనకు అనుగుణంగా ఉంది. ఈ దశలో పవన్ కళ్యాణ్ పరిపాలన ద్వారా గ్రామ పంచాయతీలు ఆశిస్తున్నది చట్టం ఇచ్చిన అధికారాల పునరుద్ధరణ, ఆర్థిక స్వావలంబనకు దారి చూపే సంస్కరణలు జరగాలని కోరుకుంటున్నారు.

### కేంద్రం దృష్టిలో గ్రామ స్వరాజ్యం..

భారత ప్రభుత్వం స్పష్టంగా చెబుతున్న విషయం ఏమిటంటే, లోకల్ సెల్ఫ్ గవర్నెన్స్ లేకుండా సమగ్ర అభివృద్ధి సాధ్యం కాదు.. 73వ రాజ్యాంగ సవరణ, గ్రామ సభల ప్రాధాన్యం, ఈ-పంచాయత్, డిజిటల్ ఇండియా, ఫైనాన్స్ కమిషన్ల ద్వారా నిధుల బదిలీ ఇవన్నీ గ్రామ పంచాయతీలను ఆర్థికంగా, పరిపాలనా పరంగా బలోపేతం చేయడానికే ఉద్దేశింపబడినవి. కేంద్ర ప్రభుత్వ దృష్టిలో పన్నులు ప్రజలపై భారం కాదు, అవి స్థానిక అభివృద్ధికి పెట్టుబడి. కానీ ఆ పెట్టుబడి ప్రయోజనం ప్రజలకు కనిపించాలి. అప్పుడే పన్నుల చెల్లింపుపై ప్రజల అంగీకారం పెరుగుతుంది.

### గ్రామ పంచాయతీలకు భారీ నష్టం

పంచాయతీ పరిధిలో ఖాళీ స్థలాలపై పన్ను నిబంధన లేకపోవడం వల్ల గ్రామ పంచాయతీలకు భారీ ఆర్థిక నష్టం జరుగుతోంది. కనీసం రూర్బన్ గ్రామ పంచాయతీలలో అయినా ఖాళీ స్థలాలపై పన్ను విధించే అధికారం కల్పిం చాలి. అదే విధంగా సీఆర్‌డీఏ, అర్బన్ డెవలప్‌మెంట్, కమర్షియల్ టాక్స్ శాఖల ద్వారా గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు సకాలంలో అందడం లేదు. గ్రామ స్వయం పాలన లక్ష్యం మరుగున పడకుండా డిజిటలైజేషన్ అమలు చేయాలి. రిజిస్ట్రేషన్ శాఖ (స్టాంప్ డ్యూటీ), వాణిజ్య పన్నుల శాఖ (వృత్తి పన్ను), గనుల శాఖ (సీనరేజ్ గ్రాంట్లు)లను స్వర్ణ గ్రామపంచాయతీ పోర్టల్‌తో అనుసంధానం చేసి, గ్రామ పంచాయతీలకు చెందాల్సిన నిధులు సకాలంలో జమయ్యేలా చర్యలు తీసుకోవాలి. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం నిధులు, విధులు, సిబ్బంది బదలాయింపు జరిగితే గ్రామపంచా యతీలు ఆదాయ సమీకరణ పెంచుకోవడమే కాకుండా, మహాత్మా గాంధీ గ్రామ స్వరాజ్య కల సాకారం దిశగా పయనించే అవకాశం ఏర్పడుతుంది.

# దావోస్ వేదికపై తెలంగాణ రైజింగ్

2026 దావోస్ సదస్సులో తెలంగాణ ప్రత్యేక ఆకర్షణగా నిలవడం రాష్ట్రం అనుసరిస్తున్న అభివృద్ధి మార్గంపై పెట్టుబడిదారుల విశ్వాసం మరింత బలపడుతున్నదనడానికి స్పష్టమైన సంకేతంగా నిలుస్తోంది. గ్రేటర్ హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన 2025 గ్లోబల్ సమ్మిట్, దావోస్‌లో జరిగిన 2026 వరల్డ్ ఎకనామిక్ ఫోరం.. ఈ రెండు వేదికలు తెలంగాణకు పెట్టుబడుల సోపానాలుగా మారాయి. భారతదేశ స్వాతంత్ర్యం శతాబ్ది దశకు చేరువవుతున్న నేపథ్యంలో, తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌ను ప్రకటించింది. ఈ లక్ష్యానికి అనుగుణంగా ఆర్థిక రంగాన్ని బలోపేతం చేయడమే ప్రధాన ఉద్దేశంగా పెట్టుకుంది. 2025 గ్లోబల్ సమ్మిట్‌లోనే రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు సాధించడం ఈ దిశలో కీలక ముందడుగు.

### మారనున్న రాష్ట్ర భవిష్యత్

2026 జనవరి 20 నుంచి 22 వరకు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధుల బృందం, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, డేటా సెంటర్లు, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ, తయారీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సస్టెయినబిలిటీ, స్కిల్లింగ్ వంటి ఆధునిక రంగాల్లో పలు అంతర్జాతీయ సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడం రాష్ట్ర భవిష్యత్ దిశను స్పష్టంగా చూపిస్తోంది.

### తెలంగాణకు భారీ పెట్టుబడులు..

దావోస్ వేదికపై తెలంగాణ ప్రభుత్వం సాధించిన పెట్టుబడి ప్రతిపాదనలు గణనీయమైనవే.. రూ.12,500 కోట్లతో రష్మి గ్రూప్ స్టీల్ ప్లాంట్, రూ.6,000 కోట్లతో న్యూక్లియర్ సంస్థ విద్యుత్ ప్లాంట్, రూ.3,500 కోట్లతో లోరియల్ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్, రూ.5,000 కోట్లతో యూపీసీ వోల్ట్ డేటా సెంటర్, రూ.1,000 కోట్లతో విమానాల మరమ్మతు యూనిట్, రూ.623 కోట్లతో స్నైడర్ సంస్థ విస్తరణ, రూ.150 కోట్లతో గోద్రేజ్ డెయిరీ ప్లాంట్ విస్తరణ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర పారిశ్రామిక భవిష్యత్తుకు కొత్త ఊపునిస్తున్నాయి. నెదర్లాండ్స్‌కు చెందిన యూపీసీ రెన్యూవబుల్స్ సంస్థ ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల సామర్థ్యంతో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది.




### వేల సంఖ్యలో ఉద్యోగాల కల్పన..

ఈ పెట్టుబడులతో పాటు ఉద్యోగావకాశాలు కూడా గణనీయంగా పెరగనున్నాయి. రష్మి స్టీల్ ప్లాంట్ ద్వారా సుమారు 12 వేల మందికి, యూపీసీ వోల్ట్ డేటా సెంటర్ ద్వారా 4 వేల మందికి, యూపీసీ రెన్యూవబుల్స్ ప్రాజెక్ట్ ద్వారా నిర్మాణ దశలోనే 3 వేల మందికి ఉపాధి లభించనుంది. లోరియల్ సంస్థ హైదరాబాద్‌ను తన గ్లోబల్ టెక్ హబ్‌గా ఎంపిక చేయడంతో 2 వేలకుపైగా టెక్, ఏఐ ఉద్యోగాలు సృష్టించబడే అవకాశముంది. ప్రతి ఏటా దావోస్ సదస్సు అనంతరం గ్రేటర్ హైదరాబాద్‌లో సమీక్షా సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి సూచించారు.. ఇది పెట్టుబడి ఒప్పందాల అమలును వేగవంతం చేసే అవకాశం కల్పిస్తుంది.

### ప్రపంచ యవనికపై రైజింగ్ స్టేట్


గ్రేటర్ హైదరాబాద్ ఇప్పటికే ఐటీ రాజధానిగా పేరు తెచ్చుకుంది. ప్రస్తుతం 1500కు పైగా ఐటీ కంపెనీలు, 10 లక్షలకుపైగా ఉద్యోగులు ఈ రంగంలో ఉన్నారు. ఫార్మా, వైద్య రంగాల్లోనూ హైదరాబాద్ ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందుతోంది. కాలుష్య నియంత్రణకు ప్రత్యేక చర్యలతో ఫ్యూచర్ సిటీలో పరిశోధన ఆధారిత పరిశ్రమలకే ప్రాధాన్యం ఇవ్వడం ప్రభుత్వ దూరదృష్టిని చాటుతోంది. దావోస్ వేదికగా కురిసిన పెట్టుబడుల వర్షం కార్యరూపం దాల్చితే తెలంగాణ ప్రపంచ యవనికపై రైజింగ్ స్టేట్ గా కనిపించడం ఖాయమనే ధీమా వ్యక్తమవుతోంది.

## 350 కి.మీ. వేగంతో దూసుకెళ్లనున్న బుల్లెట్ ట్రైన్లు..
# ఏపీ, తెలంగాణకు భారీ రైల్వే బడ్జెట్!



**న్యూఢిల్లీ,:** రైల్వే బడ్జెట్‌పై కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల రైల్వే అధికారులు, అన్ని రాష్ట్రాల మీడియాతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తాజా రైల్వే బడ్జెట్ కేటాయింపులు, హైస్పీడ్–బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులు, రాష్ట్రాల వారీగా అమలవుతున్న అభివృద్ధి పనులపై కీలక వివరాలు వెల్లడించారు. మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడుకు ఈసారి రూ.7,611 కోట్ల రైల్వే బడ్జెట్ కేటాయించారు. ఇది గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన బడ్జెట్‌తో పోలిస్తే దాదాపు 9 రెట్లు ఎక్కువ అని ఆయన స్పష్టం చేశారు. తమిళనాడుతో పాటు దక్షిణ భారతాన్ని కలుపుతూ చెన్నై – హైదరాబాద్, చెన్నై – బెంగళూరు, హైదరాబాద్ – బెంగళూరు మార్గాల్లో హైస్పీడ్ "డైమండ్ కారిడార్" ప్రాజెక్టు ప్రతిపాదనలో ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ కు ఈ బడ్జెట్‌లో రూ. 10,134 కోట్లు కేటాయించామని మంత్రి తెలిపారు. ఏపీలో మొత్తం రూ. 92,649 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని అన్నారు. చెన్నై – హైదరాబాద్ బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ ఏపీకి కూడా ఎంతో ఉపయోగపడుతుందని, రాష్ట్రం ఇప్పటికే 100% ఎలక్ట్రిఫైడ్ రైల్వే లైన్లు కలిగిన రాష్ట్రంగా నిలిచిందని గుర్తుచేశారు. అలాగే కలకత్తా – చెన్నై మధ్య నాలుగు రైల్వే లైన్లు ఏర్పాటు పూర్తయ్యాయని వెల్లడించారు. తెలంగాణకు ఈసారి రూ. 5,454 కోట్ల రైల్వే బడ్జెట్ కేటాయించామని, రాష్ట్రంలో మొత్తం రూ. 48 వేల కోట్లకు పైగా రైల్వే ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు, పుణె, చెన్నై మార్గాల్లో బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులు ప్రతిపాదనలో ఉన్నాయని చెప్పారు. అలాగే ముంబై – హైదరాబాద్ బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ తమకు అనేక విలువైన అనుభవాలను అందించిందని అన్నారు. కర్ణాటకకు రూ. 7,748 కోట్ల రైల్వే బడ్జెట్ కేటాయించామని, అక్కడ మొత్తం రూ. 52,950 కోట్ల విలువైన ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని వివరించారు. భవిష్యత్తులో బెంగళూరు నుంచి రెండు బుల్లెట్ ట్రైన్లు ప్రారంభమవుతాయని తెలిపారు. అలాగే అమరావతి కూడా బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులో ఒక కీలక భాగంగా ఉండనుందని స్పష్టం చేశారు. ఇంకా బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులపై కీలక ప్రకటనలు చేస్తూ.. రెండో దశలో దేశవ్యాప్తంగా 7 కొత్త బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులు చేపట్టనున్నట్లు అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ హైస్పీడ్ బుల్లెట్ ట్రైన్ల గరిష్ట వేగం 350 కి.మీ. ఉంటుందని తెలిపారు. ఇందుకు సంబంధించిన డీపీఆర్‌లు (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టులు) త్వరలో సిద్ధం చేస్తామని స్పష్టం చేశారు.

## ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల నేతలతో
# సజ్జల, బొత్స అత్యవసర భేటీ..




**అమరావతి,:** తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల వైసీపీ నేతలతో పార్టీ ముఖ్య నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, బొత్స సత్యనారాయణ అత్యవసరంగా భేటీ అయ్యారు.. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లాలకు చెందిన మాజీ మంత్రులు, జిల్లా అధ్యక్షులు, సమన్వయకర్తలు హాజరయ్యారు. ఈ భేటీలో ముఖ్యంగా రాష్ట్రంలో వైసీపీ నేతలపై జరుగుతున్న దాడులు, శాంతిభద్రతల పరిస్థితిపై విస్తృతంగా చర్చించారు. ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలపై పార్టీ ఎలా స్పందించాలనే అంశంపై నేతలతో సజ్జల, బొత్స అభిప్రాయాలు పంచుకున్నారు. అలాగే తిరుమల ప్రతిష్టను దిగజార్చే విధంగా జరుగుతున్న చర్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు వైసీపీ నేతలు... ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన అవసరం ఉందని, ప్రతిపక్ష నేతలపై జరుగుతున్న దాడులను అడ్డుకునేందుకు పార్టీ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై సమాలోచనలు జరిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ ఆగడాలను నిలువరించాల్సిన అవసరం ఉందని నేతలు ఏకగ్రీవంగా అభిప్రాయపడ్డారు. ప్రజల్లోకి బలంగా వెళ్లి వాస్తవాలను వివరించడంతో పాటు పార్టీ నేతలకు భద్రత కల్పించేలా పోరాటం కొనసాగించాలని నిర్ణయించారు. కాగా, మాజీ మంత్రి అంబటి రాంబాబు అరెస్ట్.. ఆ తర్వాత.. అంబటి, జోగి రమేష్ ఇళ్లపై దాడులు.. వారిపై కేసులు.. ఇలా రాష్ట్రంలో పొలిటికల్ హీట్ కొనసాగుతోన్న విషయం విదితమే..

# సజ్జనార్ జడ్జి కాదు, పోలీస్ అధికారి మాత్రమే..



హైదరాబాద్, : ఫోన్ ట్యాపింగ్ ఎక్కడ జరిగిందో వాస్తవాలు చెప్పడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ధారావాహిక సీరియల్ మాదిరి ఫోన్ ట్యాపింగ్ కేసు నడిపిస్తున్నారు.. ఫోన్ ట్యాపింగ్ జరగలేదని నిన్నటి విచారణలో కేసీఆర్ చెప్పారు.. హరీష్ రావుకు సుప్రీంకోర్టు క్లీన్ చిట్ ఇచ్చింది.. ఫోన్ ట్యాపింగ్ ఘట్టాన్ని ఇంతటితో ముగించాలని తెలిపారు. హైదరాబాద్ సీపీ సజ్జనార్ అయినా, ఇంకో అధికారి అయినా ఫోన్ ట్యాపింగ్ ఇల్లీగల్ అనుకుంటే కోర్టుకు వెళ్ళాలి కదా అని సూచించారు. సజ్జనార్ జడ్జీ కాదు , పోలీస్ అధికారి మాత్రమే అని ఆయన పేర్కొన్నారు. మరి ఈ మధ్య కాలంలో సజ్జనార్ జడ్జీ అయ్యాడేమో నాకు అయితే తెలియదని సెటైర్ వేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడికి పరిచయ కార్యక్రమం ఉంటే రాష్ట్రానికి రావొచ్చు అని కేటీఆర్ చెప్పుకొచ్చారు. అయితే, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఏ జిల్లా నాయకత్వం అక్కడ పని చేస్తుంది అని కేటీఆర్ అన్నారు. మేము ఎవరిని బ్లాక్ మెయిల్ చేశామో.. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చెప్పాలని డిమాండ్ చేశారు. బ్లాక్ మెయిల్ కు బ్రాండ్ అంబాసిడర్ రేవంత్ రెడ్డి అని ఆరోపించారు. ఇక, కేసీఆర్ ను సిట్ అధికారులు విచారణకు పిలిస్తే, 7 వేల పైచిలుకు గ్రామాల్లో సీఎం దిష్టి బొమ్మలు తగులబెట్టారని తెలిపారు. ఆనాటి ఉద్యమ స్ఫూర్తి మాకు గుర్తొచ్చింది.. మమ్మల్ని తట్టి లేపిన.. రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు.. ప్రభుత్వానికి పరిపాలన చేయడం రావడం లేదు.. మేడారం జాతరను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని జాతర నిర్వహిస్తారు.. ఈ ప్రభుత్వంలో ఈసారి మేడారం జాతర ఏర్పాటు చేయడంలో విఫల అయింది.. మంత్రి వాహనంపై దాడి చేశారని కేటీఆర్ విమర్శించారు.

# సీపీఆర్‌పై.. అవగాహన అవసరం!



నేటి సమాజంలో హార్ట్ అటాక్ అనేది వృద్ధులకు మాత్రమే పరిమితమైన సమస్య కాదు. యువత, మధ్య వయసువారు, పిల్లలు కూడా అకస్మాత్తుగా గుండెపోటుకు గురవుతున్న ఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయి.. ఇది కేవలం వైద్య సమస్య కాదు. ఇది ఒక సామాజిక అత్యవసర సమస్యగా మారింది. వైద్య నిపుణులు చెప్పే దాని ప్రకారం హార్ట్ అటాక్ వచ్చిన వెంటనే సరైన సమయంలో సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెసస్కిటేషన్) చేయగలిగితే ప్రాణాలు కాపాడే అవకాశాలు చాలా ఎక్కువ..

### ఇంత బాధ్యతా రాహిత్యమా?

సీపీఆర్ అనేది గుండెపోటు లేదా శ్వాస ఆగిపోయిన అత్య వసర స్థితిలో ప్రాణాలను రక్షించే ప్రాథమిక వైద్య ప్రక్రియ కానీ దురదృష్టవశాత్తు, మన సమాజంలో సీపీఆర్‌పై అవగాహన చాలా తక్కువగా ఉంది. ఎవరైనా కుప్పకూలినప్పుడు ప్రజలు సహాయం చేయకుండా భయంతో, అయోమయంలో నిలబడిపోతున్నారు. కొందరు వీడియోలు తీయడంలో నిమగ్నమవు తున్నారు. మరికొందరు 'ఏం చేయాలో తెలియదు' అంటూ విలువైన నిమిషాలను వృథా చేస్తున్నారు.. ఈ నిర్లక్ష్యమే అనేక ప్రాణ నష్టాలకు కారణమవుతోంది.

### గోల్డెన్ అవర్.. ప్రాణరక్షణ సమయం..

హార్ట్ అటాక్ తర్వాత మొదటి ఒక గంటను వైద్యులు "గోల్డెన్ అవర్"గా పేర్కొంటారు. ఈ కీలక సమయంలో సీపీఆర్ ప్రారంభమైతే, వెంటనే హాస్పిటల్‌కు తరలిస్తే, బాధితుడు మళ్లీ సాధా రణ జీవితానికి చేరుకునే అవకాశముంది. కానీ అవగాహన లేనందున ఆ గోల్డెన్ అవర్ మన చేతుల మధ్యనే జారిపోతోంది. సీపీఆర్ అవసరం కేవలం హార్ట్ అటాక్‌లకే పరిమితం కాదు.. వైద్య నిపుణుల ప్రకారం, కరెంట్ షాక్ తగిలి వ్యక్తి స్పృహ కోల్పోయి శ్వాస ఆగిపోయిన పరిస్థితిలో, పరిసరాలు సురక్షితంగా ఉన్నట్లయితే సీపీఆర్ చేయవచ్చు.. అయితే ముందుగా విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేయడం అత్యంత ముఖ్యం.

### సీపీఆర్ ఎలా చేయాలి..

ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన ముఖ్యమైన స్టెప్స్. ఎవరైనా అకస్మాత్తుగా కుప్పకూలితే ఈ విధంగా చేయాలి. స్పందన ఉందా లేదా చూడాలి. వ్యక్తిని పిలిచి, భుజాన్ని మెల్లగా కదిలించి స్పందిస్తున్నాడా చూడాలి. శ్వాస ఉందా లేదా పరిశీలించాలి. ఛాతీ కదులుతోందా శ్వాస వస్తోందా..? లేకపోతే వెంటనే చర్య తీసుకోవాలి. వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేయాలి.. ఇది అత్యంత కీలకమైన దశ. ఛాతిపై ఒత్తిడి ఇవ్వాలి. బాధితుడిని సమానంగా ఉన్న నేలపై పడుకోబెట్టాలి. ఛాతి మధ్యభాగంపై రెండు చేతులు ఉంచి నిమిషానికి సుమారు 100–120 సార్లు 5–6 సెం.మీ లోతుగా ఒత్తిడి ఇస్తూ ఆపకుండా కొనసాగించాలి. శ్వాస ఇచ్చే పద్ధతి తెలిసి ఉంటే మాత్రమే ఇవ్వాలి.. తెలియని వారు కేవలం ఛాతి ఒత్తిడినే కొనసాగించినా సరిపోతుంది.

### అవగాహన ఉద్యమంగా మారాలి!

ఇక్కడ ప్రభుత్వ వ్యవస్థ బాధ్యత మరింత అవసరం. పోలీస్ శాఖ, ఆరోగ్య శాఖ కలిసి సీపీఆర్‌పై విస్తృత అవగాహన కార్య క్రమాలు చేపట్టాలి.. పాఠశాలలు, కళాశాలలు, గ్రామ సభలు, బస్టాండ్‌లు, కార్యాలయాలు వంటి ప్రజలు ఎక్కువగా చేరే ప్రాంతాల్లో ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వాలి. సీపీఆర్ అనేది డాక్టర్లకే కాదు, ప్రతి సాధారణ పౌరుడికీ తెలిసి ఉండాల్సిన మౌలిక జీవన నైపుణ్యంగా మారాలి. ఇది ఖర్చుతో కూడిన కార్యక్రమం కాదు. కానీ దీని వల్ల లభించే ఫలితం అమూల్యమైనది ఒక మనిషి ప్రాణం. ప్రభుత్వం మాత్రమే కాదు.. మీడియా, స్వచ్ఛంద సంస్థలు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు అందరూ కలిసి సీపీఆర్ అవగాహనను ఉద్యమంలా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. సీపీఆర్ ఒక జీవన రక్షణ విద్య. ఇప్పుడు నేర్చుకోకపోతే తర్వాత పశ్చాత్తాపమే మిగులుతుంది.

# కోచింగ్ భ్రమలో నిరుద్యోగ యువత.. వారి భవిష్యత్తును మింగేస్తున్న కోచింగ్ సంస్కృతి!

ప్రభుత్వ ఉద్యోగం అంటే ఒక వ్యక్తికి మాత్రమే కాదు.. ఒక కుటుంబానికి భరోసా, ఒక తరం భవిష్యత్తుకు ఆశ. ఆ ఒక్క నోటిఫికేషన్ కోసం ఏళ్ల తరబడి ఎదురుచూసే నిరుద్యోగ యువత మన సమాజంలో కోట్లల్లో ఉన్నారు. కానీ వారిలో ఆ ఆశతో పాటు నేడు మరో భయమూ వెంటాడుతోంది.. అది 'కోచింగ్ లేకపోతే ఉద్యోగం రాదు' అన్న భ్రమ. ఈ భ్రమే ఇప్పుడు కోట్ల రూపాయల వ్యాపారంగా మారింది. ఈ దందా ప్రభావం ఒక్కో అభ్యర్థి జీవితానికే పరిమితం కాదు.. రేపటి పాలన, పరిపాలన, విధానాల దిశపైనా దీని నీడ పడుతోంది.. యువత అసురక్షిత భావాలను పెట్టుబడిగా, తల్లిదండ్రుల కన్నీళ్లను లాభంగా మార్చుకుంటూ 'కోచింగ్ వ్యాపారం' నిశ్శబ్దంగా విస్తరిస్తోంది. ఇది విద్యా విస్తరణ కాదు.. ఇది నిరుద్యోగంపై నిర్మితమైన ఒక వ్యవస్థీకృత దందా. ప్రభుత్వాలు కోచింగ్ రంగాన్ని 'మార్కెట్ సమస్య'గా కాకుండా విద్యా విధాన సమస్యగా చూడాలి.. ఉద్యోగ ఆశలో పుట్టే కలలు కన్నీళ్లుగా మారకుండా ఉండాలంటే నిరుద్యోగులు, తల్లిదండ్రులు, సమాజం, ప్రభుత్వం అందరూ బాధ్యతగా ఆలోచించాల్సిన క్షణం ఇదే..

### ఉద్యోగ ఆశలో కలలు, కన్నీళ్లు..

ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వార్త వినగానే నిరుద్యోగుల్లో ఆశ చిగురిస్తుంది. కానీ ఎన్నాళ్లుగా ఎదురుచూస్తున్న అవకాశం దొరుకుతుందన్న భావన, జీవితానికి దిశ లభిస్తుందన్న ఆశ వారి కళ్లలో మెరుస్తుంది. కానీ ఆ ఆశ త్వరలోనే భయంగా మారుతోంది. స్వయంగా చదివితే విజయం సాధించలేమన్న భావన పెరిగి, తమ ఆలోచనా శక్తిని, సృజనాత్మకతను మరిచిపోయేలా చేస్తోంది. చివరికి కోచింగ్‌పైనే ఆధారపడాల్సిందేనన్న భ్రమ నెలకొంటోంది. ఈ బలహీనతను అవకాశంగా చేసుకుని ప్రైవేట్ కోచింగ్ సెంటర్లు విస్తరిస్తూ, 'మా దగ్గర చదివితేనే ఉద్యోగం' అన్న నమ్మకాన్ని యువతలో నాటుతున్నాయి. దీనివల్ల అత్యంత నష్టపోతున్నవారు నిరుపేద అభ్యర్థులు, వారి కుటుంబాలే.. వారే అప్పులు చేసి పట్టణాలకు వెళ్లి ఖరీదైన కోచింగ్ ఫీజులు, జీవన ఖర్చులు భరిస్తూ తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు.

### మోసం మొదలవుతోందిక్కడే..

ప్రభుత్వ ఉద్యోగాల సాధన కోచింగ్ సెంటర్ల చేతుల్లో ఉండేది కాదు, అది అభ్యర్థి ఆలోచనా శక్తి, క్రమశిక్షణ, నిరంతర సాధనంపై ఆధారపడుతుంది. ఉద్యోగ నోటిఫికేషన్లకు ముందే మొదలయ్యే కోచింగ్ హడావుడి, అవి వెలువడగానే మరింత విస్తరిస్తోంది. ఇది



విద్యా విస్తరణ కాదు.. నిరుద్యోగుల అమాయకత్వాన్ని సొమ్ముగా మలిచే వ్యవస్థీకృత వ్యాపారం.. కోట్ల టర్నోవర్‌తో నిర్వాహకులు ఆకర్షణీయమైన ప్రకటనలతో వేలల్లో ఫీజులు వసూలు చేస్తూ కాలయాపన చేస్తున్నారు. ఇంకొందరేమో పాత, పనికిరాని మెటీరియల్‌ను కొత్త పేర్లతో 'ఇంపార్టెంట్ మెటీరియల్'గా విక్రయిస్తున్నారు. దీంతో ఏది నాణ్యమైనదో తెలియని అభ్యర్థులు గుడ్డిగా నమ్ముతున్నారు. కొద్దిమంది ప్రతిభతో సాధించిన విజయాలను తమ కోచింగ్ ఘనతగా ప్రచారం చేసుకుంటున్నారు. ఇందులో లాభపడేది కోచింగ్ సెంటర్లే.. అభ్యర్థులకు, ముఖ్యంగా నిరుపేద యువతకు దక్కేది శూన్యమే.

### నిపుణుల వేషంలో 'అనర్హుల' రాజ్యం..!

అయితే, బోధకుల పాత్రను పూర్తిగా తిరస్కరించాల్సిన అవసరం లేదు.. కానీ దానికి స్పష్టమైన పరిమితులు, బాధ్యతలు ఉండాలి. మంచి బోధకుడు భయాన్ని పెంచడు, ఆ దిశను చూపుతాడు.. నోట్స్‌పై ఆధారపడేలా కాకుండా విద్యార్థిని స్వతంత్రంగా ఆలోచించే వ్యక్తిగా తీర్చిదిద్దుతాడు. కానీ నేడు అనేక కోచింగ్ సెంటర్లలో బోధకులుగా ఉన్న వారికి ప్రభుత్వ ఉద్యోగ ఎంపికల అనుభవం, విషయంపై లోతైన అవగాహన లేకపోయినా 'ఏళ్ల అనుభవజ్ఞులు', 'నిష్ణాతులు' అంటూ మోసపూరిత ప్రచారంతో నమ్మకం కల్పిస్తున్నారు. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ వంటి విస్తారమైన అవగాహన రంగాలను నోట్స్‌గా కుదించి, 'ఇవే వస్తాయి' అనే భ్రమను నాటడం వల్ల అభ్యర్థి ఆలోచనశక్తి క్షీణిస్తోంది. వాస్తవానికి వీటికి హద్దులుండవు, పూర్తిగా కవర్ చేయడం అసాధ్యం.

### ప్రభుత్వ చర్యలు అత్యవసరం..

ఇక ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియ సైతం వివిధ కారణాలతో పదే పదే వాయిదా పడుతున్నాయి. ఈ జాప్యంలో అభ్యర్థుల నష్టం అపారం. కొందరి వయోపరిమితి దాటిపోతుండగా, మరికొందరు నిరాశలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.. ఈ ఆలస్యంతో లాభపడుతున్న కోచింగ్ సెంటర్ల మోసాల వ్యాపారంపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలి. ప్రైవేట్ కోచింగ్ సెంటర్లపై బోధకుల అర్హతలు, ఫీజుల పరిమితులు, మోసపూరిత ప్రచారాల నిషేధంతో స్పష్టమైన విధానాలు రూపొందించి కఠినంగా అమలు చేయాలి.. ఇందుకోసం 'రాష్ట్రస్థాయి కోచింగ్ నియంత్రణ అథారిటీ'ని ఏర్పాటు చేయాలి. అదే విధంగా ఉద్యోగ నోటిఫికేషన్లను సమయానికి విడుదల చేయడం, పారదర్శక నియామక ప్రక్రియను అమలు చేయడం అనివార్యం. లేకపోతే కోచింగ్ దందా యువత ఆశలపై మరింత బల పడుతూ, వ్యక్తిగత నష్టమే కాక తెలంగాణ సమాజ భవి ష్యత్తుకే గాయంగా మారుతుంది.

# నల్లమల అడవిలో దాహార్తి

నల్లమల అడవులు.. దక్షిణ భారతదేశానికి ఊపిరితిత్తు ల్లాంటివి. జీవ వైవిధ్యానికి నిలయంగా, అరుదైన వృక్షజాలం, జంతుజాలానికి ఆశ్రయంగా నిలిచిన ఈ అరణ్యం నేడు తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో అడవిలోని సహజ నీటి వనరులు పూర్తిగా ఎండిపోయాయి. ఫలితంగా అక్కడ నివసిస్తున్న అడవి జంతువులు తాగునీరు లేక తీవ్రంగా అలమటిస్తున్నాయి. ఇది కేవలం ప్రకృతి విపత్తు మాత్రమే కాదు.. పాలనా వైఫల్యానికి స్పష్టమైన ప్రతిబింబం కూడా.. నల్లమల అడవులు మనవి కావు... మనం నల్లమల అడవుల వాళ్లం. అక్కడి జంతువుల దాహం తీర్చడం అంటే ప్రకృతితో మన బాధ్యతను నెరవేర్చడమే. ప్రభుత్వం తక్షణమే సమగ్ర కార్యాచరణ ప్రకటించి అమలు చేయాలి. లేదంటే, మౌనంగా చూస్తూ ఉండే ఈ పాలనపై ప్రజల ప్రశ్నలు మరింత ఘాటుగా మారడం ఖాయం.

### జంతువులు గ్రామాల్లోకి వస్తే...

నల్లమల ప్రాంతంలో సాధారణంగా చెరువులు, వాగులు, గుంతలు వంటి సహజ నీటి వనరులు వేసవి కాలంలోనూ కొంతవరకు జంతువులకు ఉపశమనంగా ఉండేవి. కానీ ఈ ఏడాది వర్షాలు పెద్దగా పడకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. అడవిలోని జంతువులు దాహార్తితో అడవుల నుంచి బయటకు రావడం, గ్రామాల సమీపానికి చేరడం, ప్రమాదాలకు గురవడం వంటి సంఘటనలు పెరుగుతున్నాయి. ఇది జంతువులకు మాత్రమే కాదు, మనుషులకు కూడా ప్రమాదకరమైన పరిణామమే.

### అక్కడక్కడా నీటి తొట్టెలు..

ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. అటవీ శాఖ, పర్యావరణ శాఖ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి. కానీ వాస్తవంలో చూస్తే.. పరిస్థితిపై ప్రభుత్వ స్పందన చాలా మందగించింది.

కొద్ది ప్రాంతాల్లో తాత్కాలికంగా నీటి తొట్లలు ఏర్పాటు చేసినా, అవి సరిపోవడం లేదు. విస్తా రమైన నల్లమల అడవులకు ఇవి చుక్కల్లో మునకలే.



### జంతువులకు తాగునీరు దయాదాక్షిణ్యమా?

అడవి జంతువులకు తాగునీరు అందించడం ప్రభుత్వానికి దయాదాక్షిణ్యం కాదు.. అది రాజ్యాంగ బాధ్యత. పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ అనేవి కేవలం ప్రకటనలకే పరి మితం కావద్దు. ఎండాకాలం ప్రారంభమయ్యే ముందే అడవుల్లో నీటి లభ్యతపై ప్రణాళిక ఉండాలి. బోరు బావుల ద్వారా సోలార్ మోటార్లతో నీటిని తొట్లకు పంపించడం, పాత చెరువులు, వాగులను పునరుద్ధరించడం, వర్షపు నీటి నిల్వకు శాశ్వత ఏర్పాట్లు చేయడం వంటి చర్యలు ఇప్పటికైనా చేపట్టాల్సిందే.

### అడవులు అంతరిస్తే కలిగే నష్టం..

అటవీ ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా నీటి వనరుల స్థితిని పర్య వేక్షించడం, అత్యవసర పరిస్థితుల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడం కూడా సాధ్యమే. ఇవన్నీ ఖర్చుతో కూడుకున్న పనులుగా ప్రభుత్వం భావిస్తే.. అడవులు నశించిన తర్వాత చెల్లించాల్సిన మూల్యం మరింత ఎక్కువగా ఉంటుందని గుర్తించాలి. అధికారులు కూడా ఫైళ్లకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితిని అంచనా వేయాలి. 'వర్షాలు వస్తే చూసుకుందాం' అనే నిర్లక్ష్య ధోరణి వదిలేయాలి. ప్రకృతి మన హెచ్చరికలు ఇవ్వడం మొదలు పెట్టింది. ఇప్పటికైనా మేల్కొనకపోతే, రేపు ఎదురయ్యే పర్యావరణ విపత్తులకు మనమే బాధ్యులం.

### అడవులు మనవి కావు..

నల్లమల అడవులు మనవి కావు... మనం నల్లమల అడవుల వాళ్లం. అక్కడి జంతువుల దాహం తీర్చడం అంటే ప్రకృతితో మన బాధ్యతను నెరవేర్చడమే.. ప్రభుత్వం తక్షణమే సమగ్ర కార్యాచరణ ప్రకటించి అమలు చేయాలి. లేదంటే, మౌనంగా చూస్తూ ఉండే ఈ పాలనపై ప్రజల ప్రశ్నలు మరింత ఘాటుగా మారడం ఖాయం.

# మహాశివరాత్రి పర్వదిన వేడుకలను సమన్వయంతో విజయవంతం చేయాలి




## ఆధ్యాత్మిక ఆంధ్రప్రదేశ్‌కు శ్రీకారం

## భక్తులకు సౌకర్యవంతమైన, సంతృప్తికరమైన దర్శనం కల్పించాలి

## అధికారులను ఆదేశించిన మంత్రుల బృందం

నంద్యాల జిల్లా బ్యూరో (శ్రీశైలం) / ఫిబ్రవరి 02 : శ్రీశైల మహా పుణ్యక్షేత్రంలో నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను భక్తుల మనోభావాలకు అనుగుణంగా, భక్తి పారవశ్యంతో సజావుగా నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా చేపట్టాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. శ్రీశైలంలోని సదాశివయ్య భవన్‌లో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, రోడ్లు & భవనాలు, మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడుల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, ఎక్స్-అఫిషియో ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్ లాల్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి కలిసి సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు, ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, శ్రీశైలం, ఆత్మకూరు డీఎఫ్‌వోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ట్రస్ట్ బోర్డు సభ్యులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ, మహాశివరాత్రి పర్వదిన వేడుకల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వహణ, దర్శన ఏర్పాట్లు, వసతి, భద్రత, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు. గత సంవత్సరం ఎదురైన లోపాలను సవరించడంతో పాటు, సంభవించే సమస్యలను ముందుగానే అంచనా వేసి పరిష్కార మార్గాలు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ఎస్ఓపీని ఆధారంగా చేసుకొని అన్ని ఉత్సవాలు, ధార్మిక కార్యక్రమాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేయాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. ఆధ్యాత్మిక ఆంధ్రప్రదేశ్‌కు శ్రీకారం చుట్టేందుకు ప్రభుత్వం అన్ని ఆలయాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. భక్తులకు సజావుగా, సంతృప్తికరంగా దైవ దర్శనం కల్పించినప్పుడే ప్రభుత్వ చర్యలు విజయవంతమైనట్లవుతాయని స్పష్టం చేశారు. వీఐపీ, వీవీఐపీ దర్శనాలకు ప్రత్యేక స్లాట్లు కేటాయించి, నిర్ణయించిన సమయంలోనే దర్శనం జరిగేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అటవీ సంరక్షణ పరిధిలో ఉన్న ఆలయ ప్రాంతంలో విస్తరణ సాధ్యం కాకపోయినా, భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అడవి మార్గంలో 48 కిలోమీటర్లు నడక దారిలో వచ్చే శివ భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా అటవీ శాఖ అధికారులు పూర్తి సహకారం అందించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి సమస్యలను అధిగమించాలని మంత్రి ఆదేశించారు. గత ఏడాది తరహాలోనే ఈ సంవత్సరం కూడా భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 14, 15 తేదీలలో రెండు రోజుల పాటు టోల్ గేట్ల వద్ద వాహనాలకు ఉచిత అనుమతి ఇవ్వాలని సూచించారు. రాత్రి వేళల్లో ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించాలని ఆదేశించారు. సాక్షి గణపతి వద్ద రహదారి విస్తరణకు అవసరమైన స్థలాన్ని అటవీ శాఖ అందించినందున, సంబంధిత అధికారులు తక్షణమే రహదారి పనులు చేపట్టాలని సూచించారు. శ్రీశైలానికి వచ్చి వెళ్లే ప్రతి భక్తుడు సంతృప్తికరంగా దర్శనం చేసుకున్నామన్న భావనతో తిరిగి వెళ్లేలా అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.



హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలానికి భారీగా తరలివచ్చే భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర సేవల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించే వారికి ముందుగా రిజిస్ట్రేషన్ చేయించి, తగిన స్థలాలను కేటాయించాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. ఉత్సవాల సమయంలో సున్నా ఘటనలు (వతీశీ ×అఎఱఎవత్ం) జరిగేలా అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీసు అధికారులకు మంత్రి ఆదేశించారు.

రోడ్లు & భవనాలు, మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడుల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలానికి తరలివచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక వసతులను సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఆత్మకూరు నుంచి దోర్నాల వరకు ఉన్న ప్రధాన రహదారుల మరమ్మతులు, విస్తరణ, గుంతల పూడిక, రహదారి భద్రతా చర్యలతో కూడిన పనులను ఈ నెల 8వ తేదీలోగా పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ఉత్సవాల సమయంలో వాహనాల రద్దీ అధికంగా ఉండే నేపథ్యంలో రహదారులు సక్రమంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఎక్కడా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టాలని సూచించారు. భక్తుల సౌకర్యమే లక్ష్యంగా అధికారులు సమిష్టిగా పనిచేసి, ఏ చిన్న లోపం కూడా తలెత్తకుండా సమన్వయంతో వ్యవహరించాలని తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా, ఘనంగా, విజయవంతంగా జరిగేలా ప్రతి శాఖ బాధ్యతతో పని చేయాలని మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి అన్నారు.

ఎక్స్-అఫిషియో ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్ లాల్, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ లు మాట్లాడుతూ ఈ సారి గతం కంటే 30 శాతం అధిక మంది భక్తులు వస్తున్న నేపథ్యంలో అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, ఫిబ్రవరి 8 నుంచి మార్చి 18 వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఖచ్చితమైన ప్రణాళికలతో విధులు నిర్వహించేలా గత సమావేశంలో అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. దేవస్థానం సిబ్బంది, పోలీస్, జిల్లా అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సౌకర్యవంతమైన, సంతృప్తికరమైన దర్శనం కల్పించేలా అన్ని ఏర్పాట్లు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు, శ్రీశైలంలో భక్తుల కోసం చేపట్టిన ఏర్పాట్లను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాధికారులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

## నంద్యాల అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి కార్యకర్తలు పునరంకితం కావాలి... రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్



నంద్యాల / ఫిబ్రవరి 02 : తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే పార్టీకి అసలైన బలం మరియు ప్రాణవాయువు అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. సోమవారం నాడు నంద్యాల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు వెన్నంటే ఉండి నడిపించిన కార్యకర్తలకు ఎల్లప్పుడూ సముచిత స్థానం ఉంటుందని, వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. నంద్యాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని, ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

## శ్రీశైలంలో స్వామివారిని దర్శించుకున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



నంద్యాల జిల్లా ప్రతినిధి / ఫిబ్రవరి 02 : శ్రీశైలంలో శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారిని దర్శించుకున్న ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి నేటి ఉదయం శ్రీశైలం విచ్చేసిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి స్వాగతం పలికిన ఆలయ ఈవో ఏం. శ్రీనివాసరావు, చైర్మెన్ పోతుగుంట రమేష్ నాయుడు అనంతరం వేద పండితుల నుంచి వేదాశీర్వచనం అందుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించిన మంత్రి. రాష్ట్ర ప్రజలందరికీ శ్రీశైలం మల్లన్న ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించిన మంత్రి బ్రహ్మోత్సవాల కోసం జరుగుతున్న ఏర్పాట్లపై ఆరా తీసిన మంత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచన.



## విలువైన స్థలాన్ని కాపాడి స్కూల్ను నిర్మిస్తున్న అబ్దుల్ అజీజ్ ను అభినందిస్తున్నా

**ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణంలో అజీజ్ కు నా తోడ్పాటు ఉంటుంది.**

**వక్ఫ్ భూములను ఎలా వినియోగించాలో ఆలోచించండి ప్రభుత్వం మీ వెంట ఉంటుంది.**

**- జిల్లా ఇన్చార్జి మంత్రి ఎన్ఎండి ఫరూక్.**



ఫిబ్రవరి 02 : నెల్లూరు నగరంలోని పరమేశ్వరి నగర్ లో గల వక్షభూమి నందు నిర్మిస్తున్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణ పనులను జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్, శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర, శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఏపీ ఇన్లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ జెడ్ శివ ప్రసాద్ లు పరిశీలించి మీడియా సమావేశం నిర్వహించారు.



మంత్రి ఫరూక్ కామెంట్స్:-

విలువైన స్థలాన్ని కాపాడి ఇక్కడ ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మిస్తున్న అబ్దుల్ అజీజ్ ను అభినందిస్తున్న. కసుమూరు దర్గా కు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించడం మంచి విషయం. దర్గా నుంచి వచ్చే ఆదాయం ప్రజలకు ఉపయోగపడాలి. స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాల ద్వారా మహిళా సాధికారత పెంచేందుకు అబ్దుల్ అజీజ్ కృషి చేస్తున్నారు. చంద్రబాబు హయాంలో ఎన్నో డిజిటల్ స్కిల్ కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఇప్పటికే దాదాపు 30 వేల ఎకరాలు అన్యక్రాంతం అయ్యాయి మిగతా భూములను ఇలానే కాపాడండి. ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణంలో అబ్దుల్ అజీజ్ కు నా తోడ్పాటు ఉంటుంది. స్కూలుకు ఇచ్చిన భూమి మినహా మిగతా భూమిని కమర్షియలైజ్ చేయాలని అబ్దుల్లా తీసుకు సూచిస్తున్న. వక్ఫ్ బోర్డు భూములను ఎలా వినియోగించాలో ఆలోచించండి ప్రభుత్వం మీ వెంట ఉంటుంది.

## సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా




నంద్యాల / ఫిబ్రవరి 02 : కూటమి ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యం ను పూర్తిగా విస్మరిస్తుందని,3600 కోట్లకు పైగా పెండింగ్ లో ఉన్న ఎన్టీఆర్ వైద్య ఆరోగ్యశ్రీ నిధులను విడుదల చేయాలని, ఈ సంవత్సరం ప్రవేశపెట్టే బడ్జెట్లో నిధులు పెంచాలని, ప్రజల ప్రాణాల పట్ల నిర్లక్ష్యం వీడి ఆరోగ్యం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, అన్ని రకాల వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించిన అనంతరం డి.ఆర్.ఓ. రాము నాయక్ కి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఇవ్వడం జరిగింది.

## రెవెన్యూ క్లినిక్స్ ద్వారా 272 అర్జీలు స్వీకరణ

**- జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్**



నంద్యాల జిల్లా ప్రతినిధి / ఫిబ్రవరి 02 : భూసమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్స్ ఏర్పాటు చేయడం జరిగిందని వాటి ద్వారా 272 అర్జీలు స్వీకరించడం జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణంలో నిర్వహించిన రెవెన్యూ క్లినిక్స్ ద్వారా భూసమస్యలకు సంబంధించిన దరఖాస్తులను ప్రజల నుండి స్వీకరించారన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ మాట్లాడుతూ భూ సమస్యల శాశ్వత పరిష్కారం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ క్లినిక్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీటి ద్వారా భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా మొత్తం 272 అర్జీలు స్వీకరించగా, అందులో రెవెన్యూ, గ్రామ, వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి-6, అడంగల్ సవరణలకు సంబంధించినవి-72, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఎ భూములకు సంబంధించినవి-35, అసైన్డ్ భూములు, భూఆక్రమణలకు సంబంధించినవి-47, రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్ఓఆర్‌కు సంబంధించినవి-28, సర్వే, రీ-సర్వేకు సంబంధించినవి-64, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించినవి-20 దరఖాస్తులు వచ్చాయన్నారు. స్వీకరించిన అన్ని సమస్యలను ప్రత్యేక శ్రద్ధతో త్వరితగతిన పరిష్కరిస్తామని డిఆర్ఓ తెలిపారు.



## మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలిసిన బిజెపి జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు



నంద్యాల / ఫిబ్రవరి 02 : నంద్యాలలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో సోమవారం నాడు రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ని, నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ కి అభిరుచి మధు శాలువా పూలదండ వేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాకు సంబంధించిన పలు కీలక రాజకీయ అంశాలు మరియు తాజా పరిణామాలపై వారు చర్చించుకున్నారు. మిత్రపక్షాల సమన్వయంతో జిల్లా అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి కూడా ఈ సమావేశంలో ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆళ్లగడ్డ ఎమ్మెల్యే కు ఏవీ సుబ్బారెడ్డి హెచ్చరిక



నంద్యాల జిల్లా ప్రతినిధి / ఫిబ్రవరి 02 : నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో సోమవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఏవీ సుబ్బారెడ్డి కాంప్లెక్స్‌కు సంబంధించిన గోడను ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అధికారులు జేసీబీలతో కూల్చివేయడంతో వివాదం మొదలైంది. విషయం తెలుసుకున్న ఏవీ సుబ్బారెడ్డి కాంప్లెక్స్ వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఏవీ సుబ్బారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటీసులు ఇవ్వకుండా గోడను ఎలా కూల్చారని అధికారులను ప్రశ్నించారు. ఇది పూర్తిగా అధికార దుర్వినియోగమని, రాజకీయ ఒత్తిళ్లతోనే ఈ చర్యలు చేపట్టారని ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి చర్యలకు తావులేదన్నారు. టీడీపీ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన ఏవీ సుబ్బారెడ్డి, పార్టీ పెద్దలతో మాట్లాడి ఆమె చిట్టాను బయట పెడతానని హెచ్చరించారు. రేపటి నుంచి ఏవీ సుబ్బారెడ్డి అంటే ఏమిటో చూపిస్తానంటూ అఖిలప్రియకు కఠిన వార్నింగ్ ఇచ్చారు. ఈ ఘటనతో ఆళ్లగడ్డలో ఉద్రిక్త పరిస్థితి నెలకొనగా, పోలీసులు భారీగా మోహరించి భద్రత కట్టుదిట్టం చేశారు.

## శ్రీశైలం శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భద్రతా ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ స్వయంగా పరిశీలన



నంద్యాల జిల్లా బ్యూరో / ఫిబ్రవరి 02 : నంద్యాల జిల్లాలోని మహా పుణ్యక్షేత్రమైన శ్రీశైలం నందు నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని, దేశం నలుమూలల నుంచి తరలివచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, అధికారులను ఆదేశించారు. సోమవారం శ్రీశైలం క్షేత్రంలో ముఖ్యమైన ప్రాంతాలైన పాతాళగంగ, రోప్‌వే, పార్కింగ్ ప్రదేశాలు, కోనేరు, స్నాన ఘట్టాలు, ఆలయ పరిసర ప్రాంతాలు తదితర ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. భక్తుల రాకపోకలు సజావుగా సాగేలా తీసుకోవాల్సిన చర్యలు, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర సేవల అందుబాటు వంటి అంశాలపై సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఉత్సవాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శాంతిభద్రతలను కట్టుదిట్టంగా నిర్వహించాలని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా భక్తుల భద్రతే ప్రథమ లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, ప్రతి చిన్న అంశంపై కూడా అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ మరియు ఎస్పీ పేర్కొన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా, విజయవంతంగా నిర్వహించే దిశగా జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా వారు తెలిపారు.

## అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన క్రీడ రెజ్లింగ్

### రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిస్తే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి

### విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో నైపుణ్యం సాధించాలి



నంద్యాల / ఫిబ్రవరి 02 : అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన క్రీడ రెజ్లింగ్,రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిస్తే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని నంద్యాల జిల్లా స్థాయి రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు సూర్యదేవర సుధాకర్ పేర్కొన్నారు. నంద్యాల క్రాంతి నగర్ శ్రీ శాంతినికేతన్ సి. బి. ఎస్. ఈ. విద్యా సంస్థలకు చెందిన క్రీడా మైదానం లో జిల్లాస్థాయి ఖ-15,ఖ-17,ఖ-20 రెజ్లింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా నంద్యాల జిల్లాస్థాయి రెజ్లింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సూర్యదేవర సుధాకర్ , జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ సెక్రటరీ రాబర్ట్ పాల్గొన్నారు. ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 60 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్ర మంలో జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సూర్యదేవర సుధాకర్ మాట్లాడుతూ రెజ్లింగ్ పోటీలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందినవని, వీటిలో నైపుణ్యం కనబరిచి విజేతలైన విద్యార్థులకు స్పోర్ట్స్ కోటానందు అటు విద్యలోనూ ,ఇటు ఉద్యోగ రంగంలోనూ భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉంటాయన్నారు. కాబట్టి ఈ పోటీలలో పాల్గొనేటువంటి విద్యార్థులు చక్కగా రాణించి అటు నంద్యాల జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ కు , నంద్యాల ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ పోటీల్లో విజేతలు అయిన విద్యార్థులు ఈనెల 6,7,8 తేదీలలో చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలియజేశారు.



## నూతనంగా సిసి కెమెరాలు ఏర్పాటు చేపించిన 38వ వార్డు ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు



నంద్యాల / ఫిబ్రవరి 02 : నంద్యాల టౌన్ 38వ వార్డు వై.యస్.ఆర్ నగర్ బుడగజంగం కాలనీ నందు మరియు ఎస్పి వై రెడ్డి స్మార్ట్ సిటీ కాలనీ నందు శాంతి భద్రతల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మంత్రి వర్యులు ఎన్ఎండి. ఫరూక్ ఆదేశాల మేరకు వారి కుమారులు ఎన్ఎండి. ఫిరోజ్, ఎన్ఎండి. ఫయాజ్ ఆదేశాల మేరకు తాలూకా సిఐ ఈశ్వరయ్య పర్యవేక్షణలో వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు తన సొంత నిధులతో దాదాపుగా నాలుగు సిసి కెమెరాలు ఏర్పాటు చేపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్మార్ట్ సిటీ కాలనీ వాసులు మధుసుధన్ రెడ్డి, నారాయణ రెడ్డి, లింగమయ్య తదితరలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జాతీయస్థాయి దివ్యాంగ క్రీడా పోటీలకు ఎంపికైన నంద్యాల జిల్లా క్రీడాకారులు

### నెల్లూరులో రాష్ట్ర స్థాయి పారా స్పోర్ట్స్ లో విజేతలుగా నిలిచిన శ్రీనివాసులు,గౌతమ్,ఇమ్రాన్.

### సత్కరించిన నంద్యాల లయన్స్ క్లబ్,నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్



నంద్యాల జిల్లా ప్రతినిధి / ఫిబ్రవరి 02 : నెల్లూరులో ఏ.సీ. సుబ్బారెడ్డి స్టేడియంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పారా స్పోర్ట్స్ ( దివ్యాంగ క్రీడలు) అథ్లెటిక్ పోటీలలో నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ తరపున పాల్గొన్న చిందుకూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు డిస్కస్ త్రో, జావలిన్ రెండింటిలో బంగారు పతకం సాధించగా, రుద్రవరం కు చెందిన గౌతమ్ షాట్ పుట్ లో స్వర్ణ పతకం,జావలిన్ లో రజత పతకం అందుకోగా,ఆత్మకూరు కు చెందిన ఇమ్రాన్ లాంగ్ జంప్ లో కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో జరిగిన అభినందన కార్యక్రమంలో నంద్యాల లయన్స్ క్లబ్, నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ సంఘం తరపున ముగ్గురు దివ్యాంగ క్రీడాకారులను శాలువా, జ్ఞాపికలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నంద్యాల జిల్లా దివ్యాంగ క్రీడాకారులు రాష్ట్రస్థాయి దివ్యాంగ అథ్లెటిక్స్ పోటీలలో విజేతలుగా నిలిచి ఫిబ్రవరి నెలలో భువనేశ్వర్ లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున పాల్గొనడానికి ఎంపిక కావడం ప్రశంసనీయమన్నారు. వీరు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనడానికి నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ తరపున ఆర్థిక సహకారం అందించడం జరిగిందని దానిని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభతో విజేతలుగా నిలవడం హర్షనీయమని అన్నారు. జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనడానికి కూడా సహకారం అందజేస్తామని ప్రకటించారు. జాతీయ స్థాయి పోటీలలో కూడా విజయం సాధించి రాష్ట్రానికి, నంద్యాల జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.దివ్యాంగులు క్రీడలలో పాల్గొనాలని ఆసక్తి ఉన్నవారు ముందుకు వస్తే వారికి అన్ని రకాల సహాయ సహకారాలు అందజేసి ప్రోత్సహిస్తామని అన్నారు. విజేతలుగా నిలిచిన దివ్యాంగ క్రీడాకారులు మాట్లాడుతూ నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ తమకు అందిస్తున్న ప్రోత్సాహానికి ధన్యవాదాలు తెలిపారు.ఈ అభినందన కార్యక్రమంలో డాక్టర్ రవికృష్ణ, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం.పి.వి.రమణయ్య, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ నిజాముద్దీన్,కోశాధికారి అమిదేల జనార్ధన్, సభ్యులు మేడా చంద్రశేఖర్, రామయ్య, కార్యాలయ కార్యదర్శి ఆలా మధు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను మెరుగైన రీతిలో పరిష్కరించాలి

### పిజిఆర్ఎస్ కు 114 దరఖాస్తులు

### జిల్లా రెవెన్యూ అధికారి డి.రామునాయక్



నంద్యాల జిల్లా బ్యూరో / ఫిబ్రవరి 02 : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సంతృప్తి స్థాయిలో వేగవంతంగా, నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి డి.రామునాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార



వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ శేషన్న, జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి డి.రామునాయక్ మాట్లాడుతూ....ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి స్వీకరించిన విజ్ఞప్తులను నాణ్యతతో వేగవంతంగా సంతృప్త స్థాయిలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును జవాబుదారీతనంతో, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. పిజిఆర్ఎస్ అర్జీలతో పాటు ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి ఆర్జీలు క్లియర్ చేయాలన్నారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని పిజిఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా నిర్దిష్ట కాల పరిమితిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని సమస్యలు:

బేతంచర్ల మండలం, బేతంచర్ల గ్రామానికి చెందిన పి.లక్ష్మన్న తన రేషన్ కార్డులో తన భార్య, కుమారుని నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని డిఆర్ఓకు దరఖాస్తు సమర్పించారు. నంద్యాల మండలం, మిట్నాల గ్రామానికి చెందిన ఎస్. నాగమహేశ్వర రెడ్డి లేఔట్ రస్తా కోసం ఇచ్చిన స్థలంలో కొందరు ఇల్లు కట్టుకున్నారని, అందుకు తగిన చర్యలు తీసుకొని రస్తా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని డిఆర్ఓకు అర్జీ సమర్పించారు. డోన్ మండలం, జగదుర్తి గ్రామానికి చెందిన పి. అన్నదాత సుఖీభవ నగదు జమ కాలేదని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిఆర్ఓకు దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో 114 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా రెవెన్యూ అధికారికి అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

## మాదక ద్రవ్యాల పై విద్యార్థులకు అవగాహన ర్యాలీ

### నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు

### విద్యార్థి దశలోనే పిల్లలను మంచి మార్గంలో నడిపించాలి

### యువత డ్రగ్స్ గంజాయి లాంటి మాదిగ ద్రవ్యాలకు అలవాటు పడకుండా కాపాడుకోవాల్సిన బాద్యత మన అందరిది



క్రిష్ణగిరి ( దేశ పోరాటం ) న్యూస్ ఫిబ్రవరి 2: క్రిష్ణగిరి మండలం కంబాలపాడు గ్రామం ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో డ్రగ్స్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమం హెడ్మాస్టర్ జి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలోమెడికల్ ఆఫీసర్ గజేందర్ రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ గజేందర్ రెడ్డి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని విద్యార్థి దశలోనే పిల్లలను మంచి మార్గంలో నడిపించాలని మన చుట్టూ జరుగుతున్నటువంటి కొన్ని అనైతిక కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి యువత డ్రగ్స్ గంజాయి లాంటి మాదిగ ద్రవ్యాలకు అలవాటు పడకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిని తెలియజేశారు

## నేడు బండలాగుడు పోటీలు

### చిట్యాల లో ఘనంగా తాతా లాలు స్వామి ఉర్సు ఉత్సవాలు



క్రిష్ణగిరి ( దేశ పోరాటం ) న్యూస్ ఫిబ్రవరి 2: మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో తాతా లాలు స్వామి ఉరుసు ఉత్సవాలు ఆదివారం నుంచి మంగళవారం వరకు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి అని కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు తెలిపారు ఆదివారం రోజు గంధం సోమవారం ఉరుసు మంగళవారం కిస్తీ జరుగుతున్నాయి ఈ ఉత్సవాల సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహింపబడుతున్నాయని కబడ్డీ పోటీలు ఎద్దుల పందెం పోటీలు నిర్వహిస్తున్నామని నేడు ఎద్దుల పందెం పోటీలు మొదటి బహుమతి 50 వేలు రెండవ బహుమతి 30 వేలు మూడో బహుమతి 20 వేలు నాలుగో బహుమతి 10 వేలు ఐదవ బహుమతి 8 వేలు ఆరవ బహుమతి ఆరు వేలు రాతిదూలం పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఈ బహుమతులు అందజేస్తామని అన్నారు ఈ పోటీలు దాతల సహకారంతో నిర్వహిస్తున్నామని ఈ పోటీలో పాల్గొన్న వారు ఉత్సవ కమిటీ సభ్యులు కలిసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు పాల్గొనే భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈ ఉర్సు ఉత్సవాల్లో భక్తులుపాల్గొని జయప్రదం చేయాలని గ్రామస్తులు కోరారు క్రిష్ణగిరి ఎస్సై జి.కృష్ణమూర్తి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు

## బడ్జెట్‌లో ఉద్యోగుల బకాయిలకు స్పష్టత ఇవ్వాలి

### మంత్రి ఫరూక్‌ను కలిసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం



నంద్యాల జిల్లా ప్రతినిధి / ఫిబ్రవరి 02 : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వేల కోట్ల రూపాయల బకాయిలు, వేతన సవరణ, నాలుగు విడతల డి.ఏలు, సరెండర్ లీవులు తదితర ఆర్థిక ప్రయోజనాలపై 202627 రాష్ట్ర బడ్జెట్‌లో స్పష్టమైన కేటాయింపులు చూపాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మంత్రి యన్.యం.డి. ఫరూక్‌ను సంఘ ప్రతినిధులు సోమవారం కలిశారు. ఇప్పటికే మంజూరైన బకాయిల చెల్లింపులపై ప్రభుత్వం స్పష్టమైన విధాన ప్రకటన చేయాలని, లేదా ప్రత్యామ్నాయ పరిష్కార మార్గాన్ని బడ్జెట్ ద్వారా వెల్లడించాలని కోరారు. అలాగే సిట్టింగ్ లేదా విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో పీఆర్సీ కమిషన్ ఏర్పాటు, మధ్యంతర భృతి మంజూరు, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరణ అంశాలపై ఎన్నికల హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి, అవసరమైతే శాసనసభలో ప్రస్తావిస్తామని మంత్రి ఫరూక్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర, జిల్లా, మహిళా విభాగం, పెన్షనర్ల విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

# రెవెన్యూ క్లినిక్ అర్జీలపై ప్రత్యేక దృష్టిపెట్టండి..

**అర్జీదారుల సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించండి..**

**జిల్లాస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 211 అర్జీలు..**

**కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**విజయవాడ,ఫిబ్రవరి2(నినాదం):** రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సందర్భంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్ ద్వారా అందుతున్న అర్జీలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని, వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహంతో కలిసి రెవెన్యూ క్లినిక్, పీజీఆర్ఎస్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటి సత్వర పరిష్కారానికి ఆదేశాలిచ్చారు. నాన్ రెవెన్యూ కింద మొత్తం 136 అర్జీలు రాగా వీటిలో పురపాలక శాఖకు 36, పోలీసు శాఖకు 21, పంచాయతీరాజ్‌కు 20 అర్జీలు ఉన్నాయి. డీఆర్డీఏకు 10, గృహ నిర్మాణానికి 6 అర్జీలు రాగా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, ఆరోగ్య శాఖకు అయిదు చొప్పున, పౌర సరఫరాలు, ఉపాధికల్పన, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్‌కు మూడు చొప్పున అర్జీలు వచ్చాయి. వ్యవసాయం, విద్యుత్, అడవులు, ఇరిగేషన్, మైన్స్, టూరిజం, ఖజానా శాఖలకు రెండు చొప్పున, సీపీవో, విద్య, గ్రౌండ్ వాటర్, ఐసీడీఎస్, మార్కెటింగ్, గ్రామీణ నీటి సరఫరా, నైపుణ్యాభివృద్ధి, సాంఘిక సంక్షేమం, సాంకేతిక విద్య, గ్రంథాలయ శాఖలకు ఒకటి చొప్పున అర్జీలు ఉన్నాయి. రెవెన్యూ క్లినిక్ ద్వారా 75 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ద్వారా వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని, ఈ కార్యక్రమం అమల్లో జిల్లాను ముందు వరుసలో నిలపాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, తిరువూరు ఆర్డీవో కె.మాధురి, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, ఏసీపీ కె.వెంకటేశ్వర రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రపతి పాలన విధించాలనడం రాజకీయ కుట్రే



**అమరావతి, ఫిబ్రవరి 2(నినాదం):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్.. రాజకీయ ఆయుధాలుగా ప్రతీకారం, గూండాయిజం, నేరపూరిత కుట్రలనే ఉపయోగిస్తున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు తీవ్ర విమర్శలు చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో శాంతిభద్రతలు విఫలమయ్యాయని చెబుతున్న జగన్, ఆయన అనుచరులు.. రాష్ట్రంలో ఆర్టికల్ 356 ప్రకారం రాష్ట్రపతి పాలన విధించాలని మాట్లాడటం పూర్తిగా రాజకీయ కుట్రేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అశాంతి, నేర కార్యకలాపాలకు జగన్, ఆయన అనుచరులే ప్రధాన సృష్టికర్తలని యనమల ఆరోపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ప్రతీకార రాజకీయాలతో ప్రత్యర్థులను అణచివేసేందుకు ఇలాంటి చర్యలే చేపట్టిందని గుర్తుచేశారు. అధికారం కోల్పోయాక కూడా అదే విధమైన నేర రాజకీయాలను కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై జగన్‌కు ఎప్పుడూ నమ్మకం లేదని, విధ్వంసకర రాజకీయాలకు ఆయనే మూల కారణమని వ్యాఖ్యానించారు. శాసనసభ లోపల, వెలుపల.. సీఎం చంద్రబాబుపై జగన్ అనుచరులు అసభ్యకరమైన భాషను ఉపయోగిస్తున్నారని అయ్యారు. ప్రజలచే ఎన్నికోబడిన నాయకుడిగా ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించే ధైర్యం జగన్‌కు లేదని యనమల ఎద్దేవా చేశారు. శాంతిభద్రతలు విఫలమయ్యాయని తప్పుడు ప్రచారం చేస్తూ, బలవంతంగా అధికార పీఠాన్ని చేజిక్కించుకోవాలని జగన్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు యనమల. వైసీపీ వర్గ రాజకీయ ప్రవర్తన.. రాష్ట్రాన్ని మాఫియా కార్యకలాపాలకు కేంద్రంగా మార్చే ప్రమాదముందన్నారు. జగన్ రాజకీయాల్లోని నీచత్వాన్ని ప్రజలు గమనించాలని యనమల రామకృష్ణుడు సూచించారు.

# ప్రజాగ్రహంతోనే అంబటి రాంబాబుపై దాడి

**వంగవీటి రంగాతో అంబటికి పోలికా**

**మంత్రి కొల్లు రవీంద్ర విమర్శలు**



**విజయవాడ, ఫిబ్రవరి 2 (నినాదం):** ప్రజాగ్రహంతోనే వైసీపీ నేత అంబటి రాంబాబుపై దాడి జరిగిందని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. భ్రష్టుపట్టిన వైసీపీపై రోజు రోజుకూ ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందన్నారు. ప్రజాగ్రహాన్ని తట్టుకోలేక కుల, మతాలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. వంగవీటి మోహన రంగాతో అంబటి రాంబాబును పోల్చడం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రజల కోసం నిలబడిన రంగా స్థాయి ఏమిటి..? రోడ్డుపక్కన అంబోతులా మాట్లాడే అంబటి రాంబాబు స్థాయి ఏమిటి అంటూ ÷ర్ అయ్యారు. ప్రజలు ఆగ్రహంతో అంబటిపై దాడి చేస్తే దాన్ని కులానికి రుద్దే ప్రయత్నం చేయడం సిగ్గుచేటని మంత్రి విమర్శించారు. కులానికి అంటగట్టి రాజకీయ లబ్ది పొందే వైసీపీ కుటిల ప్రయత్నాలను ప్రజలు గమనించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లపై విమర్శలు చేసే అర్హత వైసీపీ నేతలకు లేదన్నారు. అంబటి రాంబాబును ప్రతి ఒక్కరూ చీదరించుకుంటున్నారని తెలిపారు. తాము చాలా సంయమనంతో ఉన్నామన్నారు. సభ్య సమాజం సిగ్గుపడేలా వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో అశాంతిని నిలపాలన్నదే లక్ష్యంగా జగన్ కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఈ కుట్రలను ప్రజలందరూ గమనించాలని మంత్రి కోరారు. పేదల బియ్యం బొక్కేసిన పేర్ని నాని సిగ్గు లేకుండా మాట్లాడుతున్నాడంటూ మంత్రి కొల్లు రవీంద్ర ÷ర్ అయ్యారు. సొంత భార్య పేరు మీద వ్యాపారం చేసి ఆమెను కేసులో ఇరికించిన వ్యక్తి పేర్ని నాని అంటూ విమర్శించారు. కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన వ్యక్తి జోగి రమేష్ అని అన్నారు. 'నా బీసీలు అంటూ జోగి రమేశ్ మాట్లాడుతుండటం హాస్యాస్పదం. గత వైసీపీ ప్రభుత్వంలో బీసీలమైన మాపై దాడులు, అరెస్ట్‌లు జరిగినప్పుడు జోగి రమేశ్ ఏమయ్యారు.. ఏం మేం బీసీలం కాదా' అని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య రాకుండా చూస్తున్నామన్నారు. తప్పు చేసిన ప్రతి ఒక్క వైసీపీ నేతపై కేసులు పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

## వైకాపా గుర్తింపు రద్ద చేయాల్సిందే

**ఎన్నికల సంఘానికి లేఖ రాస్తానన్న గంటా**



**విశాఖపట్నం,ఫిబ్రవరి2(నినాదం):** భవిష్యత్ తరాలు ఆందోళన చెందేలా వైకాపా నేతలు వ్యవహరిస్తున్నారని టిడిపి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విమర్శించారు. ఆ పార్టీ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాయనున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబుపై మాజీ మంత్రులు అంబటి రాంబాబు అసభ్య వ్యాఖ్యల నేపథ్యంలో విశాఖలో గంటా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్‌తో పాటు వైకాపా నేతలు అంబటి రాంబాబు, కొడాలి నాని, పేర్ని నాని, జోగి రమేశ్, రోజా చేసిన మురికి వ్యాఖ్యల వీడియోలను ఆయన ప్రదర్శించారు. నాలుగు సార్లు సీఎంగా ఉన్న చంద్రబాబును ఉద్దేశించి ఇష్టానుసారంగా మాట్లాడితే ప్రజల్లో ఆగ్రహం ఉంటుందని గంటా శ్రీనివాసరావు అన్నారు. వైకాపా హయాంలో ఆయన్ను విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో ఘోరంగా అడ్డుకున్నారని చెప్పారు. ఉనికిని కాపాడుకునేందుకు ఆ పార్టీ యత్నిస్తోందని.. పైగా కులాలను ఆపాదిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే.. అసెంబ్లీలో వైఎస్ఆర్ సైతం క్షమాపణ చెప్పిన ఘటనలు చూశామన్నారు.

## ముఖ్యమంత్రిని దూషించడం సరికాదు

**అంబటి వ్యాఖ్యలపై మండిపడ్డ కేంద్రమంత్రి వర్మ**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి2(నినాదం):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై వైసీపీ నేత అంబటి రాంబాబు చేసిన అసభ్య వ్యాఖ్యలను కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిని తిట్టడం ప్రజాస్వామ్య విరుద్ధమని, రాజకీయాల్లో నైతిక విలువలకు పూర్తి వ్యతిరేకమని విమర్శించారు. అంబటి రాంబాబు వ్యాఖ్యలు సభ్య సమాజం సిగ్గుపడేలా ఉన్నాయని సోమావరం నాడిక్కడ మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలు కేంద్ర హోంమంత్రిని కలవవచ్చున్నారు. రాష్ట్రంలో వైసీపీ నేత చేసిన అసభ్య వ్యాఖ్యల కారణంగా రాష్ట్ర కూటమి నేతలు వ్యతిరేకత వ్యక్తం చేశారని ఆయన తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిందని రాష్ట్రపతి, హోంమంత్రిని కలవాలనుకోవడం వైసీపీ రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమని శ్రీనివాస్ వర్మ అన్నారు. గత ఎన్నికల్లో కేవలం 11 సీట్లకు పరిమితమైన వైసీపీకి.. ప్రతిపక్ష హోదా లేదని, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించడం మంచిది కాదన్నారు. గౌరవప్రదమైన రాజకీయాలు చేయాలని ఆయన సూచించారు. ఏపీలో వైసీపీ ఆవిర్భావం కావడం రాష్ట్ర ప్రజల కర్మ అని కేంద్రమంత్రి వ్యాఖ్యానించారు. వ్యక్తిగత దూషణలు, కుటుంబ సభ్యులను దూషించడం మంచిది కాదన్నారు శ్రీనివాస్ వర్మ. కొడాలి నాని, అప్పలరాజు, అంబటి రాంబాబు లాంటివారు దూషణలు చేస్తున్నా.. పార్టీ అధ్యక్షుడిగా ఉన్న జగన్ ఇలా మాట్లాడొద్దని చెప్పిన సందర్భాలు లేవని పేర్కొన్నారు. భార్యాబిడ్డలను తిడుతుంటే జగన్ మోహన్ రెడ్డి ఆనందపడిన తీరును అందరూ చూశారనీ మంత్రి శ్రీనివాస్ వర్మ చెప్పుకొచ్చారు.

# బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణానికి కృషి

**-పిల్లల బంగారు భవిష్యత్తుకు చేయీచేయీ కలుపుదాం**

**-కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**విజయవాడ, ఫిబ్రవరి 2(నినాదం):** బాల్య వివాహ రహిత జిల్లాగా ఎన్టీఆర్ జిల్లాను తీర్చిదిద్ది, ఆదర్శంగా నిలపడంలో ప్రతిఒక్కరూ చేయీచేయీ కలపాలని, పిల్లలకు బంగారు భవిష్యత్తు అందించేందుకు నిబద్ధతతో కృషిచేయాల్సిన అవసరముందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. వాసవ్య మహిళా మండలి బాల్య వివాహ విముక్తి రథాన్ని కలెక్టర్ లక్ష్మీశ సోమవారం కలెక్టరేట్‌లో జెండా ఊపి ప్రారంభించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సంతకం చేసి విస్తృత ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా వాసవ్య మహిళా మండలి ఓ మంచి కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. వసుధైవ కుటుంబంలో భాగమైన మనందరం బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించి, బాల్య వివాహాలు జరక్కుండా కలిసికట్టుగా కృషిచేయాల్సి ఉందన్నారు. చట్టాలను గౌరవిస్తూ, నిబంధనలు పాటిస్తూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా గళమెత్తాల్సిన అవసరముందన్నారు. ఈ ప్రచార రథం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బాల్య వివాహాల దుష్పరిణామాలు, చట్టాలుపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ (1098), ఉమెన్ హెల్ప్‌లైన్ (181) కూడా అందుబాటులో ఉన్నాయని.. ఎవరైనా ఈ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చున్నారు. ఈ ప్రచార రథం ద్వారా బాల్య వివాహాలపై అవగాహన కల్పించడంతో పాటు లక్ష మందికి పైగా ప్రజల నుంచి సంతకాలు సేకరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ వాసవ్య మహిళా మండలి బృందానికి సూచించారు. కార్యక్రమంలో వాసవ్య మహిళా మండలి ప్రెసిడెంట్ డా. బి.కీర్తి, ప్రాజెక్టు డైరెక్టర్ రామానుజయ, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి రుక్సానా సుల్తానా బేగం, డీసీపీయూ ఎం.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## లండన్ చేరుకున్న మంత్రి నారాయణ

**అమరావతి కోసం పలు ప్రాజెక్టుల అధ్యయనం**

**అమరావతి,ఫిబ్రవరి2(నినాదం):** రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా పలు ప్రాజెక్టులను అధ్యయనం చేసేందుకు గానూ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ బృందం లండన్ చేరుకుంది. ఈ పర్యటనలో భాగంగా అక్కడ పలు కీలక ప్రాజెక్టులను పరిశీలించి, అమరావతిలో అమలు చేయగలిగే ఆధునిక పట్టణ ప్రణాళిక, స్పోర్ట్స్ సిటీ, రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ వంటి అంశాలపై నారాయణ బృందం అధ్యయనం చేయనుంది. లండన్ కాలమానం ప్రకారం.. ఉదయం 11:00 గంటలకు లండన్ సిటీ కార్పొరేషన్ ఎ÷-లానింగ్ అండ్ డెవలప్మెంట్ డైరెక్టర్ గ్విన్ రిచర్డ్స్‌తో మంత్రి సమావేశం కానున్నారు. ఈ భేటీలో అమరావతి అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు, అంతర్జాతీయ సహకార అవకాశాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. అలాగే మధ్యాహ్నం 1:30 గంటలకు బెటర్సీ పవర్ స్టేషన్‌ను నారాయణ బృందం సందర్శించనుంది. అనంతరం థేమ్స్ రివర్ ఫ్రంట్ ప్రాంతాన్ని పరిశీలించనుంది. సాయంత్రం 4:30 గంటలకు లండన్ బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి.. అక్కడి బ్రిడ్జ్, సరౌండింగ్ ఏరియాల అభివృద్ధి, ట్రాన్స్‌పోర్ట్ ఇంటిగ్రేషన్ వంటి అంశాలను అధ్యయనం చేయనుంది. బృందంలో మంత్రి నారాయణతో పాటు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎండీ శ్రీనివాస్‌లు ఉన్నారు. ఈ పర్యటన ద్వారా అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ఆధునిక ఆలోచనలు, టెక్నాలజీలు సేకరించడమే లక్ష్యమని తెలుస్తోంది. ఈ నెల 2, 3 తేదీల్లో లండన్‌లో.. 4, 5 తేదీల్లో దోహాలో ఈ బృందం పర్యటించనుంది.

# రాష్ట్రంలో హింసను ప్రేరేపించటానికి వైకాపా కుట్రలు

**అలజడి సృష్టించేందుకే ఆ పార్టీ నేతలు బూతులు**

**ఆ పార్టీ ట్రాప్‌లో పడితే వారికీ.. మనకీ తేడా ఉండదు**

**లడ్డూ కల్తీ వ్యవహారంలో వైకాపా అడ్డంగా దొరికిపోయింది**

**అందుకే ఫ్రస్టేషన్‌లో నానా యాగీ చేసే ప్రయత్నాలు**

**వైకాపా కుట్రలతో టిడిపి నేతలు జాగ్రత్తగా ఉండాల్సిందే**

**పార్టీ నేతలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్**



**అమరావతి,ఫిబ్రవరి2(నినాదం):** రాష్ట్రంలో హింసను ప్రేరేపించటానికి వైకాపా కుట్రలు పన్నుతోందని తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు అన్నారు. అధికారం కోల్పోయామనే అసహనంతోనే రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోందని.. అలజడి సృష్టించేందుకే ఆ పార్టీ నేతలు బూతులు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు, పార్టీ సీనియర్ నేతలతో సీఎం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. హింస, విధ్వంసం, అవినీతి పునాదులపై వైకాపా పుట్టింది. ఆ పార్టీ ట్రాప్‌లో పడితే వారికీ.. మనకీ తేడా ఉండదనీ చంద్రబాబు అన్నారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో వైకాపా అడ్డంగా దొరికిపోయింది. రాష్ట్ర ప్రజలంతా ఆ పార్టీని చీదరించుకుంటున్నారు. చేసిన పాపాలను దారిమళ్లించాలనేది వైకాపా కుట్ర. పెట్టుబడులు సాధించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నదే మన ప్రధాన అజెండా. అది వైకాపా నేతలకు నచ్చడం లేదు. అందుకే అడ్డుకునేందుకు కుట్రలకు పాల్పడుతున్నారు. తప్పు చేసిన ప్రతి ఒక్కరినీ చట్టపరంగా శిక్షించి తీరుతాం. తెదేపా కార్యకర్తలు సంయమనం పాటించేలా మంత్రులు, నేతలు బాధ్యత తీసుకోవాలి. కార్యకర్తలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని వైకాపా ట్రాప్‌లో పడొద్దు. అలా జరగకుండా పార్టీ నేతలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇకపోతే రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న తాజా పరిణామాలు, శాంతిభద్రతల అంశం, పాలనలో మార్పులు వంటి విషయాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన తాజా ట్వీట్ చర్చకు దారితీసింది. వైసీపీపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్ర పునర్నిర్మాణాన్ని జీర్ణించుకోలేక వైసీపీలో ఫ్రస్టేషన్ పెరిగిందని చంద్రబాబు విమర్శించారు. ÷ూజకీయాలను నేరమయం చేయడమే వైసీపీ సిద్ధాంతమని, వారి పాలనలో చట్టవిరుద్ధ పాలనకు అనేక ఉదాహరణలు ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. జగన్ హయాంలో చట్టాన్ని పక్కన పెట్టి, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జరిగిన అనేక అక్రమాలు, చట్టవిరుద్ధ చర్యలే దీనికి నిదర్శనమని ప్రస్తావించారు. ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ జగన్ పాలన కొనసాగిందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. సీఎం చంద్రబాబు తన ట్వీట్‌లో రూల్ ఆఫ్ లా గురించి ప్రధానంగా ప్రస్తావించారు. 2024 తర్వాతే రాష్ట్రంలో నిజమైన చట్టపాలన అమలవుతోందని స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో చట్టం పేరుకే ఉండేదని అధికారమే అన్నింటికీ ఆధారంగా మారిందని విమర్శించారు. ప్రజలకు న్యాయం అందాలంటే రాజ్యాంగమే సుప్రీమ్‌గా ఉండాలని, అదే తమ ప్రభుత్వ విధానమని చంద్రబాబు స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించే అధికారం ఎవరికీ లేదని, అది ఏ పార్టీకి చెందిన వారైనా సరే చర్యలు తప్పవని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీలో శాంతిభద్రతలు మెరుగుపడ్డాయని చంద్రబాబు అభివర్ణించారు. గతంలో క్షీణించిన శాంతిభద్రతల పరిస్థితిని పునరుద్ధరించామన్నారు. ప్రజల భద్రత, ప్రశాంత వాతావరణం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని ఉద్ఘాటించారు. శాంతిభద్రతలను ఉల్లంఘించే ప్రయత్నాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని కూడా ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో జరుగుతున్న పునర్నిర్మాణ ప్రక్రియను చూసి వైసీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని సీఎం విమర్శించారు. వారు విధ్వంసం చేసిన వ్యవస్థలను మళ్లీ నిర్మిస్తున్న తీరును చూసి అసహనంతో దూషణలకు దిగుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజలకు సేవ చేయడం, వారికి సాధికారిత కల్పించడమే తమ ప్రభుత్వ సిద్ధాంతమని స్పష్టం చేశారు. ప్రజల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్న ప్రభుత్వంపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ప్రజలకు సేవ చేయటం, వారికి సాధికారిత కల్పించటమే తమ ప్రభుత్వ సిద్ధాంతమని తెలిపారు. పాలనలో పారదర్శకత, చట్టబద్ధత, బాధ్యతాయుత పాలన తమ లక్ష్యాలని స్పష్టం చేశారు. వైసీపీ నిజ స్వరూపం ఒక్కొక్కటిగా బయటపడుతుండటంతోనే ఆ పార్టీ నాయకులు అసహనంతో వ్యవహరిస్తున్నారని చంద్రబాబు ధ్వజమెత్తారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదోని గ్రానైట్ ఫ్యాక్టరీలో ఘోరం

**గ్రానైట్ బండ తగిలి కార్మికుడు మృతి**

**కర్నూలు, ఫిబ్రవరి 2(నినాదం):** కర్నూలు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. ఆదోని డివిజన్ కపటి గ్రామ శివారులోని ఒక గ్రానైట్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదం.. ఓ వలస కూలీ ప్రాణాన్ని బలిగొంది. గ్రానైట్ ఫ్యాక్టరీలో పనులు జరుగుతున్న సమయంలో అనుకోని రీతిలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఫ్యాక్టరీలో గ్రానైట్ రాళ్లను ప్రాసెస్ చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ భారీ రాతి బండ ఒక్కసారిగా ఎగిరి కార్మికుడిపై పడింది. బండరాయి బలంగా తగలడంతో ఆ కార్మికుడు తీవ్ర గాయాలపాలై ఘటనా స్థలంలోనే ప్రాణాలు వదిలాడు. మృతిచెందిన కార్మికుడిని రాజమాల్‌గా గుర్తించారు. ఆయన ఉపాధి కోసం పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన వలస కార్మికుడని సహచర కార్మికులు తెలిపారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఆదోని రూరల్ పోలీసులు.. తక్షణమే ఫ్యాక్టరీకి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఫ్యాక్టరీలో రక్షణ చర్యలు లోపించాయా లేదా అనే కోణంలో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు ఈ సమాచారాన్ని అందించారు. ఫ్యాక్టరీలు, మైనింగ్ ప్రాంతాల్లో కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల ప్రాణాలు పోతున్నాయని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి.

## బంగ్లా చెరనుంచి బయటపడ్డ మత్స్యకారులు

**విశాఖపట్టణం,ఫిబ్రవరి2(నినాదం):** సముద్రంలో వేటకు వెళ్లి బంగ్లాదేశ్ తీర ప్రాంతంలో పొరపాటున ప్రవేశించి గత ఏడాది అక్టోబర్‌లో అరెస్ట్ కాబడి, దాదాపు నాలుగు మాసాల పాటు బంగ్లాదేశ్ జైలులో ఉన్న 9 మంది మత్స్యకారులు విడుదలయ్యారు. సోమవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో స్థానిక ఫిషింగ్ హార్బర్ కు వీరంతా చేరుకున్నారు. ఈ మత్స్యకారులంతా విజయనగరం జిల్లాకు చెందినవారు. ఆర్డీవో ఎస్.సుధాకర్, ఫిషరీస్ డిపా÷-టం÷-మెంట్ జాయింట్ డైరెక్టర్ ఎస్. లక్ష్మణరావు, ఎపి మేకనైజ్డ్ బోటు అసోసియేషన్ అధ్యక్షులు మైలపల్లి లక్ష్మణరావు, చీకటి రమేష్, గరికిన రవి, తదితరులు కలిసి తీర ప్రాంతానికి చేరుకున్న మత్స్యకారులకు స్వాగతం పలికి వారందరికీ స్వీట్లు పంపిణీ చేశారు.

# తెలుగు రాష్ట్రాల్లో పులి సంచారం కలకలం

**కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ప్రచారం**

**తొర్రేడులో పులిజాడతో ప్రజల భయాందోళన**

**అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారుల హెచ్చరిక**

**పులిని పట్టుకునేందుకు బోను, సిసి కెమెరాల ఏర్పాటు**



**రాజమహేంద్రవరం,ఫిబ్రవరి2(నినాదం):** రాజమహేంద్రవరం మండలంలోని తొర్రేడులో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. పెద్దపులి దాడిలో మృతి చెందిన రెండు ఆవులు, దూడ కళేబరాలను వారు గుర్తించారు. పెద్దపులిని పట్టుకునేందుకు తొర్రేడు తోటల్లో పులిబోను, ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం రూరల్, కోరుకొండ, సీతానగరం మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు డీఈవో సోమవారం సెలవు ప్రకటించారు. పోలవరం జిల్లా దేవీపట్నం మండలంలోని ప్రజల్ని, పర్యాటకుల్ని అధికారులు అప్రమత్తం చేశారు. ఛత్తీస్‌గఢ్ నుంచి రెండు పెద్ద పులులు జనారణ్యంలోకి వచ్చినట్టు అటవీ అధికారులు భావిస్తున్నారు. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లో పెద్ద పులుల సంచారం కలకలం రేపుతున్నాయి. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పులుల సంచారం ఎక్కువైపోయింది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలనుంచి తెలుగు రాష్ట్రాల్లోకి వచ్చిన పులులు అలజడి సృష్టిస్తున్నాయి. మొన్నటి వరకు ఏలూరు జిల్లా ఏజెన్సీని వణికించిన పెద్దపులి ఇప్పుడు తూర్పు గోదావరిలోకి ప్రవేశించింది. నిన్న రాజమహేంద్రవరం రూరల్ తొర్రేడులో పశువులపై దాడి చేసి చంపేసింది. పులి దాడిపై స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు మీడియా సమావేశం నిర్వహిస్తుండగా.. వారి వెనకాలే పులి కనిపించింది. పులి సంచారం నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ మేరకు రాజమండ్రి రూరల్, కోరుకుంట్ల, సీతానగరం మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. పిల్లల్ని బయటకు వెళ్లనీయకుండా జాగ్రత్త తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించింది. ఇక నెల్లూరు జిల్లా దత్తలూరు మండలం నందిపాడులోనూ పెద్దపులి కలకలం సృష్టిస్తోంది. రేమానుకుంట వద్ద స్థానికులకు పెద్దపులి కనిపించింది. దీంతో ఉదయగిరి పరిసర ప్రాంతాలవారు భయాందోళనలో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో పెద్దపులి సంచారం.. జనాలతో పాటు ఫారెస్ట్ అధికారుల కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. 15 రోజులుగా ఫారెస్ట్ అధికారులు పెద్దపులిని పట్టుకోవటానికి ఎంతగానో ప్రయత్నిస్తున్నారు. అయినప్పటికీ లాభం లేకుండా పోయింది. మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి ఆ పెద్దపులి వచ్చినట్లు ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. ఈ పెద్దపులి యాదాద్రి భువనగిరితో పాటు సిద్ధిపేట జిల్లా సరిహద్దులోనూ సంచరిస్తోంది. ఇక హైదరాబాద్ శివారు ప్రాంతంలోనూ ఓ పెద్దపులి తిరుగుతున్నట్లు సమాచారం.

# మసిపూసి మారేడుకాయ !

సంపాదకీయం

మసిపూసి మారేడుకాయ చేయడమంటే ఇదే. దేశంలో ప్రజల ఆకలిబాధలను, పరిస్థితులను,రోదనలను పట్టించుకోకుండా బడ్జెట్ యధావిధిగా ప్రవేశ పెట్టారు. గత 9 ఏళ్లుగా నిర్మలా సీతారామన్ బడ్జెట్ వల్ల దేశంలో మార్పులు ఏమైనా వచ్చాయా అని చర్చిస్తే..వచ్చాయనే చెప్పాలి. దేశంలో ఆర్థిక మందగమనం సాగుతోంది. ప్రజల కొనుగోలు శక్తి తగ్గింధి. నిత్యావసర వస్తువులతో పాటు అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగాయి. ముఖ్యంగా ఔషధాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కోవిడ్ తరవాత ధరలను పరిశీలిస్తే 200 నుంచి 500 శాతం వరకు ఔషధాల ధరలు పెరిగాయి. సామాన్యులు వైద్యం చేయించుకునే మాటెలా ఉన్నా..మందులు కొనుక్కుని వేసుకునే దిక్కులేకుండా పోయింది. మరి బడ్జెట్ ప్రగతిశీలమైతే ఇవన్నీ ప్రభావం చూపాలి. చూపడం లేదంటే బడ్జెట్‌తో ప్రజలకు ఒరిగిందేవిమీ లేదని గుర్తించాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మార్పురావడం లేదు. ప్రజల చేతుల్లో డబ్బులు ఆడడం లేదు. సంపాదించింది తిండికి కూడా సరిపోవడం లేదు. ఇలా నరేంద్రమోడీ నేత్రుత్వంలోని కేంద్ర ప్రభుత్వం మరోసారి సామాన్యులను నిజంగానే వంచించింది. ఒకదాని తరువాత ఒకటిగా చోటుచేసుకుంటున్న అంతర్జాతీయ పరిణామాల నేపధ్యంలో అప్రమత్తంగా ఉండాలంటూ ఆర్థిక సర్వే చేసిన హెచ్చరికలను సైతం బేఖాతరు చేసింది. కొద్దిమంది కోటీశ్వరుల ప్రయోజనాలను రక్షించేదిగా మాత్రమే బడ్జెట్ ఉంది. వరుసగా తొమ్మిదవసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తన ప్రసంగంలోఘనంగా చెప్పిన 'సంస్కరణల ఎక్స్‌ప్రెస' నిర్దాక్షిణ్యంగా సగటుజీవి పైనుండి దూసుకెళ్ళింది. ఫలితం 53,47,315 కోట్ల రూపాయల బడ్జెట్ సామాన్యులను ప్రమాదంలోకి నెట్టింది. కార్పొరేట్లకు, కోటీశ్వరులకు రాయితీలు, వరాల వర్షం కురిపించి నప్పుడు గుర్తుకురాని ఆర్థిక క్రమశిక్షణ కార్మికులకు, రైతులకు, వ్యవసాయ కూలీలకు, మధ్య తరగతి ప్రజానీకానికి మాత్రం గుర్తు చేశారు. దేశంలోని కోటానుకోట్ల జనానికి మేలు చేసేదిలా బడ్జెట్ లేదన్నది ముమ్మాటికీ నిజం. ప్రతిపక్ష సభ్యులు మొదలు, ఆర్థిక సంస్కరణ అభిలాషులు సైతం దీనిని అంగీకరిం చారు. ఫలితంగా వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం ఇలా ఒకటేమిటి?అన్ని రంగాల సాధారణ ప్రజానీకానికి సంబంధించిన పథకాల కేటాయింపుల్లో కోతలు పడ్డాయి. చివరికి, మహిళా సంక్షేమం, అభివృద్ధి కోసం కేటాయించే 'జెండర్ బ్జడెట'కూ నిధులలోనూ కోత పెట్టడం మోడీ సర్కారు తీరుకు నిదర్శనం. దీంతో రానున్న రోజుల్లోనూ నిరుద్యోగం, అధికధరలు, జీవన వ్యయాలు పెరగడం, ఉపాధి కోత వంటి కష్టాలు తప్పవన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. కేంద్రబడ్జెట్‌లో సామాన్యులకు నేరుగా ప్రయోజనం కల్పించే చర్యలు పెద్దగా లేవు. గత ఏడాదిలో ఆదాయ పన్ను, జీఎస్టీల్లో భారీ కోతలతో ఉపశమనం కల్పించిన ప్రభుత్వం ఈసారి వాటి జోలికి వెళ్లలేదు. అయితే పలు విభాగాల్లో మినహాయింపు లను ఇవ్వడం ద్వారా పరోక్షంగా సాయం చేసేందుకు ప్రయత్నించినట్లు చెప్పుకుంది. అయితే అది ఏమేర ప్రతిఫలిస్తుందన్నది చూడాలి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బ్జడెట్‌లో.. మధ్య తరగతి వారు, చిన్న ఇన్వెస్టర్లకు పలు అంశాల్లో మినహాయింపులను ప్రకటించారు. వ్యవసాయం, విద్య, చిన్న పరిశ్రమలు, ఆరోగ్య రంగం, ఫైనాన్షియల్ మార్కెట్లు, ఐటీ రంగం, రవాణా మౌలిక వసతులు, పర్యాటకం, క్రీడా రంగాల ద్వారా సామాన్యులకు పరోక్షంగా ప్రయోజనం కల్పించే చర్యలను మంత్రి వెల్లడించారు. పోటీతత్వం పెంచడంతోనే ఆర్థికవృద్ధిని వేగవంతం చేయగలమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఉత్పాదకతను, పోటీతత్వాన్ని పెంచడం ద్వారా నిలకడగల ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం, వారి సామర్థ్యాలను మెరుగుపరచడం, ప్రతి కుటుంబం, సమాజం, ప్రాంతం వృద్ధికి వనరులు, అవకాశాలను పొందేలా చూడటం అనే మూడు 'కర్తవ్యాలు'ను ప్రభుత్వం చేపట్టిందని మంత్రి పేర్కొన్నా.. గత 9 ఏళ్లుగా ఇవేవి కనిపించడం లేదు. ఏటా కొత్తకొత్త ప్రకటనలతో మభ్య పెట్టడం సాధ్యం కాదని పాలకుల తెలుసుకుంటే మంచిది. ఈ కర్తవ్యాలను సక్రమంగా నెరవేర్చడానికి సంస్కరణల ఎక్స్‌ప్రెస్ వేగంగా ముందుకు సాగుతుందని వ్యాఖ్యానించారు. గత 12ఏళ్ళుగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ఫలితమే ఈనాటి అనిశ్చిత పరిస్థితుల్లో కూడా నిలకడగల వృద్ధిని, ఆర్థిక సుస్థిరతను సాధించగలిగామని నిర్మలమ్మ చెప్పుకున్నారు. అయితే ఈ లెక్కలు దేనిని బేరీజు వేసుకుని చెప్పారన్నది అర్థం కావడం లేదు. గ్రామాలకు వెళితే ప్రజల జీవన పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలుస్తాయి. వారికి ఇంకా ఉచిత బియ్యం అందిస్తున్నామంటే, వారి ఆర్థిక పరిస్థితిని గమనించవచ్చు. రైతులు ధాన్యం పండిస్తున్నా గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. తిండి గింజలు కొనుక్కోలేక సామాన్యులు విలవిల్లాడుతున్నారు. అయితే కేన్సర్ పేషెంట్లకు ఊరట కలిగించేలా కీలక నిర్ణయం తీసుకున్నారు. కేన్సర్ చికిత్స కోసం విదేశాల నుంచి దిగుమతి చేసుకునే అత్యావశ్యక ఔషధాలపై దిగుమతి సుంకాన్ని మినహాయిస్తారు. దీనిలో భాగంగా 17 రకాల ఔషధాలు ధరలు తగ్గుతాయి. అరుదైన వ్యాధుల చికిత్సకు ఉపయోగించే మరో ఏడు కీలక ఔషధాలపై కూడా దిగుమతి సుంకాలు తగ్గుతాయి. కేన్సర్ చికిత్సలో వాడే మందులు, ఇతర ఔషధాలు, ఆహార పదార్థాలు, పరికరాలపై కూడా సుంకాలు తగ్గుతాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ఆకళింపు చేసుకోకుండా ఎన్ని బడ్జెట్లు ప్రవేశ పెట్టినా భారత పురోగతి కాగితాలకే పరిమితం అవుతుంది.

# ప్రాచీన భారతీయ ఆర్థిక నీతి!

## ప్రజా సంక్షేమమే పాలకుడి పరమావధి

భారతదేశపు ప్రాచీన ఆర్థిక మరియు పరిపాలనా చరిత్రను పరిశీలిస్తే, పన్నుల వసూలు మరియు ప్రజా సంక్షేమంపై మన పూర్వీకులు ఎంతటి అద్భుతమైన శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉన్నారో స్పష్టమవుతుంది. ముఖ్యంగా క్రీస్తుపూర్వం నాలుగో శతాబ్దానికి చెందిన మౌర్య సామ్రాజ్య మహామంత్రి చాణక్యుడి 'అర్థ శాస్త్రం'లో పేర్కొన్న సూత్రాలు నేటి ఆధునిక ఆర్థిక వ్యవస్థలకు కూడా మార్గదర్శకాలుగా నిలుస్తాయి. చాణక్యుడు తన గ్రంథంలో 'ప్రజా సుఖే సుఖం రాజ్య' అని చెప్పడం ద్వారా, పాలన యొక్క ప్రాథమిక లక్ష్యం పాలకుడి వ్యక్తిగత వైభవం కాదని, ప్రజల సుఖశాంతులేనని చాటి చెప్పారు. ఆయన ప్రతిపాదించిన 'తేనెటీగ సూత్రం' పన్నుల వసూలులో ఉండాల్సిన సున్నితత్వాన్ని వివరిస్తుంది. తేనెటీగ పువ్వుకు ఎటువంటి నొప్పి కలిగించకుండా, దాని సహజత్వాన్ని దెబ్బతీయకుండా మకరందాన్ని సేకరించి ఎలాగైతే తేనెను సమకూరుస్తుందో, ప్రభుత్వం కూడా ప్రజల ఆర్థిక స్థితిగతులను పీడించకుండా పన్నులు వసూలు చేయాలని ఆయన సూచించారు.

చాణక్యుడి పన్ను విధానం ఆశ్చర్యకరంగా ఆధునిక కాలపు ప్రగతిశీల పన్ను విధానాన్ని పోలి ఉంటుంది. ప్రజల చెల్లింపు సామర్థ్యాన్ని బట్టి పన్నులు ఉండాలని, స్పష్టమైన సమయపాలన మరియు స్థిరమైన రేట్లు ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఇది పన్ను వసూలులో గందరగోళాన్ని మరియు వేధింపులను అరికడుతుంది. ముఖ్యంగా తక్కువ ఆదాయం ఉన్న రైతుల పట్ల ఆయన కరుణా దృక్పథాన్ని ప్రదర్శించారు. కొత్తగా సాగు మొదలుపెట్టిన వారికి లేదా ఆర్థికంగా వెనుకబడిన వారికి పన్ను మినహాయింపులు ఇవ్వాలని ఆయన చేసిన సూచన నేటికీ ఆచరణీయమైనది. అదే సమయంలో విలాస వస్తువులపై అధిక పన్నులు, నిత్యావసర వస్తువులపై తక్కువ పన్నులు ఉండాలని చెప్పడం ద్వారా సామాజిక న్యాయాన్ని ఆర్థిక వ్యవస్థలో భాగం చేశారు. వసూలు చేసిన పన్నును ప్రభుత్వం తన వ్యక్తిగత విలాసాల కోసం కాకుండా, ప్రజా రక్షణ, మౌలిక సదుపాయాల కల్పన మరియు సామాజిక సంక్షేమం కోసం మాత్రమే వినియోగించాలని చాణక్యుడు గట్టిగా నొక్కి చెప్పారు.

భారతీయ సంస్కృతిలో ఆదాయంలో ఆరో వంతు (1/6) పన్నుగా చెల్లించడం అనేది ఒక ధర్మంగా భావించబడేది. దీనిని 'భాగ' అని పిలిచేవారు. మార్కండేయ పురాణంలోని ఒక కథ ప్రకారం, పన్ను చెల్లించే ప్రతి పౌరుడికి ప్రభుత్వం నుండి రక్షణ మరియు న్యాయం పొందే పూర్తి హక్కు ఉంటుంది. ఒక సామాన్యుడు పాలకుడిని ప్రశ్నిస్తూ, "మేము మా ఆదాయంలో ఆరో వంతు మీకు సమర్పిస్తున్నప్పుడు మమ్మల్ని రక్షించడం మీ కనీస బాధ్యత" అని గుర్తు చేయడం ద్వారా ప్రాచీన భారతదేశంలో పాలకుడి బాధ్యత ఎంతటిదో అర్థమవుతుంది. దక్షిణ భారతదేశంలోని చోళ రాజుల శాసనాల్లో కూడా 'కడమై' అనే భూమి శిస్తు ఇదే నిష్పత్తిలో ఉండేదని చరిత్ర చెబుతోంది. క్రీస్తుశకం 850 నుండి 1279 వరకు వెలువడిన అనేక శిలాశాసనాలు మరియు రాగిరేకులు ఈ పద్ధతిని ధ్రువీకరిస్తున్నాయి.

ఆధ్యాత్మిక కోణంలో చూస్తే, ఆది శంకరాచార్యులు ధనాన్ని 'లక్ష్మీ దేవి'గా, ఒక పవిత్రమైన శక్తిగా భావించాలని, దానిని లోభత్వం కోసం కాకుండా లోక కల్యాణం కోసం వినియోగించాలని బోధించారు. మన దేశంలో కర్ణుడు, హరిశ్చంద్రుడు, శిబి వంటి వారిని గొప్ప దాతలుగా కొలవడం వెనుక ఉద్దేశ్యం సంపాదనలో కొంత భాగాన్ని సమాజానికి తిరిగి ఇవ్వాలనే ఉన్నతమైన ఉద్దేశ్యమే. మహాభారతంలోని శాంతి పర్వంలో భీష్ముడు ధర్మరాజుకు చేసిన బోధనలు ఈ ఆర్థిక నీతికి పరిపూర్ణతను ఇస్తాయి. అంపశయ్యపై ఉన్న భీష్ముడు 'ఆవు పాలు' అనే అద్భుతమైన ఉదాహరణను ఇచ్చారు. ఆవును ప్రేమిస్తూ, జాగ్రత్తగా పాలు పితికితే అది పాలను ఇస్తూనే ఆరోగ్యంగా ఉంటుంది. కానీ అతిగా పితికితే అది పాలు ఇవ్వకపోగా ప్రాణాపాయ స్థితికి చేరుకుంటుంది. అదే విధంగా ప్రభుత్వం పౌరులను అధిక పన్నులతో పీడిస్తే ఉత్పత్తి దెబ్బతిని, చివరకు రాజ్య ఆదాయమే తగ్గిపోతుంది.

అయితే, నేటి కేంద్ర ప్రభుత్వ పోకడలను పరిశీలిస్తే ప్రాచీన ధర్మాలకు, ఆధునిక ఆచరణకు మధ్య అగాధం స్పష్టంగా కనిపిస్తోంది. చాణక్యుడు పాలకుల వ్యక్తిగత వైభవం కోసం లేదా ఆర్భాటపు స్మారక చిహ్నాల కోసం ప్రజాధనాన్ని వెచ్చించవద్దని హెచ్చరించినప్పటికీ, నేడు వేల కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న భారీ ప్రాజెక్టులు, సెంట్రల్ విస్టా వంటి ప్రతిష్టాత్మక నిర్మాణాలు సామాన్యుడిపై భారంగా మారుతున్నాయి. ఒకవైపు నిత్యావసర వస్తువులపై జీఎస్టీ వంటి పన్నుల భారం సామాన్య గృహస్థుడి నడ్డి విరుస్తుంటే, మరోవైపు ఆ సొమ్మును తక్షణ ప్రజా అవసరాలైన వైద్యం, విద్య కంటే కూడా ఆడంబరమైన ప్రాజెక్టులకు మళ్లించడం 'తేనెటీగ సూత్రానికి' పూర్తిగా విరుద్ధం. భీష్ముడు హెచ్చరించినట్లుగా, పౌరులను పన్నులతో అతిగా పిండటం వల్ల ఆర్థిక వ్యవస్థలో కొనుగోలు శక్తి క్షీణించి, అది దీర్ఘకాలంలో దేశ ప్రగతికే గొడ్డలిపెట్టుగా మారుతోంది. ఆడంబరపు ప్రాజెక్టుల ద్వారా పాలకుల ప్రతిష్టను పెంచుకోవడం కంటే, సామాన్యుడి కళ్లలో ఆనందం చూడటమే నిజమైన రాజధర్మమని మన ప్రాచీన ఆర్థిక చరిత్ర గుర్తుచేస్తోంది.

**వెంకగారి భూమయ్య**
**సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ**
**9848559863**



# ముద్రణా యంత్ర ఆవిష్కర్త గ్యూటెన్ బర్గ్

**ఫిబ్రవరి 3...జోహన్ గ్యూటెన్ బర్గ్ జయంతి**

మానవ చరిత్రలో జరిగిన అనేక ఆవిర్భావాల్లో ప్రజల జీవన సరళినే కాకుండా మనసుల్ని, హృదయాల్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. ఒక్క ముద్రణ విధానమే అని చెప్పవచ్చు. ముద్రణా విధానమే లేకుంటే మానవాళి ప్రగతి సాధ్యం అయ్యేది కాదు. జూలియస్ సీజర్ అలెగ్జాండ్రియా నగరాన్ని ముట్టడించినపుడు అక్కడ ఉన్న గ్రంథాలయం కొంత వరకు ధ్వంసం అయినది. క్రీ.శ 390 లో ధియోఫిలస్ అనే క్రైస్తవ మత గురువు ఇక్కడి నుంచి కొన్ని పుస్తకాలను తరలించాడు. క్రీ.శ 642 లో మహమ్మదీయులు ఈ నగరం పై దండెత్తి వచ్చినపుడు కాలిఫ్ ఉమర్ గ్రంథాలయం కాల్చివేయమని సైనికులను ఆజ్ఞాపించాడు. సుమారు 4 లక్షల పుస్తకాలు మానవుని తెలివి తక్కువ తనానికి, ప్రతీకార వాంఛలకు బలైపోయాయి. ప్రాచీన సాహిత్య గ్రంథాలూ, జానపద గాథలూ, తరగని విజ్ఞాన సంపదా వాటిలో నిక్షిప్తంగా ఉండేవి. అవన్నీ రాత, బానిసల, పండితుల చేత చేతితో రాయబడ్డవే. ఒక పెద్ద గ్రంథాలయం నాశనం కావడంతో కళలకు, సాహిత్యానికి, వేదాంత విజ్ఞాన శాస్త్రాలకు సంబంధించిన అపార జ్ఞాన నిధి తరువాతి తరాలకు శాశ్వతంగా దూరమైంది. కానీ ఇలాంటి దుర్ఘటన ప్రపంచంలో మరెన్నడూ సంభవించ లేదు. లండన్ లోని బ్రిటిష్ మ్యూజియం, వాషింగ్టన్ లైబ్రరీ కాంగ్రెస్, పారిస్ లోని "బిబ్లియోథెక్ నేషనేల్ " సంపూర్ణంగా దగ్ధమైపోయినప్పటికీ, వాటి ప్రతులు ఇతరదేశాల లైబ్రరీల్లో నేడు లభ్యమవుతున్నాయి.కాగితం తయారు చేయటానికీ, ముద్రణ విధానం ప్రవేశ పెట్టడానికీ శ్రీకారం చుట్టింది చైనీయులే, చైనా భాషకు సంబంధించిన సంకేతాలను కొయ్యపై చెక్కి, సక్రమంగా అమర్చి, వాటికి సిరా పూసి కాగితాలపై ఒత్తడంతో వాళ్ళ ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. చైనా లిపిలో అక్షరాలుండవు. శబ్దానికి సంబంధించిన మాత్రా కాలాలకు (syllables) సంకేతాలుంటాయి. విడిగా ఉండే అచ్చులతో ముద్రించే విధానం చైనాలో 13 వ శతాబ్దంలోనూ, కొరియాలో 14 వ శతాబ్దంలోనూ ప్రారంభమైంది. అనేక శతాబ్దాలుగా దూర ప్రాచ్య దేశాల్లో బొమ్మలను ముద్రించే పద్ధతి నుంచి ఈ విధానం రూపొందిందని చెప్పవచ్చు. అచ్చుల సహాయంతో అక్షరాలను ముద్రించే విధానం ఈ నేపథ్యంలో ప్రారంభమైంది. ఐరోపాలో కూడా ముద్రణ మొదట్లో బొమ్మలతోనే ప్రారంభమైంది. కొయ్య దిమ్మలతో పటాలను చెక్కే వారు. పశ్చిమ ఐరోపాలో కొందరు కొయ్య లేదా లోహంతో అక్షరాల అచ్చులను తయారుచేసి, ముద్రించటానికి అనుకూలంగా వాటిని పదాలుగానూ, వాక్యాలుగానూ మార్చి ముద్రించాలని ప్రయత్నించారు. దీనికి కావలసిన కాగితం తయారీ అరబ్బుల పుణ్యమా అని చైనా నుంచి ఐరోపా ఖండానికి తీసుకు రాబడి అందరికీ లభ్యంగా ఉండేది. చేతితో రాతల తయారీలు ఆశ్రమాల లోని సన్యాసులకు, మత గురువులకు, చర్చి అధికారులకు, విశ్వ విద్యాలయాల్లో ఆచార్యులకు మాత్రమే అందుబాటులో ఉండేవి. అచ్చుల సహాయంతో అక్షరాలను ముద్రించే విధానం ఈ నేపథ్యంలో ప్రారంభమైనదని చెప్పవచ్చు. అక్షరాలను కచ్చితంగా ఏర్పరిచే అచ్చులను తయారుచేసే సాధనాన్ని కూడా ఆయనే కనుగొన్నాడు. అచ్చులన్నిటికీ ఒకే పరిమాణంలో సిరా పూయటానికి మరో సాధనాన్ని, కావససినంత ఒత్తిడిని మాత్రమే కలగజేసే ఒత్తుడు యంత్రాన్నీ తయారు చేశాకనే అతడు ముద్రణకు పూనుకున్నాడు. వీటి నిర్మాణానికి అయన ఎంతో శ్రమ పడ్డాడు. తొలిసారిగా ఒక పాత జర్మన్ పద్యాన్ని ముద్రించి చూశాడు. ఇది తృప్తి కరంగా వుండటంతో లాటిన్ భాషలో బైబిల్ మొత్తాన్ని ముద్రించటానికి సాహసించాడు. ఒక పేజీకి 42 గీతలు చొప్పున 1282 పేజీలు గల ఆ గ్రంథాన్ని సరైన సదుపాయాలు లేని చిన్న సంస్థ ముద్రించటానికి పూను కోవటం నిజంగా సాహసమే! అనేక సంవత్సరాలు శ్రమించి అతడీ బృహత్కార్యాన్ని 1456 లో పూర్తి చేశాడు. పని పూర్తయ్యే సరికి అతనివద్ద చిల్లిగవ్వ కూడా మిగలలేదు. ఇంత వరకు డబ్బు సమకూరుస్తూ వచ్చిన అతని భాగస్వామి తన వాటా వెంటనే యిచ్చివేయమని పట్టు బట్టాడు. గత్యంతరం లేక ఇంటినీ, వర్క్ షాప్ నీ, ముద్రించిన ప్రతులనూ గ్యూటెన్ బర్గ్ వదిలి వెళ్ళాల్సి వచ్చింది. అతని శేష జీవితం ఎలా గడిచిందో తెలియదు కానీ పదేళ్ళ తరువాత ఓ చర్చి అధికారి తన ఇంట్లో ప్రశాంతంగా జీవితం గడపాలని గ్యూటెన్ బర్గ్ ని ప్రార్థించగా, అతడక్కడే వుండి రెండేళ్ళలో శాశ్వతంగా కన్ను మూశాడు.

# నిశ్శబ్ద సేవకులు: భారత ఆరోగ్య వ్యవస్థను మోస్తున్న మహిళా వైద్యులు

**ఫిబ్రవరి 3...జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం**

వైద్యం మానవ సమాజంలో అత్యంత విశ్వసనీయమైన సేవా రంగం. ప్రాణాన్ని కాపాడే ఈ వృత్తిలో సేవా దృక్పథం ఎంత ముఖ్యమో, సానుభూతి కూడా అంతే కీలకం. ఆ సానుభూతికి సహజ ప్రతిరూపంగా నిలిచింది మహిళా వైద్యుల పాత్ర. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 3న జాతీయ మహిళా వైద్యుల దినోత్సవాన్ని జరుపుకోవడం వెనుక ఉన్న ఆలోచన కేవలం గౌరవ ప్రదర్శన మాత్రమే కాదు; భారత ఆరోగ్య వ్యవస్థలో మహిళల కృషిని గుర్తించి, వారి సేవలకు సామాజిక గుర్తింపును పెంపొందించడమే దీని ప్రధాన ఉద్దేశం. ఈ రోజు ప్రపంచంలో తొలి మహిళా వైద్యురాలిగా గుర్తింపు పొందిన డాక్టర్ ఎలిజబెత్ బ్లాక్‌వెల్ జన్మదినం కావడం కూడా ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది.

భారత సమాజంలో మహిళలకు విద్య, వృత్తి స్వేచ్ఛ లభించని కాలంలో వైద్య రంగంలోకి మహిళలు అడుగు పెట్టడం ఒక విప్లవాత్మక పరిణామం. 19వ శతాబ్దం చివర్లో ఆనంది గోపాల్ జోషి, కడంబినీ గంగూలీ వంటి మహిళలు వైద్య విద్యను అభ్యసించడం అప్పటి సామాజిక నిర్మాణానికి పెద్ద సవాలుగా నిలిచింది. అప్పటి నుండి నేటి ఆధునిక వైద్య వ్యవస్థ వరకు మహిళా వైద్యుల ప్రయాణం అనేక పోరాటాలు, త్యాగాలతో నిండి ఉంది. ఈ చారిత్రక నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుంటే, మహిళా వైద్యుల దినోత్సవం ఒక స్మరణా దినం మాత్రమే కాదు; ఒక సామాజిక మార్పు ప్రయాణానికి గుర్తుగా నిలుస్తుంది.

నేటి భారతదేశ వైద్య రంగంలో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరిగింది. నేషనల్ మెడికల్ కమిషన్ గణాంకాల ప్రకారం, మెడికల్ అండర్‌గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరుతున్న విద్యార్థుల్లో సుమారు 48 నుంచి 50 శాతం వరకు మహిళలే ఉన్నారు. కొన్ని రాష్ట్రాల్లో ఈ సంఖ్య 55 శాతానికి మించి ఉంది. ఇది వైద్య విద్యలో మహిళల ఆసక్తి, ప్రతిభ ఎంతగా పెరిగిందో స్పష్టంగా సూచిస్తుంది. కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నివేదికల ప్రకారం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న డాక్టర్లలో మహిళల వాటా గత రెండు దశాబ్దాల్లో దాదాపు రెట్టింపు అయింది. అయితే ఈ సంఖ్యలు ఆశాజనకంగా కనిపించినప్పటికీ, ఉన్నత స్థాయి వైద్య పరిపాలన, నిర్ణయాధికార స్థానాల్లో మహిళల ప్రాతినిధ్యం ఇంకా పరిమితంగానే ఉంది.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే–5 (NFHS–5) నివేదికలు భారతదేశ ఆరోగ్య సూచికలలో మహిళా వైద్యుల పాత్ర ఎంత కీలకమో వెల్లడిస్తున్నాయి. మాతృ మరణాల రేటు, శిశు మరణాల రేటు తగ్గుదలలో మహిళా వైద్యులు, నర్సులు, ఆశా కార్యకర్తల సమిష్టి కృషి కీలకంగా నిలిచింది. 2000 సంవత్సరంలో ప్రతి లక్ష ప్రసవాలకు 370గా ఉన్న మాతృ మరణాల రేటు, 2019–21 కాలానికి వచ్చేసరికి 97కి తగ్గడం వెనుక మహిళా వైద్యుల నిరంతర సేవలు ప్రధాన కారణంగా పేర్కొన బడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా వైద్యుల లభ్యత పెరిగిన చోట్ల గర్భిణీ సంరక్షణ మెరుగు పడినట్టు ప్రభుత్వ నివేదికలు స్పష్టంగా సూచిస్తున్నాయి. గ్రామీణ భారతంలో మహిళా వైద్యుల అవసరం మరింత ఎక్కువగా ఉంది. సామాజిక సంప్రదాయాల కారణంగా మహిళలు తమ ఆరోగ్య సమస్యలను పురుష వైద్యులతో పంచుకోవడంలో సంకోచించే సందర్భాలు ఇప్పటికీ ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో మహిళా వైద్యులు నమ్మకానికి ప్రతిరూపాలుగా నిలుస్తున్నారు. మాతృ ఆరోగ్యం, కుటుంబ నియంత్రణ, రక్తహీనత నివారణ, బాలికల పోషణ వంటి అంశాల్లో మహిళా వైద్యుల జోక్యం వల్ల ఆరోగ్య అవగాహన గణనీయంగా పెరిగింది. జాతీయ ఆరోగ్య మిషన్ నివేదికలు, మహిళా వైద్యులు ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవల వినియోగం అధికంగా ఉంటుందని స్పష్టం చేస్తున్నాయి.

కరోనా మహమ్మారి కాలం మహిళా వైద్యుల సేవలను దేశం మొత్తం ప్రత్యక్షంగా చూసిన సమయం. ఆరోగ్య మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, కోవిడ్ ఫ్రంట్‌లైన్ వర్కర్లలో దాదాపు 60 శాతం వరకు మహిళలే ఉన్నారు. వైద్యులు, నర్సులు, ల్యాబ్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు—ఈ సమస్త వ్యవస్థను నిలబెట్టిన ప్రధాన శక్తి మహిళలే. కుటుంబానికి దూరంగా ఉంటూ, సంక్రమణ భయాన్ని లెక్కచేయకుండా, ఆసుపత్రుల్లో విధులు నిర్వర్తించిన మహిళా వైద్యులు నిజమైన సేవా స్ఫూర్తికి ప్రతీకలుగా నిలిచారు. అనేక ప్రభుత్వ నివేదికలు ఈ కాలంలో మహిళా వైద్యులు ఎదుర్కొన్న మానసిక ఒత్తిడి, శారీరక ప్రమాదాలు, కుటుంబ విరహ వేదనలను కూడా ప్రస్తావించాయి. ఇండియన్ జర్నల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం, కోవిడ్ కాలంలో పనిచేసిన మహిళా వైద్యుల్లో సుమారు 35 శాతం మంది తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనయ్యారని, అయినా సేవలో వెనక్కి తగ్గలేదని వెల్లడైంది. ఇది వారి వృత్తి నిబద్ధతకు నిదర్శనం.అయితే మహిళా వైద్యుల ప్రయాణం సవాళ్ల రహితమని చెప్పలేం. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పని చేస్తున్న మహిళా వైద్యులు అనేక నిర్మాణాత్మక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, నీతి ఆయోగ్ సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనంలో, పని ప్రదేశాల్లో లింగ వివక్ష, రాత్రి విధుల భద్రత, వృత్తి–కుటుంబ సమతుల్యత వంటి అంశాలు మహిళా వైద్యుల ముందున్న ప్రధాన సవాళ్లుగా పేర్కొనబడ్డాయి. ముఖ్యంగా గర్భధారణ, మాతృత్వ దశలో అనుకూల విధానాలు లేకపోవడం వల్ల కొంతమంది మహిళలు వైద్య వృత్తి నుంచి తాత్కాలికంగా లేదా శాశ్వతంగా తప్పుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ 2022లో విడుదల చేసిన నివేదిక ప్రకారం, మెడికల్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన మహిళల్లో సుమారు 17 నుంచి 20 శాతం మంది వివిధ కారణాలతో యాక్టివ్ ప్రాక్టీస్‌కు దూరమవుతున్నారు.

రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494

# వృత్తి నిబద్ధతకు నిలువెత్తు రూపాలు మహిళా వైద్యులు

**(ఫిబ్రవరి 03న "జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం" సందర్భంగా)**

1849లో అమెరికాలో వైద్య పట్టా పొందిన తొలి మహిళ 'డాక్టర్: ఎలిజబెత్ బ్లాక్‌వెల్' జన్మదినాన్ని పురస్కరించుకుని 2016 నుండి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 03న "జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం (నేషనల్ వూమెన్ ఫిజీషియన్స్ డే)" జరుపుకుంటున్నాం. పవిత్రమైన వైద్య వృత్తి నుండి మహిళలను దూరంగా ఉంచిన అడ్డంకులను ఈ చారిత్రాత్మక సంఘటన బద్దలు కొట్టింది. జాతీయ మహిళా వైద్యుల దినోత్సవ వేదిక వైద్య రంగంలో మహిళల అంకితభావం, పోరాట పటిమ, కరుణ హృదయాలను హైలైట్ చేస్తుంది, అదే సమయంలో కార్యాలయాల్లో లింగ సమానత్వ సాధన, పౌర సమాజ మద్దతు అవసరాన్ని పరిష్కరించడానికి దోహదపడుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఆసుపత్రులు, క్లినిక్‌లు, వైద్య పరిశోధనా రంగాల్లో అద్భుతమైన నైపుణ్యాలు, సహానుభూతి, రోగుల సంరక్షణ, వృత్తి నిబద్ధత కలిగి తమ జీవితాలను వైద్య రంగానికి అంకితం చేసిన మహిళా వైద్యులు ఎందరో మన ముందు ఉన్నారు.

## వైద్య రంగంలో లింగ అసమానతలు:

జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం సందర్భంగా మహిళా వైద్యుల నిస్వార్థ సేవలను గుర్తించడం మాత్రమే కాకుండా, లింగ వేతన అంతరాలు, నాయకత్వ బాధ్యతలతో సహా కొనసాగుతున్న పలు అసమానతలను పరిష్కరించడానికి పిలుపునిస్తున్నది. ప్రస్తుతం దాదాపు 35 శాతం మంది వైద్యులు మహిళలు ఉన్నప్పటికీ, వైద్యపరంగా మరింత మెరుగైన లింగ సమానత్వాన్ని కోరుతున్నారు. ఈ రోజు మహిళా వైద్యులు అభివృద్ధి చెందడానికి, ఆవిష్కరణలు చేయడానికి, అడ్డంకులు లేకుండా నడిపించడానికి సమగ్ర వాతావరణాన్ని కూడా కల్పించాల్సి ఉంటుంది. మహిళా ఫిజీషియన్లు రోగులను నయం చేయడమే కాకుండా, రేపటి తరం మహిళా వైద్యులకు స్ఫూర్తినిస్తున్నారు. పౌర సమాజ జీవితాలను మెరుగుపరచడం, రోగులను జాగ్రత్తగా చూసుకోవడం, ఆధునిక వైద్యం యొక్క సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవడం లాంటి అంశాల్లో వారి నిబద్ధతను అభినందించాలి. దాదాపు మూడింట ఒక వంతు మహిళా వైద్యులందరూ కార్యాలయంలో లైంగిక వేధింపులు, ఎక్కువ మంది లింగ పక్షపాతాన్ని ఎదుర్కొంటున్నారు.

## భారతదేశంలో మహిళా వైద్యులు:


భారతదేశంలో 19వ శతాబ్దం చివరలో పాశ్చాత్య ఆధునిక వైద్యాన్ని మొదటగా అభ్యసించిన డాక్టర్: ఆనందీబాయి జోషి (1886), డాక్టర్: కాదంబినీ గంగూలీ (1886) వంటి మహిళామణులు ఇతర మహిళా వైద్యులకు మార్గదర్శకులుగా ఎదిగారు. ప్రస్తుతం MBBS విద్యార్థులలో దాదాపు 50 శాతం మంది మహిళలు ఉండడం లింగ అంతర నివారణకు గొప్ప సంకేతం. ఎక్కువ మంది మహిళా వైద్యులు ప్రసూతి (60 శాతం), గైనకాలజీ (60 శాతం), పీడియాట్రిక్స్ (58 శాతం), జనరల్ ప్రాక్టీస్ (57 శాతం), పబ్లిక్ హెల్త్ (55 శాతం) రంగాలను ఎంచుకుంటున్నారు, కానీ ఇప్పుడు వారు సూపర్ స్పెషాలిటీల ద్వారా అన్ని రంగాల్లోకి ప్రవేశిస్తున్నారు. సంఖ్య పెరుగుతున్నప్పటికీ, భారతదేశంలోని మొత్తం వైద్యుల్లో 14.2 శాతం మాత్రమే మహిళలు ఉన్నారు. జాతీయ ఆరోగ్య సంస్థలలో నాయకత్వ పాత్రలలో 28 శాతం మాత్రమే మహిళా వైద్యులు నిర్వహిస్తున్నారు. డాక్టర్: ఆనందీబాయి జోషి (మొదటి భారతీయ మహిళా వైద్యులు), డాక్టర్: కేతన్యున్ అర్దేశిర్ దిన్షా (మొదటి మహిళా రేడియోథెరపిస్ట్), డాక్టర్: ఇందిరా హిందూజా (మొదటి టెస్ట్ ట్యూబ్ బేబీని ప్రసవించారు), డాక్టర్: మంజుల అనగాని (లాపరోస్కోపిక్ సర్జన్), డాక్టర్: గగన్‌దీప్ కాంగ్ (రాయల్ సొసైటీ మొదటి మహిళా ఫెలో) వంటి మేటి మహిళా వైద్యులు భారతదేశ వైద్య రంగానికి చారిత్రాత్మక కృషి చేశారు. భారతదేశంలోని మహిళా వైద్యులు నేడు తీవ్రమైన వృత్తి–కుటుంబ సంఘర్షణ, లింగ పక్షపాతం, పరిమిత కార్యాలయ అభద్రత, వివక్షత, వేధింపులు వంటి సవాళ్లను ఎదుర్కొంటున్నారు.

వైద్యులకు వృత్తి–వ్యక్తిగత జీవన సమతుల్యత, మానసిక ఆరోగ్య మద్దతు అవసరాన్ని గుర్తిద్దాం. ప్రస్తుత పౌర సమాజం, తల్లిదండ్రులు తమ యువ బిడ్డలు, బాలికలను వైద్య రంగంలోకి రావడానికి ప్రోత్సహించాలి. మహిళల వైద్య రంగ ప్రవేశం, సమానత్వ సాధనలకు సహాయపడే ఉద్యమాన్ని ప్రారంభించండి. జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం రోజు మహిళా వైద్యుల అద్భుతమైన విజయాలను కొనియాడడం, సహోద్యోగుల సహాయ పడడం, స్నేహితుల ప్రోత్సాహం అందించడం, కుటుంబ సభ్యుల చేయూత, ఇతర వైద్యుల సహకారం, పౌర సమాజం మద్దతు ఇవ్వడం మన కనీస కర్తవ్యం అని భావిద్దాం.

**డాక్టర్ బుర్ర మధుసూధన్ రెడ్డి**
**9949700037**

# మద్యం తాగుతూ వీటిని తింటున్నారా..?

ఆల్కహాల్ తాగడం (మద్యపానం) ఆరోగ్యానికి హానికరం.. ఈ విషయం మందుబాబులందరికీ తెలుసు.. మద్యపానం శరీరానికి ప్రమాదకరం.. దీంతో పలు సమస్యలు వస్తాయని ఆరోగ్య నిపుణులు తరచూ హెచ్చరిస్తుంటారు. అయినా.. చాలా మంది వినరు.. మద్యం తాగుతూ ఎంజాయ్ చేస్తుంటారు. అంతేకాకుండా.. మద్యంతోపాటు.. నాన్ వెజ్, నూనె పదార్థాలు -- ఫ్రైలు, కారంగా ఉండే పదార్థాలను తింటుంటారు.. అయితే.. మద్యంతోపాటు.. కొన్ని ఆహారాలు తీసుకోవడం మరింత హానికరమని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటిలో, చాక్లెట్ తీసుకోవడం మరింత భయంకరమైన పరిణామాలకు దారితీస్తుందని పేర్కొంటున్నారు.



చాలామంది మందుబాబులు మద్యంతో ఏదైనా తినడానికి ఇష్టపడతారు.. కానీ మద్యంతో ఏమి తినాలో, ఏమి తినకూడదో తెలుసుకోవడం ముఖ్యం. మీ డ్రింకింగ్ దినచర్యలో .. మీకు నచ్చిన కొన్ని విషయాలు, పదార్థాలు ఉండవచ్చు.. కానీ వాటిని మద్యంతో తినడం ఆరోగ్యానికి హానికరం. మద్యంతో తినకూడని ఆహారాలు ఏమిటో చూద్దాం..

**మద్యంతోపాటు.. వీటిని తినకండి..**

**చాక్లెట్, స్వీట్లు:** సాధారణంగా చాక్లెట్, స్వీట్లను ఆల్కహాల్ తో కలిపి తినరు. కొంతమంది తమ మత్తును పెంచడానికి చాక్లెట్ తింటారు. అయితే, అలాంటి పొరపాటు ఆరోగ్యానికి హానికరం. చాక్లెట్‌లో కెఫిన్, చక్కెర ఉంటాయి. ఇవి జీర్ణశయాంతర సమస్యలను కలిగిస్తాయి. దీని కారణంగా, మత్తు త్వరగా పెరుగుతుంది.

**వేరుశనగ - బీన్స్:** వేరుశనగ -- బీన్స్ వంటి వాటిని ఆల్కహాల్ తో తీసుకోవడం మంచిది కాదు. కొంతమంది బీన్స్, చిక్‌పీస్, బీన్స్‌లను ఆల్కహాల్ తో తీసుకుంటారు. ఈ ఆహారాలను ఆల్కహాల్ తో తీసుకోవడం వల్ల ఉబ్బరం వస్తుంది. ముఖ్యంగా రెడ్ వైన్ తో బీన్స్‌కు దూరంగా ఉండాలి.

**పిజ్జా -బర్గర్లు:** ప్రజలు పిజ్జా, బర్గర్లు తినడానికి



ఇష్టపడతారు. పిజ్జా తినడం వల్ల కడుపు నిండిపోతుంది. ఇది స్నాక్‌గా కూడా పనిచేస్తుంది. పిండి ఉత్పత్తులను ఆల్కహాల్‌తో తీసుకోవడం కడుపుకు ప్రమాదకరం. ఇది యాసిడ్ రిఫ్లక్స్‌కు దారితీస్తుంది.

బ్రెడ్ - ప్రాసెస్ చేసిన ఆహారాలు: కొంతమంది ఆల్కహాల్ తో శాండ్‌విచ్‌లు లేదా బ్రెడ్ ఫ్రైటర్లు వంటి బ్రెడ్ ఉత్పత్తులను తింటారు. దీనివల్ల గ్యాస్, అజీర్ణం వస్తుంది. ముఖ్యంగా ఆల్కహాల్ తో బ్రెడ్ తింటే, అది కాలేయానికి హానికరమని పేర్కొంటున్నారు.

నూనె పదార్థాలు- నాన్ వెజ్ ఫ్రైలు: మద్యంతో పాటు ఫ్రైలు, కారంగా ఉండే పదార్థాలు తీసుకోవడం మంచిది కాదు.. ఇవి జీర్ణ సమస్యలను కలిగిస్తాయి. అంతేకాకుండా లివర్ ఆరోగ్యానికి హాని చేస్తాయి.

ఆహారం తిన్నా.. తినకున్నా.. మద్యపానం ఆరోగ్యానికి హానికరం.. దీనిని అందరూ దృష్టిలో ఉంచుకోవడం మంచిది..

# ఏ సమయంలో విటమిన్ డీ అధికంగా ఉంటుందంటే..



శరీరంలో విటమిన్-డి లోపం వల్ల ఎముకలు బలహీనపడటం, రోగనిరోధక శక్తి బలహీనపడటం, నిరాశ మొదలైన అనేక సమస్యలు వస్తాయి. అందువల్ల విటమిన్-డి లోపాన్ని నివారించడం చాలా ముఖ్యం.అయితే నేటి బిజీ జీవితంతో పాటు కొన్ని రకాల అలవాట్లు కారణంగా చాలా మందిలో విటమిన్-డి లోపం ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. అయితే ఈ విటమిన్ సహజంగా లభిస్తుంది. సూర్య రశ్మి నుంచి శరీరానికి అందుతుంది. అయితే రోజులో ఏ సమయంలో (బెస్ట్ టైమ్ టు బూస్ట్ విటమిన్-డి) సూర్యరశ్మి తీసుకోవడం చాలా ప్రయోజనకరం అని ఆలోచిస్తున్నారా.. విటమిన్-డిని పెంచుకునేందుకు రోజులో మూడు గంటలు ఉత్తమ సమయం.




**విటమిన్ డి పెంచే ఉత్తమ సమయం**

సూర్య కిరణాల నుంచి శరీరానికి విటమిన్ డి లభిస్తుంది. కనుక ఈ విటమిన్ పొందడానికి సరైన సమయం తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య సమయం విటమిన్ డి ని గ్రహించడానికి ఉత్తమ సమయంగా పరిగణించబడుతుంది. ఈ సమయంలో, %ఖఎదీ% కిరణాలు అత్యధికంగా ఉంటాయి. ఇవి చర్మానికి తాకినప్పుడు విటమిన్ డి ఉత్పత్తి అవుతుంది.

**ఎండలో ఎంతసేపు కూర్చోవాలి?**

తెల్లటి చర్మం ఉన్నవారు 15-20 నిమిషాలు పాటు ఎండలో కూర్చోవాలి. ఎందుకంటే వీరి చర్మం విటమిన్ డిని త్వరగా ఉత్పత్తి చేస్తుంది. అయితే నల్లటి చర్మం ఉన్నవారిలో విటమిన్ డిని ఉత్పత్తి అయ్యేందుకు ఎక్కువ సమయం పడుతుంది. ఎందుకంటే వీరి శరీరంలో అధిక మెలనిన్ కారణంగా విటమిన్ డి సులభంగా ఉత్పత్తి కాదు. అందువల్ల వీరు దాదాపు 30-40 నిమిషాలు ఎండలో కూర్చోవాలి.

**సూర్యరశ్మిలో కూర్చునే సమయంలో ఈ విషయాలను గుర్తుంచుకోండి**

ప్రత్యక్ష సూర్యకాంతిలో కూర్చోండి: గాజు తలుపులున్న కిటికీ వెనుక కూర్చోవడం వల్ల విటమిన్ డి లభించదు.
శరీరంలో కనీసం 40% (చేతులు, కాళ్ళు, వీపు) ప్రత్యక్ష సూర్యకాంతి తగిలేలా కుర్చుకోవాలి. సన్‌స్క్రీన్ అప్లై చేసిన తర్వాత ఎండలో కూర్చోవద్దు, ఎందుకంటే అది విటమిన్ డి శోషణను తగ్గిస్తుంది.
ఎండలో ఎక్కువసేపు ఉండవద్దు. వడదెబ్బ లేదా డీహైడ్రేషన్ సంభవించవచ్చు.
విటమిన్ డి లోపం లక్షణాలు ఏమిటంటే శారీరకంగా అలసటగా, బలహీనంగా అనిపిస్తుంది.ఎముకలు, కీళ్ల నొప్పి సమస్యలతో ఇబ్బంది పడతారు. తరచుగా అనారోగ్యానికి గురి అవుతారు. జుట్టు రాలిపోతుంది. నిరాశగా ఉంటారు. మానసిక స్థితిలో మార్పులు శరీరానికి గాయాలు అయితే అవి మానడంలో జాప్యం జరుగుతుంది.ఎవరైనా ఈ లక్షణాలను గమనించినట్లయితే.. వెంటనే విటమిన్ డి స్థాయి గురించి పరీక్షించుకోడానికి వైద్యుడిని సంప్రదించాలి. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొంత సమయం ఎండలో కూర్చోవడం విటమిన్ డి లోపాన్ని అధిగమించడంలో చాలా సహాయపడుతుంది. దీనితో పాటు, గుడ్లు, చేపలు, పాలు, పుట్టగొడుగులు వంటి విటమిన్ డి అధికంగా ఉండే ఆహారాలను తినే ఆహారంలో చేర్చుకోవాలి.

# త్వరలో తగ్గనున్న స్మార్ట్‌ఫోన్, టీవీల ధరలు..!

నినాదం మార్కెట్

**సామాన్యులకు ఊరట..**

బడ్జెట్ 2026లో దేశ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ఊరట కలిగించే ప్రకటన చేసింది. టీవీలు, స్మార్ట్‌ఫోన్ల తయారీకి ఉపయోగించే విడి భాగాలు, ఇతర పరికరాలపై కస్టమ్స్ డ్యూటీని తగ్గిస్తూ కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో ప్రకటించారు.

దీంతో దేశంలో టీవీలు, స్మార్ట్‌ఫోన్ల ధరలు త్వరలో తగ్గే అవకాశాలున్నాయిన మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఇండియాలో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇంట్లో టీవీలు వాడుతూ ఉంటారు. ఇప్పటివరకు టీవీల ధరలు అధికంగా ఉన్నాయి. అలాగే మొబైల్స్ కూడా ప్రతిఒక్కరూ వాడుతున్నారు. వీటి ధరలు తగ్గనుండటం సామాన్యులకు శుభవార్తగానే చెప్పవచ్చు. భారత్ ఎక్కువగా విదేశాల నుంచి టీవీలు, స్మార్ట్‌ఫోన్ల తయారీకి ఉపయోగించే విడి భాగాలను దిగుమతి చేసుకుంటూ ఉంటుంది. వీటిపై కస్టమ్స్ డ్యూటీని ఇప్పుడు తగ్గించడంతో వాటి ధరలు త్వరలో తగ్గే ఛాన్స్ ఉంది.

**తగ్గనున్న వంటగది ఎలక్ట్రానిక్ వస్తువులు**




ఇక వంట గదిలో ఉపయోగించే పలు ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు కూడా తగ్గనున్నాయి. మైక్రోవేవ్ ఓవెన్లపై కస్టమ్ డ్యూటీని ప్రభుత్వం తగ్గించింది. దీంతో వీటి ధరలు త్వరలో తగ్గున్నాయని తెలుస్తోంది. ఇక చెప్పులు, లెదర్ వస్తువులపై కూడా కస్టమ్స్ డ్యూటీని తగ్గిస్తున్నట్లు బడ్జెట్‌లో నిర్మలమ్మ ప్రకటించారు. దీంతో వాటి ధరలు కూడా త్వరలో పడిపోనున్నాయి. అలాగే వీడియో గేమ్స్ తయారీకి ఉపయోగించే విడి భాగాలపై కూడా పన్ను రాయితీలను కేంద్రం ప్రకటించింది. దీంతో వాటి ధరలు కూడా తగ్గనున్నాయి. అయితే బడ్జెట్‌లో ప్రకటించగానే వెంటనే ధరలు తగ్గవు. బడ్జెట్ ఏప్రిల్ నుంచి అమల్లోకి వస్తోంది. దీంతో ఆ తర్వాత మెల్లమెల్లగా ధరలు తగ్గుతాయి. ఇక ఈవీ బ్యాటరీల ధరలు కూడా తగ్గనున్నాయి. అటు 17 రకాల క్యాన్సర్ మందులపై ప్రాథమిక కస్టమ్స్ డ్యూటీని తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో క్యాన్సర్ రోగులకు ఊరట కలగనుంది.

**వీటి ధరలు పెంపు**

ఇక బడ్జెట్‌లో కొన్ని ధరలు తగ్గనుండగా.. మరికొన్ని ధరలు పెరగనున్నాయి. బొగ్గు, కాఫీ, వెండింగ్ మిషన్ల ధరలు భారీగా పెరగనున్నాయి. సిగరేట్లు, విదేశీ మద్యం ధరలు పెరగనున్నాయి. ఇక పాన్ మసాల్ల ధరలు కూడా భారీగానే పెరగనున్నాయి. ఇక బడ్జెట్‌లో తీసుకున్న నిర్ణయాలతో గడియారాలు, ఖరీజాల ధరలు కూడా పెరగనున్నాయి. దీంతో బడ్జెట్ వల్ల కొన్ని వస్తువుల ధరలు పెరగనుండగా.. మరికొన్ని వస్తువుల ధరలు తగ్గనున్నాయి. బడ్జెట్ వల్ల కొన్ని రంగాలు లాభపడనుండగా.. ధరల పెరుగుదలతో మరికొన్ని రంగాలపై తీవ్ర ప్రభావం చూపనుంది.

## ఆఖర్లో కొనుగోళ్ల మద్దతు..
### దూసుకెళ్లిన సూచీలు




దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాలతో ముగిశాయి. బడ్జెట్‌లో పన్నుపోటుతో నిన్నటి స్పెషల్‌లో భారీ నష్టాలు మూటగట్టుకున్న సూచీలు.. బడ్జెట్‌లోని ఇతర అంశాలపై మదుపర్లు దృష్టి సారించడంతో నేడు దూసుకెళ్లాయి. ముఖ్యంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, అదానీ పోర్ట్స్ షేర్లు సూచీలకు దన్నుగా నిలిచాయి. ఉదయం నష్టాల్లో ప్రారంభమై ఓ మోస్తరు శ్రేణి లాభాల్లో కదలాడిన సూచీలు.. ఆఖర్లో కొనుగోళ్ల మద్దతుతో రాణించాయి. దీంతో మదుపర్ల సంపద ఒక్కరోజులోనే దాదాపు రూ.5 లక్షల కోట్లు పెరిగి రూ.455 లక్షల కోట్లకు చేరింది. నిఫ్టీ మళ్లీ 25వేల మార్కును అందుకుంది.

సెన్సెక్స్ ఉదయం 80,555.68 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 80,722.94) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 81,732.25 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 943.52 పాయింట్ల లాభంతో 81,666.46 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 252.95 పాయింట్ల లాభంతో 25,088.40 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 91.50గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో పవర్ గ్రిడ్ కార్పొరేషన్, అదానీ పోర్ట్స్, బీఈఎల్, రిలయన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా ప్రధానంగా లాభపడ్డాయి. యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్, టీసీఎస్, ట్రెంట్, టైటాన్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 66 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం 4,680 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# మరింత పడిన బంగారం, వెండి ధరలు

**బంగారం, వెండి కొనాలనుకునే వారికి గుడ్‌న్యూస్. వీటి ధరలు మరింత దిగొచ్చాయి. గరిష్ఠాల వద్ద లాభాల స్వీకరణతో శుక్రవారం భారీగా పతనమైన ఈ లోహాల ధరలు.. సోమవారం మరింత దిగువకు చేరాయి. అంతర్జాతీయ స్పాట్ గోల్డ్ మార్కెట్‌లో బంగారం ఔన్సు మరో 6 శాతం క్షీణించి 4,538 డాలర్లకు చేరగా.. వెండి ఔన్సు 74 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. దీన్ని అనుసరించి దేశీయంగానూ వీటి ధరలు తగ్గుముఖం పట్టాయి.**



హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి ధర రూ.1.48 లక్షల వద్ద కొనసాగుతుండగా.. వెండి రూ.2.48 లక్షల వద్ద ట్రేడవుతోంది. ఇటీవల బంగారం రూ.1.80 లక్షలకు, వెండి దాదాపు రూ.4 లక్షలకు చేరిన సంగతి తెలిసిందే. గరిష్ఠ ధరలతో పోలిస్తే చాలావరకు వీటి ధరలు దిగి వచ్చాయి. బంగారం, వెండి కొనుగోలు ప్రణాళిక ఉన్నవారికి ఇటీవల ధరలు షాకివ్వగా.. తాజాగా వీటి ధరలు తగ్గుముఖం పట్టడం అలాంటివారికి ఊరట కలిగించే అంశం.

కమొడిటీల ట్రేడింగ్ జరిగే మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో 10 గ్రాముల బంగారం ఏప్రిల్ కాంట్రాక్టు ధర రూ.1,39,446 వద్ద కొనసాగుతోంది. దాదాపు 6 శాతం మేర పతనమైంది. కిలో వెండి మార్చి కాంట్రాక్టు ధర ఏకంగా 14.55 శాతం క్షీణించి రూ.2.27 లక్షల వద్ద కొనసాగుతోంది.

కారణాలు ఇవే..
అమెరికా ఫెడరల్ రిజర్వ్ చీఫ్‌గా జెరోమ్ పావెల్ స్థానంలో కెవిన్ వార్ష్ పేరును ట్రంప్ ప్రతిపాదించడంపై మదుపర్లు ప్రతికూలంగా స్పందించడంతో వీటి ధరల్లో కరెక్షన్ జరిగింది. ఇతర కరెన్సీలతో పోలిస్తే డాలర్ బలోపేతం కావడంతో వీటి ధరలు దిగి వస్తున్నాయి. రాకెట్ వేగంతో దూసుకెళ్లిన ఈ రెండు లోహాల్లో మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం ఇంకో కారణం. అంతర్జాతీయ స్పాట్ గోల్డ్ మార్కెట్‌లో ఎప్పుడూ లేనివిధంగా బంగారం ఔన్సు 5,600 డాలర్లు, వెండి 122 డాలర్లకు చేరిన సంగతి తెలిసిందే. మరోవైపు ఇరాన్‌తో డీల్ ఉంటుందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకేతాలు ఇవ్వడంతో భౌగోళిక అనిశ్చితులు తగ్గుముఖం పట్టొచ్చన్న అంచనాలు తోడయ్యాయి. దీనివల్ల కూడా ఈ రెండు లోహాల ధరలు దిగి వస్తున్నాయని అనలిస్టులు పేర్కొంటున్నారు.

# ఆరోగ్యానికి అమృతం.. సపోటా
## ఈ ఫలం తినకపోతే చాలా నష్టపోతారు!

మనం సపోటాను సాధారణ పండుగానే తీసుకుంటాం. కానీ, సపోటా వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి చాలా మందికి తెలియకపోవచ్చు. పోషకాలతో నిండిన ఈ పండు మనకు చాలా సులభంగా దొరుకుతుంది. దుకాణాల్లోనే కాదు, చాలా ఇళ్లలో కూడా ఇది సాధారణంగా కనిపిస్తుంది. అయినప్పటికీ, సపోటా యొక్క నిజమైన ఆరోగ్య ప్రయోజనాలు చాలామందికి ఇంకా తెలియవు.

సపోటాను పచ్చిగా తినవచ్చు లేదా రసంగా తీసుకోవచ్చు. ప్రతిరోజూ ఆహారంలో సరైన మోతాదులో సపోటాను చేర్చుకుంటే, అనేక ఆరోగ్య సమస్యలను నియంత్రించుకోవచ్చు అని నిపుణులు చెబుతున్నారు.

ప్రతిరోజూ సపోటా తింటే కలిగే లాభాలు

మన రోజువారీ ఆహారంలో సపోటాను చేర్చుకోవడం వల్ల శరీరానికి అవసరమైన అనేక పోషకాలు అందుతాయి. ముఖ్యంగా ఇందులో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది.
వారానికి కనీసం మూడు సార్లు సపోటా తినడం వల్ల మలబద్ధకం సమస్యలు తగ్గుతాయి. జీర్ణ సంబంధిత ఇబ్బందులు ఉన్నవారికి ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది.




గుండె ఆరోగ్యానికి మేలు



సపోటాలో పొటాషియం, మెగ్నీషియం వంటి ముఖ్యమైన ఖనిజాలు ఉన్నాయి. ఇవి రక్త ప్రసరణను మెరుగుపరచి గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. గుండెపోటు ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా ఇవి సహాయపడతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

**కంటి చూపు, చర్మ సంరక్షణకు ఉపయోగకరం**

కంటి సమస్యలు ఉన్నవారికి సపోటా మంచి ఆహారంగా పరిగణించబడుతుంది. ఇందులో ఉండే విటమిన్‌ూా కంటి చూపును మెరుగుపరుస్తుంది. అదేవిధంగా, విటమిన్ జు చర్మ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. చర్మం మెరిసేలా ఉండేందుకు సపోటా తోడ్పడుతుంది.



రోగనిరోధక శక్తి పెరుగుదల

సపోటాలో విటమిన్ జ, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీర రోగనిరోధక శక్తిని పెంచుతాయి. తరచూ అలసట, నీరసం అనుభవించే వారికి ఇది మంచి శక్తినిచ్చే పండు. రోజూ సపోటా తినడం వల్ల శరీరం ఉత్సాహంగా ఉంటుంది.

**రోజుకు ఎన్ని సపోటా తినాలి?**

నిపుణుల సూచనల ప్రకారం, రోజుకు 1 నుంచి 2 మధ్యతరహా సపోటాలు తినవచ్చు. డయాబెటిస్ ఉన్నవారు కూడా పరిమిత మోతాదులో, వైద్యుల సలహాతో సపోటాను తీసుకోవచ్చు. మొత్తానికి, తక్కువ ఖర్చుతో సులభంగా లభించే సపోటా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. కాబట్టి, మీ రోజువారీ ఆహారంలో ఈ పోషక విలువల పండును తప్పక చేర్చుకోండి.



# ఈసారి రాజిరెడ్డికే మా ఓటు..

ఏ పదవిలేకుండానే అంతచేసిండు..
ఆదరించి గెలిపిస్తే అన్నీ చేస్తడు
మక్కాన్ సింగ్ మెచ్చినోడు,
అన్నివేళలా మనోడు
తెగేసి చెబుతున్న 23వ డివిజన్ జనం..
ప్రచారంలో బెంద్రం ప్రభంజనం





కొంతకాలం క్రితం డ్రెయినేజీ పనులు పరిశీలిస్తున్న ( ఫైల్ )

**గోదావరిఖని,ఫిబ్రవరి 02(నినాదం):** పలుమార్లు వేసిన తమ ఓటు వృధాగా పోయిందని, ఏదేమైనా, ఎవరెన్ని ప్రలోభాలు చూపినా ఈసారి మాత్రం తమ ఓటు రాజిరెడ్డికేనని ఆ డివిజను ప్రజలు గంటా పథంగా చెబుతున్నారు. కొద్దిరోజుల్లో జరగనున్న మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా రామగుండం కార్పోరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో ప్రచారం జోరందుకుంది. ఇందులో భాగంగా 23 వ డివిజను ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థి బెంద్రం రాజిరెడ్డికి బ్రంహ్మరథం పడుతున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన చేస్తున్న ఇంటింటి ప్రచారం, విజయోత్సవ ర్యాలిని తలపిస్తోంది. ఈ సందర్భంగా రాజిరెడ్డికి లభిస్తున్న ఆదరణ ప్రత్యర్థుల గుండెల్లో గుబులు రేకెత్తిస్తోంది.కేవలం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తో ఉన్న అనుబంధం మినహా ఏ పదవీ లేకుండానే డివిజన్లో ఇన్ని సమస్యలు పరిష్కరించిన రాజిరెడ్డి, కార్పోరేటర్ గా గెలిస్తే మిగతా అన్నిసమస్యలూ పరిష్కరిస్తాడనే ధీమా వ్యక్తం చేస్తున్నారు.వెరసీ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆశీర్వాదం సైతం తోడై అభివృద్ధితో పాటు సంక్షేమమూ అందుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### రాజన్న ఆశీర్వాదం, ప్రజల ఆదరణతోనే ముందుకు...

- 23వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి బెంద్రం రాజిరెడ్డి

మా ప్రియతమనేత, మార్గదర్శకుడు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆశీర్వాదం, నా ప్రజల ఆదణతోనే డివిజన్లో దశాబ్దాలుగా పాతుకుపోయిన అనేక సమస్యలు పరిష్కరించుకోగలిగాము. ఈసారి కూడా కార్పోరేటర్‌గా బరిలో ఉన్నాను, నా ప్రజలు ఆదరించి అవకాశమిస్తే గత ఒరవడే కొనసాగించి 23వ డివిజను సంపూర్ణ సర్వతోముఖాభివృద్ధికి కృషిచేస్తానని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను.

# బీ ఫారాలు అందుకుంటున్న అభ్యర్థులు

## పార్టీలు మారుతున్న నిరాశవాధులు



**వికారాబాద్, ఫిబ్రవరి 2 (నినాదం):** జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో నామినేషన్ల పర్వం ముగిసింది. నాలుగు మున్సిపాలిటీలో మొత్తం 787 నామినేషన్లు వేశారు. కొడంగల్‌లో 12 వార్డులకు గాను 43 మంది 52 నామినేషన్లు వేశారు. వీటిలో బీజేపీ ఐదు, సిపిఐ ఎం ఒకటి, కాంగ్రెస్ 25, ఏ ఐ ఎం ఐ ఎం నాలుగు, బి ఆర్ ఎస్ 19, స్వాతంత్ర అభ్యర్థులు 18, మొత్తం 72, పరిగి 18 వార్డులు 78 మంది అభ్యర్థులు, 115 నామినేషన్లు, బీజేపీ 31, సీ పి ఐ ఎం మూడు, కాంగ్రెస్ 46, బి ఆర్ ఎస్ 60, గుర్తింపు పొందిన ఆయా పార్టీలనుండి రెండు, స్వాతంత్ర అభ్యర్థులు 16 మొత్తం 158, తాండూర్ మొత్తం 36 వార్డులు, 85 మంది అభ్యర్థులు 165 నామినేషన్లు దాఖలు చేశారు. వాటిలో బి ఎస్ పి ఒకటి, బీజేపీ 49, కాంగ్రెస్ 88, ఏ ఐ ఎం ఐ ఎం 16, బి ఆర్ ఎస్ 60, గుర్తింపు పొందిన ఆయా పార్టీలు రెండు, స్వాతంత్ర అభ్యర్థులు 15, మొత్తం 273, వికారాబాద్ 34 వార్డులకు 180 మంది అభ్యర్థులు 189 నామినేషన్లు దాఖలు చేశారు. బీజేపీ 45, సీపీఐ ఎం ఒకటి, కాంగ్రెస్ 130, ఏ ఐ ఎం ఐ ఎం 12, బి ఆర్ ఎస్ 82, గుర్తింపు పార్టీలు మూడు, స్వాతంత్ర అభ్యర్థులు 11 మొత్తం 284 నామినేషన్లను దాఖలు చేశారు. అయితే బి ఫారాలు సమర్పించిన వారికి ఆయా పార్టీల గుర్తులు లభించనున్నాయి. మిగతా వారికి నిబంధనల ప్రకారం అధికారులు ఆయా గుర్తులపై ఎన్నికల బరిలో కొనసాగనున్నారు. బిఫారాలు రానివారు ఇతర పార్టీలల్లో కలిసి పోతున్నారు. వారిని బుజ్జగించే పనిలో ఆయా పార్టీల అధిష్టానం నిం‌గ్నమైయింది. అయినా పార్టీలు మారుతున్న వైనం కొనసాగుతోంది. నేడు అభ్యర్థుల తుది జాబితాను అధికారులు ప్రకటించానున్నారు.

# 7లోగా ఇరిగేషన్ వాటర్ బాడీస్ గణన పూర్తిచేయాలి

## కలెక్టర్ చంద్రశేఖర్



**నల్లగొండ ప్రతినిధి ఫిబ్రవరి2 (నినాదం):** ఫిబ్రవరి 7లోగా అన్ని ఇరిగేషన్ వాటర్ బాడీస్ గణన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో 7వ చిన్న నీటిపారుదల గణన, 2వ జలవనరుల గణనపై సమీక్ష సమావేశం నిర్వహించారు జిల్లాలో జరుగుతున్న 7వ చిన్న నీటిపారుదల గణన, 2వ జలవనరుల గణనతో పాటు సెవెంత్ మేజర్ ఇరిగేషన్ వాటర్ బాడీస్‌కు సంబంధించిన గణన పనులు ఎక్కడా పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు చెప్పారు.ప్రత్యేకంగా మైనర్ ఇరిగేషన్ పరిధిలో ఉన్న చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లు, అలాగే మేజర్ ఇరిగేషన్ కింద ఉన్న నీటి వనరులు, బోర్లు, బావులకు సంబంధించిన వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఖచ్చితంగా నమోదు చేయాలని అన్నారు.గణన ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం లేదా ఆలస్యం జరగకుండా శాఖల మధ్య సమన్వయంతో పని చేయాలని, ప్రతి వాటర్ బాడీ వివరాలు పూర్తిగా నమోదు చేసి ఫిబ్రవరి 7, 2026లోగా గణనను తప్పనిసరిగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ గణన ద్వారా జిల్లాలోని నీటి వనరుల వాస్తవ స్థితిగతులు వెలుగులోకి వస్తాయని, భవిష్యత్తులో సాగునీటి ప్రణాళికలు, నీటి సంరక్షణ చర్యలు చేపట్టేందుకు ఇది బలమైన ఆధారంగా నిలుస్తుందని కలెక్టర్ తెలిపారు. సంబంధిత అధికారులు, గణన సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించి గణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి. ఇరిగేషన్, వ్యవసాయ,రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు, తహసిల్దార్ ఏఈఓస్ జిపిఓస్ ఫీల్డ్ అసిస్టెంట్ పంచాయతీరాజ్ సెక్రెటరీ టెక్నికల్ అసిస్టెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కోడ్‌కు బహిరంగ సవాల్... రేషన్ మాఫియా రాజ్యం.!

ఎన్నికల కోడ్ కాగితాలకేనా?
మాఫియాకు స్వేచ్ఛేనా..?




**మెట్‌పల్లి, ఫిబ్రవరి 2 (నినాదం):** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ మెట్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో అక్రమ రేషన్ రవాణా యంత్రాంగబద్ధంగా కొనసాగుతోంది. పేదలకు చేరాల్సిన రేషన్ సరుకులు బహిరంగంగానే దందాగా మారుతున్నా అమలు యంత్రాంగం మౌనంగా ఉండటం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. స్థానికుల విశ్వసనీయ సమాచారం ప్రకారం రేషన్ షాపుల వద్ద దళారులు ముందుగానే కాపుకాసి రేషన్ సరుకులు కొనుగోలు చేసి, ద్విచక్ర వాహనాలపై పలు వార్డులో తరలిస్తున్నారు. అక్కడ డంపులుగా ఏర్పాటు చేసిన అనంతరం బొలెరో, ఐచర్ వాన్ల ద్వారా రాత్రిపూట వారి వాహనాల్లో జగిత్యాల, ఆర్మూర్, బోధన్ ప్రాంతాల్లోని రైస్ మిల్లులకు నేరుగా తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో సంక్షేమ పథకాల సరుకులపై కఠిన నిఘా ఉండాల్సి ఉండగా, ఇంత పద్ధతిగా అక్రమ రవాణా సాగుతుండటం వెనుక రాజకీయ అండదండలే ఉన్నాయన్న అనుమానాలు బలపడుతున్నాయి. సమాచారం ఉన్నా చర్యలు తీసుకోకపోవడం సాధారణ నిర్లక్ష్యమా? లేక పైస్థాయి “మౌన ఆమోదం” ఫలితమా? అన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

**ఎన్నికల వేదికలపై సంక్షేమం పేర్లు**

పేదల కోసం కేటాయించిన రేషన్‌బియ్యం మిల్లులకు చేరుతుంటే, ఎన్నికల వేదికలపై మాత్రం సంక్షేమం పేరుతో హామీలు గుప్పించడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ కేవలం కాగితాలకే పరిమితమై, క్షేత్రస్థాయిలో మాత్రం రేషన్ మాఫియానే రాజ్యమేలుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం, ఎన్నికల అధికారులు రాజకీయ ఒత్తిళ్లను పక్కనపెట్టి స్పందించి అక్రమ రేషన్ రవాణాపై తక్షణమే దాడులు చేపట్టి డంపులను సీజ్ చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

NINADAM CINEMA

# మూవీగా వస్తోన్న మిర్జాపూర్ వెబ్ సీరిస్




పంకజ్ త్రిపాఠి, శ్వేతా త్రిపాఠి, అలీ ఫజల్, హర్షిత గౌర్, విజయవర్మ తదితరులు నటించారు.

యాక్షన్ క్రైం థ్రిల్లర్‌గా ప్రేక్షకుల ముందుకొచ్చి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచిన ఫ్రాంచైజీ సిరీస్ మిర్జాపూర్. ఈ సిరీస్‌లో ఇప్పటికే మూడు సీజన్లు సందడి చేశాయి. పవర్ ఫుల్ క్యారెక్టర్లతో సాగే మూడు సీజన్లకు ప్రేక్షకుల వద్ద నుంచి అదిరిపోయే స్పందన వచ్చింది. కాగా ఈ యూనివర్స్‌ను మరింత ఎక్కువ మంది ప్రేక్షకులకు అందించేందుకు మేకర్స్ సరికొత్త ప్లాన్‌తో వస్తున్నారు. మిర్జాపూర్ ఇక ఫీచర్ ఫిల్మ్‌గా రానుంది. ఈ సినిమా కథను థియేటర్లలో అద్భుతమైన థియాట్రికల్ ఎక్స్‌పీరియన్స్ అందించేలా డిజైన్ చేశారని ఇన్‌సైడ్ టాక్. మిర్జాపూర్ ది ఫిల్మ్ అధికారికంగా షూటింగ్ పూర్తి చేసుకుంది. ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకున్న ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉందని తెలియజేశారు. క్రైం సాగాను బిగ్ స్క్రీన్‌పై ఎలా చూపించబోతున్నారని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు మూవీ లవర్స్. ఈ చిత్రంలో పాపులర్ యాక్టర్లు పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గుర్మీత్ సింగ్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రానికి పునీత్ కృష్ణ కథనందిస్తున్నారు. ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రితేశ్ సిధ్వానీ, ఫర్హాన్ అక్తర్ నిర్మిస్తున్నారు. విడుదలకు సంబంధించిన వివరాలపై త్వరలోనే క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. గుర్మీత్‌సింగ్, ఆనంద్ అయ్యర్ సంయుక్తంగా దర్శకత్వం వహించిన మిర్జాపూర్ వెబ్ సిరీస్‌లో

## ఓటిటిలో ట్రెండ్ అవుతున్న

# శంబాలా



ఆది సాయికుమార్ నటించిన మిస్టిల్ థ్రిల్లర్ మూవీ 'శంబాల'. గతేడాది చివర్లో విడుదలైన ఈ సినిమా జనవరి 22న ఆహా వేదికగా ఓటీటీలోకి అందుబాటులోకి వచ్చింది. తాజాగా ఈ చిత్రం ఓటీటీలో రికార్డు సృష్టించింది. 10 రోజుల్లో 100 మిలియన్ స్ట్రీమింగ్ మినిట్స్ దాటి అత్యధికంగా వీక్షించిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ.. ప్రేక్షకులకు చిత్రబృందం కృతజ్ఞతలు తెలిపింది. యుగంధర్ ముని దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అర్చన అయ్యర్ హీరోయిన్. కథేంటంటే..: 1980వ దశకం నేపథ్యంలో సాగే కథ ఇది. వెయ్యేళ్ల చరిత్ర ఉన్న ఓ ఊరు శంబాల. అక్కడ ఆకాశం నుంచి ఓ ఉల్క పడుతుంది. అప్పటినుంచి ఊరిలో అనూహ్యమైన సంఘటనలు జరగడం మొదలవుతాయి. ఉన్నట్టుండి ఎవరో ఒకరు విచిత్రంగా ప్రవర్తిస్తూ హత్యలు చేస్తారు, ఆత్మహత్యలకు పాల్పడతారు. దాంతో బండ భూతం ఆవహించిందంటూ ఊరి జనం భయంతో వణికిపోతుంటారు. మూఢ నమ్మకాలు రాజ్యమేలుతాయి. ఆ రహస్యాలను ఛేదించేందుకు ప్రభుత్వం విక్రమ్ (ఆది సాయి కుమార్) అనే యువ శాస్త్రవేత్తని ఆ గ్రామానికి పంపిస్తుంది. సైన్స్‌నే నమ్ముకుని విధులు నిర్వర్తించే విక్రమ్ ఆ ఊళ్లో జరుగుతున్న సంఘటనల వెనక రహస్యాల్ని ఛేదించాడా? ఆ ఊరిలో కనిపించిన దేవి (అర్చన అయ్యర్) ఎవరు? విక్రమ్ నమ్ముకున్న సైన్స్‌కీ, ఊరి చరిత్ర వెనకున్న శాస్త్రానికి మధ్య సంఘర్షణ ఎలా సాగిందన్నది మిగతా కథ.

# కొత్త తారలతో మ్యాడ్-3 చిత్రీకరణ



టాలీవుడ్‌లో యూత్‌ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌లుగా భారీ విజయాలను అందుకున్న 'మ్యాడ్', 'మ్యాడ్ 2' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్లుగా నిలిచిన విషయం తెలిసిందే. దర్శకుడు కళ్యాణ్ శంకర్ తెరకెక్కించిన ఈ రెండు చిత్రాలు యువతను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఫన్, ఫ్రెండ్‌షిప్, కాలేజ్ బ్యాక్‌డ్రాప్‌తో సాగిన ఈ సిరీస్‌కు ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఏర్పడింది. నార్నె నవీన్, రామ్ నితిన్, సంగీత్ శోభన్ హీరోలుగా నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఈ సక్సెస్‌ఫుల్ ఫ్రాంచైజీకి కొనసాగింపుగా 'మ్యాడ్ 3' ను తెరపైకి తీసుకురావడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించిన నిర్మాతలు, ఈసారి కొత్త కాన్సెప్ట్‌తో పాటు కొత్త కాస్టింగ్‌ను కూడా పరిచయం చేయాలని భావిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. గత చిత్రాల్లో కనిపించిన హీరోల స్థానంలో ఈసారి కొత్త యువ నటులను తీసుకొస్తున్నట్లు సమాచారం. ఈ కొత్త కాస్టింగ్‌లో భాగంగా 'లిటిల్ హార్ట్స్' ఫేమ్ జేయ్ కృష్ణ, 'కోర్ట్' ఫేమ్ హర్ష్ రోషన్ పేర్లు వినిపిస్తున్నాయి. యంగ్ టాలెంట్‌ను ప్రోత్సహిస్తూ ఫ్రెష్ ఫేస్‌లతో ఈ చిత్రాన్ని రూపొందించాలన్న ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో సినిమాకు 'మ్యాడ్ జూనియర్స్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు ఫిల్మ్‌నగర్‌లో ప్రచారం జరుగుతోంది. టైటిల్ ద్వారా కూడా ఈ చిత్రం కొత్త తరం యువత కథగా ఉండబోతుందనే సంకేతాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ మూవీ షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైనట్లు సమాచారం. త్వరలోనే ఫస్ట్ లుక్, టీజర్ వంటి అప్డేట్స్ విడుదల చేసే అవకాశముంది. హాస్యం, ఫ్రెండ్‌షిప్, కాలేజ్ లైఫ్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రం రూపొందనుందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# జైలర్-2లో షారూఖ్‌ఖాన్

తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ కాంపౌండ్ నుంచి రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ క్రేజీ సీక్వెల్ జైలర్ 2. తలైవా టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ఈ చిత్రానికి కోలీవుడ్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. సీక్వెల్‌లో శివరాజ్‌కుమార్, మోహన్ లాల్ పాత్రలు రిపీట్ కానున్నాయని ఇప్పటికే వార్తలు వచ్చాయి. మరోవైపు తాజాగా బాలీవుడ్ బాద్ షా షారుక్ ఖాన్ ఇందులో కీలక పాత్రలో నటిస్తున్నాడని అప్‌డేట్ కూడా వచ్చింది. కాగా దీనిపై అఫీషియల్ న్యూస్ అభిమానుల్లో జోష్ నింపుతోంది. జైలర్ 2 నెక్స్ట్ షెడ్యూల్ ముంబైలో జరుగనుంది. తాజా సమాచారం ప్రకారం వచ్చే వారం షురూ కానున్న ఈ షెడ్యూల్‌లో షారుక్ ఖాన్ జాయిన్ అవ్వబోతున్నాడు. ఈ షెడ్యూల్‌లో షారుక్‌ఖాన్‌పై వచ్చే కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. మొత్తానికి నెల్సన్ దిలీప్ కుమార్ షారుక్ ఖాన్‌ను ఎలాంటి స్పెషల్ రోల్‌లో చూపించబోతున్నాడు.. తలైవా, షారుక్ ఖాన్ కాంబోలో సీన్లుంటాయా..? అన్నది తెలియాల్సి ఉంది. సిల్వర్ స్క్రీన్‌పై ఇద్దరు స్టార్ యాక్టర్లను చూసేందుకు ఎక్సయిటింగ్‌గా ఎదురుచూస్తున్నారు మూవీ లవర్స్, అభిమానులు. జైలర్ 2ను 2026 జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నామని ఇప్పటికే రజినీకాంత్ క్లారిటీ కూడా ఇచ్చాడని తెలిసిందే. సీక్వెల్‌లో బాలీవుడ్ భామ విద్యాబాలన్‌తోపాటు కోలీవుడ యాక్టర్ సంతానం కీలక పాత్రల్లో నటిస్తున్నారని తెలుస్తుండగా.. మరి రాబోయే రోజుల్లో ఈ స్టార్ యాక్టర్లపై అఫీషియల్ అప్‌డేట్ ఏమైనా ఇస్తారేమో చూడాలి. జైలర్ ఫస్ట్ పార్టులో రమ్యకృష్ణ, వినాయకన్, వసంత్ రవి, మోహన్ లాల్, శివరాజ్ కుమార్, తమన్నా కీలక పాత్రల్లో నటించారని తెలిసిందే. సీక్వెల్‌లో ఎవరెవరుండబోతున్నారన్నదానిపై మేకర్స్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.



## ఎలిగెంట్ లుక్‌లో డెకాయిట్ బ్యూటీ..

హను రాఘవపూడి దర్శకత్వంలో వచ్చిన 'సీతారామం' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిపోయిన యంగ్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. తన ఫస్ట్ మూవీలో సీత క్యారెక్టర్‌లో కట్టు బొట్టుతో ప్రేక్షకులను అలరించింది ఈ ముద్దుగుమ్మ. అలా ఒక్క సినిమాతో తెలుగు ప్రేక్షకులు ఈమెను సొంతింటి ఆడపడుచులా ఓన్ చేసుకున్నారు. దీంతో ఈ భామకు వరుస అవకాశాలు వచ్చాయి. అలా నాని సరసన హాయ్ నాన్న, విజయ్ దేవరకొండ సరసన ది ఫ్యామిలీ స్టార్ వంటి చిత్రాల్లో నటించింది. ప్రస్తుతం అడవి శేష్ హీరోగా నటిస్తున్న డెకాయిట్ సినిమాలో యాక్ట్ చేస్తోంది. ఇక ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఓ పక్క సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న ఈ చిన్నది మరో పక్క సోషల్ మీడియాలో కూడా చాలా యాక్టీవ్‌గా ఉంటూ అభిమానులకు దగ్గరవుతూ ఉంది. నిత్యం ట్రెండీ అవుట్ ఫిట్‌లో మెరుస్తూ ఫాలోవర్స్‌ను పెంచుకుంటుంది. ఈ క్రమంలో ఈ భామ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఆరెంజ్ కలర్ ఎలిగెంట్ అవుట్ ఫిట్‌లో దర్శనమిచ్చింది. స్టన్నింగ్‌లో లుక్‌లో తన పెద్ద పెద్ద కళ్లతో చూస్తూ మెస్మరైజ్ చేసింది. థైస్ పార్ట్స్ కనిపించేలా బోల్డ్ షో చేస్తూ ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787